23 . 08. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శనివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 87 , పేజీలు : 12 వెల:రూ.5/-

SIMULANEOUSLY PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## వైద్యశాఖలో ఖాళీల భర్తీకి నిర్ణయం

- 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్




## అవినీతి వ్యతిరేక పోరాటం ఆగదు

- దీనిపై చట్టం తీసుకుని వస్తే వ్యతిరేకిస్తే ఎలా
- బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ వెల్లడి



**పాట్నా,ఆగస్ట్22( వెలుతురు):** అవినీతి వ్యతిరేక పోరాటం ఆగదని, దీనిని సమర్థించే నేతలకు ప్రజలే బుద్ది చెబుతారని ప్రధాని మోడీ అన్నారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నప్పుడు.. జైలు శిక్ష అనుభవించిన ఒక ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోదీ

## 25న తెలంగాణ కేబినేట్ భేటీ

- బిసి రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై చర్చ
- కాళేశ్వరం నివేదికపైనా చర్చించే అవకాశం



**హైదరాబాద్,ఆగస్ట్22(వెలుతురు):** తెలంగాణ మంత్రివర్గ సమావేశం సచివాలయంలో ఈనెల 25న సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం. మరో వైపు పంచాయతీ ఎన్నికల కోసం హైకోర్టు విధించిన గడువు

## ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి రూ.2 లక్షల కోట్లు ఖర్చు

- మోదీ పాలనలో మేఘాలయలో మెరుగైన జీవన ప్రమాణాలు
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- మేఘాలయలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుపై సమీక్ష




**మేఘాలయ వెలుతురు ఆగస్టు 22:** ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిపై నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి దాదాపు రూ. 2 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. యూపీఏ హయాంతో పోలిస్తే మోదీ పాలనలో మేఘాలయలో ప్రజల జీవన ప్రమాణలు ఎంతో మెరుగయ్యాయని చెప్పారు. ముఖ్యంగా విద్య,

## హైకోర్టులో కెసిఆర్, హరీష్‌లకు చుక్కెదురు

- పిసి ఘోష్ కమిషన్‌పై స్టేకు నిరాకరణ
- అసెంబ్లీలో చర్చించాకే ముందుకు వెళతాం
- హైకోర్టుకు వివరించి ప్రభుత్వం
- విఛారణ నాలుగు వారాలకు వాయిదా





**హైదరాబాద్,ఆగస్ట్22( వెలుతురు):** మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు హైకోర్టులో చుక్కెదురైంది. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. పూర్తిస్థాయి కౌంటర్‌ను దాఖలు చేయాలని అడ్వకేట్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు అసెంబ్లీలో చర్చించిన తరువాతే తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రస్తుతం కేసీఆర్, హరీష్‌రావు ఎమ్మెల్యేలు కాబట్టి.. అసెంబ్లీలో చర్చించాకే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ప్రభుత్వంపై కూడా హైకోర్టు సీరియస్ అయింది. ముందస్తుగా మీడియా సమావేశం నిర్వహించి.. 60 పేజీల రిపోర్ట్ బయట పెట్టడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అన్ని పబ్లిక్ డొమైన్ నుంచి వెంటనే రిపోర్ట్ తొలగించాలని ఆదేశించింది. కమిషన్ 8ఇ, 8ఈ నోటీసులు ఇవ్వకుండా.. పిటీషనర్లపై ఆరోపణలు చేయడం చట్టవిరుద్ధమని అభిప్రాయ పడింది. మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇక రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే రేవంత్ ప్రభుత్వం కమిషన్ వేసిందని కేసీఆర్, హరీష్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ కొనసాగింది. అందులో భాగంగా శుక్రవారం కేసీఆర్, హరీష్‌రావు

## ఓట్ల తొలగింపులో రాజకీయ పార్టీల తీరుపై విస్మయం



- బూత్ స్థాయిలో ఓటర్లకు సాయం చేయాలని సుప్రీం సూచన
- ఓటు సవరణకు గడువు పెంచాలని ఇసికి ఆదేశం

## కెసిఆర్ పాలనలో యూరియా కొరత లేదు

- ముందస్తు ప్రణాళికతో గ్రామాల్లోకి సరఫరా
- అసమర్థ పాలనతో ఇప్పుడు అనేక సమస్యలు
- ప్రజలకు కూడా కెసిఆర్ పాలనంటే తెలిసింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్



## సీఎస్ఆర్ నిధులతో మండలానికోఅంబులెన్స్

- తెలంగాణలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో ముందంజ
- యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగ పత్రాలు
- ప్రజాభవన్ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్,ఆగస్ట్22( వెలుతురు):** సీఎస్ఆర్ నిధులతో ప్రతి మండలానికి అంబులెన్స్ ఏర్పాటు చేస్తాం అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురుకులాల విషయంలో ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికలతో వెళ్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎనర్జీ పాలసీ తీసుకొచ్చాం. రెప్పపాటు– కూడా విద్యుత్ పోకుండా చర్యలు చేపడుతున్నాం అని అన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులకు ప్రజాభవన్ లో

## కేజ్రీవాల జైలులో ఉంటూ ప్రభుత్వాన్ని నడిపారు

- రేపు ఎవరైనా ఇలాగే చేస్తే ..ఎలా ?
- అందుకే అవినీతి కేసుల్లో సమస్య రాకుండా చట్టం
- విపక్షాల అభ్యర్థి సుదర్శన్ రెడ్డి వామపక్షవాది
- కేరళల పర్యటనలో హోంమంత్రి అమిత్ షా



**తిరువనంతపురం,ఆగస్ట్22( వెలుతురు):** తప్పు చేస్తే నేతలను పదవుల నుంచి తొలగించే బిల్లును తీసుకు రావడాన్ని హోంమంత్రి అమిత్ షా సమర్థించారు. అవినీతి తదితర ఆరోపణల్లో జైలుకు వెళ్లినా పదవులు పట్టుకుని వేళ్లాడడం వల్లనే ఈ బిల్లు ఆవశ్యకత ఏర్పడిందని అన్నారు. కేరళలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అమిత్‌షా దీనిపై మాట్లాడారు. భారత్ స్వాతంత్ర్యం పొందిన ఈ 75 ఏళ్లలో ఇలాంటి బిల్లు ఎప్పుడూ రాలేదన్నారు. ఈ చట్టం ఎంత అవసరమో తెలుపుతూ.. దిల్లీ మాజీ సీఎం కేజీవ్రాల్ ప్రస్తావన తీసుకొచ్చారు. కేజీవ్రాల్ సీఎంగా జైలులో ఉంటూనే ప్రభుత్వాన్ని నడిపారని చెప్పారు. జైలులో

## దేశానికే రోల్ మోడల్ గా నైపుణ్యం పోర్టల్ అభివృద్ధి!

- ఏడాదికి 50వేల మంది యువతకు నైపుణ్య శిక్షణకు అవకాశం!
- పీఎం ఇంటర్నషిప్ స్కీమ్ తో నైపుణ్యం పోర్టల్ అనుసంధానం
- నైపుణ్యాభివృద్ధి శాఖపై మంత్రి నారా లోకేష్ సమీక్ష
- పోర్టల్ డెమోను పరిశీలించిన మంత్రి



**ఉండవల్లి వెలుతురు ఆగస్టు 22:** ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం యువత, పరిశ్రమలను అనుసంధానించేలా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురానున్న నైపుణ్యం పోర్టల్ ను దేశానికే రోల్ మోడల్ గా నిలిచేలా తీర్చిదిద్దాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో నైపుణ్య విభాగం అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నైపుణ్యం పోర్టల్ ను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ

## సాస్కి కింద అదనంగా రూ.5,000 కోట్లు కేటాయించండి

- ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థికమంత్రిని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి వెలుతురు ఆగస్ట్ 22 :** ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రాష్ట్రంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించవలసిందిగా కేంద్ర ఆర్థికమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటివరకు ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం (SASCI-Special Assistance to States for Capital Investment ) పథకం కింద రూ. 2,010 కోట్లు లభించాయని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మూలధన




### సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు సంఘీభావం తెలిపిన బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

**సిర్పూర్ వెలుతురు ఆగస్టు 22:** సిర్పూర్ నియోజకవర్గంలో G.O No:49 ను రద్దు చేసి, సంబంధిత పోడు భూముల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ చేపట్టిన సత్యాగ్రహ నిరవధిక దీక్షకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, క్షామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలని, జీవో నెం. 49 ను రద్దు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు.

## అవినీతి వ్యతిరేక పోరాటం ఆగదు

ప్రశ్నించారు. తప్పు చేస్తే సీఎం, ప్రధానినైనా తొలగించే బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తుండటంపై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు ఉంటే జైల్లో.. లేకపోతే బెయిల్‌పై ఉన్నారని ఎద్దేవా చేశారు. అందుకే అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ప్రవేశపెడుతున్న బిల్లును వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. బిహార్‌లోని గయాజీలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కొంతకాలం క్రితం కొందరు నేతలు జైళ్ల నుంచి ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం మనం చూశాం. అవినీతికి పాల్పడే నేతలే పరిపాలన చేస్తే.. ఇక దేశంలో అవినీతిని ఎలా తొలగించగలుగుతాం అని మోదీ ప్రశ్నించారు. ఇకపై క్రిమినల్ నేతలకు అటువంటి అవకాశం ఇవ్వబోమని అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టానికి ఎవరూ అతీతులు కారని.. ప్రధాని కూడా దీని పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ- పరిశీలనకు పంపారు. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్ర మంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిని, రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు అనుమతిస్తుంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

## 25న తెలంగాణ కేబినేట్ భేటీ

సెప్టెంబరు 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశముంది. శనివారం జరగనున్న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ- సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఖరారు కానుంది. రాష్ట్రపతి వద్ద తేలకపోతే పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు- ఇవ్వాలని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సోమవారం జరగనున్న కేబినెట్ సమావేశంలో పాత రిజర్వేషన్ల ప్రకారం.. ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకొని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమాచాం పంపించే వీలుంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక అంశంలో హైకోర్టు విచారణపై కూడా చర్చించి.. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూడా నిర్ణయం తీసునే అవకాశం ఉంది. దీనికోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కాళేశ్వరం నివేదికపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ఇటీవల హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా అసెంబ్లీలో నివేదిక ప్రవేశపెట్టిన అనంతరం చర్యలు తీసుకుంటామని న్యాయస్థానానికి ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఈ నేపథ్యంలో కాళేశ్వరం నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టేందుకు ఈ భేటీలో తేదీలను ఖరారు చేయనున్నట్టు-గా తెలుస్తోంది.

## వైద్యశాఖలో ఖాళీల భర్తీకి నిర్ణయం

**హైదరాబాద్,ఆగస్ట్22( వెలుతురు):**
తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. 1623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి రేవంత్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటల్‌లో 1616, ఆర్టీసీ హాస్పిటల్‌లో 7 పోస్టులు భర్తీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా దరఖాస్తులకు సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ గడువు విధించింది తెలంగాణ ప్రభుత్వం. ఈ పోస్టుల భర్తీతో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని హాస్పిటల్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగనున్నాయి. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ- హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగవనున్నాయి. పల్లెలకు స్పెషాలిటీ- వైద్య సేవలు చేరువ అవనున్నాయి. ఆరోగ్యశాఖలో ఇప్పటికే సుమారు 8 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 7 వేల పోస్టులకు భర్తీ పక్రియ కొనసాగుతోంది.

## ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి రూ.2 లక్షల కోట్లు ఖర్చు

ఆరోగ్యం, మహిళా సాధికారత, వ్యవసాయం, రోడ్లు & తాగునీటి రంగాల్లో మేఘాలయ రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. కేంద్ర రహదారుల మౌలిక సదుపాయల నిధి( CRIF) కింద చేపట్టిన రోడ్ల పనులు, పోషణ అభియాన్ నిధులు, వృత్తి విద్యలో అసెస్మెంట్, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ద్రుష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 75 శాతం ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయని తెలిపారు.

ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం రోజున ఉదయం అరుణాచల్ ప్రదేశ్ నుండి గౌహతి మీదుగా మేఘాలయ రాష్ట్రంలోని షిల్లాంగ్ వెళ్లారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు రాష్ట్ర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. స్థానిక పోలీసులు కేంద్ర మంత్రికి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం నేరుగా షిల్లాంగ్ లోని రాష్ట్ర సచివాలయానికి వెళ్లిన కేంద్ర మంత్రి ఆ రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు తీరుపై సమీక్షించారు. ఆయా పథకాల అమలు తీరుపై శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. నరేంద్ర మోడీ గారి ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసి ఇప్పటిదాకా రెండు లక్షల కోట్ల రూపాయల నిధులను వెచ్చించిందని ఆయన వివరించారు. 2014 కు పూర్వం ఈశాన్య రాష్ట్రాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆయన అన్నారు. మోడీ గారు ప్రధాని అయ్యాక కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పట్ల మేఘాలయ ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని అధికారులు కేంద్రమంత్రికి వివరించారు ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేవలం నిధులు కేటాయించడమే కాకుండా కేంద్ర మంత్రుల్ని ఒక్కో రాష్ట్రానికి పంపి అక్కడి అభివృద్ధిపై సమీక్ష చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ప్రజల కోరిక మేరకు ఇంకా అభివృద్ధి చేయాలనే ఆలోచన మోడీగారి నిజాయితీకి, నిబద్ధతకు నిదర్శనమని బండి సంజయ్ చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో మేఘాలయ చీఫ్ సెక్రటరీ షకిల్ అహ్మద్ డిజిపి శ్రీమతి ఇదాశిష నాంగ్రంగ్ తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓట్ల తొలగింపులో రాజకీయ పార్టీల తీరుపై విస్మయం

**న్యూఢిల్లీ, ఆగస్ట్22( వెలుతురు):**
బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ వివాదంపై సుప్రీం కోర్టు విచారణ కొనసాగింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి బెంచ్ విచారణ చేపట్టింది. డిలీట్ చేసిన ఓటర్ పేర్లను సరిదిద్దే విషయంలో రాజకీయ పార్టీలు అచేతనంగా ఉండటంపై న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. వీరు వెళ్లి సవరణలో పాల్గొనాలని సూచించింది. రాజకీయ పార్టీలు చొరవతో ముందుకు రావాలని కోరింది. అదే సమయంలో ఎస్ఐఆర్ పక్రియ ఓటర్ ఫ్రెండ్లీగా ఉండాలని పునరుద్ఘాటించింది. డిలీట్ చేసిన పేర్ల విషయంలో ఆధార్ కార్డు లేదా.. ఏదైనా ఆమోదయోగ్య పత్రంతో పాటు చేసే ఆన్‌లైన్ సబ్మిషన్లను అనుమతిస్తాం అని న్యాయస్థానం పేర్కొంది. పేర్ల తొలగింపులపై భారీ సంఖ్యలో ప్రజల నుంచి స్పందన వస్తే దరఖాస్తు సమర్పణల తుది గడువును ఎందుకు పొడిగించకూడదని జస్టిస్ కాంత్ ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. మరోవైపు ఈ పక్రియలో బిహార్ రాజకీయ పార్టీలు కూడా భాగస్వాములై తమ బూత్ స్థాయి ఏజెంట్లతో ఓటర్లకు సాయం చేయాలని కోర్టు పేర్కొంది. సూచించిన 11 పత్రాలు లేదా ఆధార్ ఏదైన ఒక దానిని సమర్పించి.. పేరు తొలగింపుపై అభ్యంతరాలు తెలియజేస్తూ.. పేరు తిరిగి చేర్చాలనే దరఖాస్తు ఇవ్వాలని వెల్లడించింది. అదే సమయంలో రాజకీయ పార్టీల మధ్య వివాదాలకు ఓటర్లకు లంకె పెట్టకూడదని జస్టిస్ కాంత్ సూచించారు. ?బిహార్(ఇరశస)లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)లో తీవ్ర స్థాయిలో అవకతవకలు జరిగాయంటూ దుమారం రేగింది. దీనిని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్లపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఇప్పటికే ఎస్ఐఆర్ కింద తొలగించిన 65 లక్షల మంది పేర్లను కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. తొలగించిన ఓటర్ల పేర్లను వెల్లడించాలని విపక్షాలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాజకీయ పార్టీలో వెళ్లి ఓటు నమోదును పూర్తి చేయించాలని సూచించింది.

# హైకోర్టులో కెసిఆర్, హరీష్‌లకు చుక్కెదురు

పిటిషన్లపై వాదనలు ముగిశాయి. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. దీనిపై మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదన్న హైకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక.. పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ఉంటే.. దానిని వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. అయితే పిటిషనర్లు కోరిన విధంగా స్టే మాత్రం ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు హైకోర్టులో నిరాశ ఎదురైనట్లు అయింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టుకు అడ్వకేట్ జనరల్ శుక్రవారం తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై అందిన నివేదకను అసెంబ్లీలో ప్రవేశ పెడతామని కోర్టుకు స్పష్టం చేశారు. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అంటే.. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కోర్టుకు ఏజీ వివరించారు. అంతలో హరీష్ రావు తరపు న్యాయవాది సుందరం తన వాదనలు వినిపిస్తూ.. మొత్తం కమిషన్ నివేదికపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ నివేదికను అడ్డం పెట్టుకుని తమ పిటిషనర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ఈ నేపథ్యంలో తమ వారిపై ఎలాంటి చర్యలు తీసుకో వద్దని కోరుతున్నామని కోర్టు దృష్టికి న్యాయవాది సుందరం తీసుకు వెళ్లారు. అంతేకాకుండా.. జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అసెంబ్లీలో కంటే.. ముందే మీడియాకు ఇచ్చి.. తమ పిటిషనర్ల పరువుకు భంగం కలిగించారని కోర్టుకు న్యాయవాది సుందరం తెలిపారు. ఆ క్రమంలో ఈ నివేదిక అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ఆరు నెలలు సమయం ఉంటు-ందని కోర్టుకు ఏజీ వివరించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పగుళ్లు ఏర్పాడ్డాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 13 నెలల పాటు వందలాది మందిని విచారించింది. అలాగే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్‌లను సైతం విచారించి.. కమిషన్ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి కర్మ, కర్త, క్రియా అంతా కేసీఆర్ అంటూ ఈ విచారణలో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో ఈ కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.

# కెసిఆర్ పాలనలో యూరియా కొరత లేదు

**హైదరాబాద్,ఆగస్ట్22(ఆర్ఎన్ఎ):**
మాజీ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణలో యూరియా కొరత ఎప్పుడూ రాలేదని, ఇప్పుడు పరిపాలన చేతకాని వారి వల్లనే ఈ దుస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఫైర్ అయ్యారు. కేసీఆర్ ముందుచూపు, పాలన అంటే ఏంటో జనాలకు ఇప్పుడు అర్థమైందని.. రైతును అరిగోస పెడుతున్న వారి పతనం ప్రారంభమైందన్నారు. నాడు కేసీఆర్ యూరియా కోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించారన్నారు. వ్యవసాయ అధికారుల నుంచి రైల్వే శాఖ వరకు కేసీఆర్ స్వయంగా సమన్వయం చేశారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. చిల్లర రాజకీయాలు చేసే అసమర్థుల వల్లే రైతులకు ఈ కష్టాలు వచ్చాయి. వందేళ్ల విజన్ ఉన్న కేసీఆర్‌కు, బూతులు మాట్లాడే వారికి తేడా ప్రజలకు అర్థమైంది. యూరియా కోసం ప్రత్యేకంగా గూడ్స్ ట్రెయిన్లు, లారీలు ఏర్పాటు-చేయించారు. గ్రామాల్లోనే యూరియా సరఫరా చేసేలా పకడ్బందీగా ఏర్పాట్లు- చేశారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో యూరియా కొరత ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు పరిపాలన చేతకాని వారి వల్లనే ఈ దుస్థితి నెలకొంది' అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఆగస్టు మొదటి వారం నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులకు యూరియా ఆవశ్యకత ఏర్పడింది. వరి, పత్తి, కందులు, మొక్కజొన్న, మిర్చి, బంతి లాంటి పంటలకు యూరియా వేసే సమయం కాబట్టి రైతులు ఎగబడుతున్నారు. సహకార సంఘాలు, ప్రైవేటు- డీలర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. డిమాండుకు సరిపడా ఎరువులు లేకపోవడంతో.. దుకాణాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు.కొన్నిచోట్ల రైతులు యూరియా కోసం వారం రోజులుగా పట్టాపాస్ పుస్తకాలు, చెప్పులు వరుసలో పెడుతున్నారు. ఇంకొందరైతే అక్కడే నిద్రిస్తున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో ఏనాడూ కూడా రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కలేదు. ధర్నా చేయలేదు. కానీ కాంగ్రెస్ పాలనలో మాత్రం అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క యూరియా బస్తా కోసం వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. ఈ పరిస్థితులపై కేటీఆర్ స్పందిస్తూ.. కేసీఆర్ పాలనను గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో రైతులకు జరిగిన మేలును వివరించారు. వ్యవసాయ అధికారులతో కేసీఆర్ వరుస సమీక్షలు నిర్వహించే వారు. కేంద్రానికి సీజన్‌కు ముందే లెక్కలతో సహా వినతులు ఇచ్చేవారు. ఏపీలోని నౌకాశ్రయాలకు మన ఆఫీసర్లను పంపి ఆదేశాలు ఇప్పించేవారు. దక్షిణమధ్య రైల్వే అధికారులకు స్వయంగా కేసీఆర్ ఫోన్లు చేసేవారు. 25 స్పెషల్ గూడ్స్ రైళ్ల ఏర్పాటు-కు ప్రత్యేకంగా విజ్ఞప్తులు చేసేవారు. పక్కరాష్ట్రం రవాణా శాఖ మంత్రితో నేరుగా సంప్రదింపులు, ఏకంగా 4 వేల లారీలను రంగంలోకి దించేలా సన్నాహాలు చేసేవారు. పోర్టుల నుంచి నేరుగా మండలాలకు తరలించే వ్యూహాలు, ప్రతి రైతుకు సమయానికి యూరియా అందేలా చర్యలు తీసుకున్నారు. నేరుగా గ్రామాల్లోనే సరఫరా చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు-, తెలంగాణలో ఏ ప్రాంతంలోనూ కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకునేవారు అని కేటీఆర్ పేర్కొన్నారు. పరిపాలన తెలియని అసమర్థులు.. రాజ్యమేలడం వల్లే రైతులకు ఈ కష్టాలు.. కన్నీళ్లు మిగిలాయన్నారు.

## సీఎస్ఆర్ నిధులతో మండలానికోఅంబులెన్స్

320 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి.. దాదాపు 500 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తున్నామని చెప్పారు. ఆనాడు భూములిచ్చింది ఇందిరమ్మే.. ఈనాడు ఉద్యోగాలు ఇస్తోంది ఇందిరమ్మ సర్కారేనని తెలిపారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని తప్పుడు ప్రచారంచేశారు..కాంగ్రెస్ అంటేనే కరెంట్ అని నిరూపించామన్నారు భట్టి విక్రమార్క. ఉద్యోగ అవకాశాల ద్వారా పేదరికాన్ని జయించవచ్చని భట్టి విక్రమార్క అన్నారు. విద్య ద్వారా సామాజిక, ఆర్థిక వెనుకబాటును జయించవచ్చన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, సీఎస్ఆర్ నిధులతో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు- చేస్తున్నట్లు- చెప్పారు. దీనిలో 2,600 మంది విద్యార్థులు చదువుకునేలా వసతులు కల్పిస్తున్నామన్నారు. కన్వెన్షన్, నాన్‌కన్వెన్షన్ ఎనర్జీ అందించే దిశగా చర్యలు చేపడుతున్నాం. దేశంలో అత్యధిక గ్రీన్ పవర్ ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా నిలుస్తున్నాం. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నాం. 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఇకపోతే రాష్ట్రంలో పవర్ ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. అధికారంలోకి రాగానే న్యూ ఎనర్జీ పాలసీ తీసుకొచ్చామన్నారు. 51 లక్ష కుటుంబాలకు 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. ఏటా రూ.17 వేల కోట్లు- ప్రభుత్వం విద్యుత్ శాఖకు కడుతోందన్నారు భట్టి. విద్యతో పేదరికాన్ని జయించవచ్చని చెప్పారు భట్టి. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు- చేస్తామన్నారు. 5 ఎకరాల్లో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు- చేసి 2600 మంది విద్యార్థులు చదువుకునే వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేజ్రీవాల జైలులో ఉంటూ ప్రభుత్వాన్ని నడిపారు

ఉండి ప్రభుత్వాన్ని నడిపే సీఎం దేశానికి అవసరమా? నైతికత ఎక్కడుంది? కేజ్రీవాల్ లిక్కర్ పాలసీ కుంభకోణంలో జైలుకు వెళ్లి అక్కడ నుంచి ప్రభుత్వాన్ని నడిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందా.. లేదా? గతంలో ఢిల్లీని భాజపా ప్రభుత్వం పాలించింది. కానీ, ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ రాలేదు. కేజ్రీవాల్ అరెస్టయిన వెంటనే సీఎం పదవికి రాజీనామా చేసి ఉంటే.. ఇప్పుడు ఈ బిల్లు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉండేది కాదు. ఇలాంటి నిబంధనను రాజ్యాంగం రూపొందించినప్పుడే ఎందుకు పెట్టలేదని ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తులో జైలుకు వెళ్లే వ్యక్తులు ప్రజాప్రతినిధులవుతారని ఆ సమయంలో ఊహించి ఉండకపోవచ్చు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వమైనా, ప్రతిపక్షాలైనా నైతిక బాధ్యత తీసుకోవాలని అమిత్ షా అన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు- నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ- పరిశీలనకు పంపారు. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు. కొచ్చిలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీని, ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకొని తీవ్ర ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉంటూ సుదర్శన్ రెడ్డి వామపక్ష తీవ్రవాదానికి అనుకూలంగా తీర్పులు ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వామపక్షాల ఒత్తిడితో సుదర్శన్ రెడ్డిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసిందని అన్నారు. ఆయన అభ్యర్థిగా ఎంపిక చేయడంతో కేరళలో కాంగ్రెస్ విజయానికి మిగిలి ఉన్న అవకాశం కూడా చేజారిపోయిందని విమర్శించారు. వామపక్ష తీవ్రవాదానికి సహాయం చేయడానికి సల్వా జుడుం లాంటి వారికి వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చిన వ్యక్తి ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి అని అన్నారు. ఆ రోజు ఆయన అలాంటి నిర్ణయం తీసుకోకపోతే 2020 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమై ఉండేదని పేర్కొన్నారు. వామపక్షాల ఒత్తిడితోనే కాంగ్రెస్ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డి ఎంపిక చేసిందని ఆరోపించారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో అనేక ప్రసిద్ధమైన తీర్పులు ఇచ్చారు. వాటిలో సల్వా జుడుం కేసు చాలా ముఖ్యమైనది. 2011లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి, జస్టిస్ ఎస్ఎస్ నిజ్జర్‌తో కూడిన ధర్మాసనం సల్వా జుడుంను రద్దు చేసింది. సల్వా జుడుం అనేది.. కొంతమంది గిరిజన యువకులు మావోల తిరుగుబాటును ఎదుర్కోవడానికి ఏర్పాటయ్యింది.

# దేశానికే రోల్ మోడల్ గా నైపుణ్యం పోర్టల్ అభివృద్ధి!

సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ లో నైపుణ్యం పోర్టల్ ప్రారంభానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ తో నైపుణ్యం పోర్టల్ ను అనుసంధానించాలని సూచించారు. నైపుణ్యం పోర్టల్ డెమోను ఈ సందర్భంగా మంత్రి పరిశీలించారు. దేశంలో ఎక్కడా ఇలాంటి పోర్టల్ ను అభివృద్ధి చేయలేదని, రాష్ట్రంలోని నైపుణ్య కేంద్రాలతో పాటు న్యాక్, సీడాప్ ను పోర్టల్ తో అనుసంధానించనున్నట్లు అధికారులు వివరించారు. ఏడాదికి 50వేల మంది యువతకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే 36 రంగాలకు సంబంధించి 3వేలకు పైగా జాబ్ కేటగిరీలను పోర్టల్ లో ఎన్ రోల్ చేసినట్లు వివరించారు. పరిశ్రమ అవసరాలకు తగ్గట్లుగా యువతను సన్నద్ధం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఇదే సమావేశంలో ఇంటర్ విద్యకు సంబంధించిన పలు అంశాల పై చర్చించారు. దృష్టి లోపం గల విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరేందుకు అనుమతి మంజూరు చేసారు. వారికి మరిన్ని సదుపాయాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. అక్షర ఆంధ్రలో భాగంగా 16 లక్షల మందిని గుర్తించామని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారందరికీ వయోజన విద్యా శిక్షణ తక్షణమే ప్రారంభించాలని మంత్రి అన్నారు. ఈ సమావేశంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రఘు, ఏపీఎస్ఎస్ డీసీ అసోసియేట్ డైరెక్టర్ కుమార పురుషోత్తం, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# సాస్కి కింద అదనంగా రూ.5,000 కోట్లు కేటాయించండి

ప్రాజెక్టుల కోసం అదనంగా రూ. 5,000 కోట్లు కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ (SNA Sparsh) ప్రోత్సాహక పథకం మార్గదర్శకాల ప్రకారం రూ. 250 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై తగు ఉత్తర్వులు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకాన్ని స్వాగతిస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి...ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందగలదని తెలిపారు. దీని విధివిధానాలు రూపొందించి త్వరగా ఈ పథకాన్ని అమల్లో తేవాలని ముఖ్యమంత్రి కోరారు.



# ఆదివాసుల సమస్యలను పట్టించుకోని దున్నపోతు కాంగ్రెస్ సర్కార్!!



## జీవో 49 రద్దు డిమాండ్ వెయ్యి శాతం న్యాయం అయింది..

## పోడు భూముల సమస్యలు వెంటనే పరిష్కరించాలి...

## ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు...

**సిర్పూర్ వెలుతురు ఆగస్టు 22:**
ఆదివాసుల సమస్యలను పట్టించుకోని ఈ దున్నపోతు కాంగ్రెస్ సర్కారు కొమ్ములు విరిచి, మెడలు వంచె సమయం ఆసన్నమైందని, జీవో 49 రద్దు డిమాండ్ వెయ్యి శాతం న్యాయం అయిందనీ, పోడు భూముల సమస్యలు వెంటనే పరిష్కరించాలనీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. కుమరంభీం జిల్లా టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ని నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2025 జూలై 21న ఉత్తర్వులను జారీ చేసింది. పులుల కారిడార్, కవ్వాల్ అభయారణ్యంలో భాగంగా ఉన్న ఆసిఫాబాద్ ప్రాంతాన్ని కుమరంభీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటిస్తూ 2025 జూన్ 30న అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆహ్మద్ నదీం జీవో-49 జారీ చేశారు. ఈ జీవో ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కర్జెల్లీ, బెజ్జూరు, పెంచికల్‌పేట రేంజ్‌ల పరిధిలో సుమారు లక్షన్నర హెక్టార్లను టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జీవో విడుదలైన రోజునుంచి దీన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. జీవో-49పై ఆదివాసీల్లో అనుమానాలు, అభ్యంతరాలు నెలకొన్న నేపథ్యంలో పలుమార్లు మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండ సురేఖ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అదికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో మంత్రులు సమావేశాలు నిర్వహించి పూర్తి వివరాలు సేకరించారు. ఈ పరిణామాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే నుంచి తాజాగా నివేదికలు తెప్పించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2025 జూలై 21న జీవో-49ని నిలుపుదల చేసేందుకు నిర్ణయించి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆహ్మద్ నదీం జీవో-49ని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు)

### జీవో 49 రద్దు డిమాండ్ వెయ్యి శాతం న్యాయమైనది. రాష్ట్రంలో ఉన్నది తోలు మందం దున్నపోతు సర్కార్ అందుకే స్పందించడం లేదు.

పోడు భూముల సమస్యను పరిష్కరించాలని, జీవో 49ను శాశ్వతంగా రద్దు కోసం డిమాండ్ చేస్తూ ,ఆదివాసుల హక్కుల కోసం ఎమ్మెల్యే ఐదు రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్నా కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడం అత్యంత అమానుషం. మనిషన్నవాడైతే చలించి ఆదివాసుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వాలి. కానీ ఇది తోలు మందం సర్కారు. ఇది దున్నపోతు సర్కార్. ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేలు నిరసనల కార్యక్రమాలు చేపట్టినా స్పందించకపోవడం ముమ్మాటికీ ప్రజాద్రోహమే

### బిజెపి పోరాటానికి తలొగ్గి, స్థానిక ఎన్నికల్లో ఆదివాసుల ఓట్ల కోసం జీవో 49ను తాత్కాలికంగా నిలిపివేసారు.

పోడు రైతుల సమస్యలను ఎమ్మెల్యే హరీష్ బాబు ఎన్నో సార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు, అయినా ఈ దున్నపోతు సర్కారు స్పందించలేదు. ఎమ్మెల్యే హరీష్ బాబు, బిజెపి క్యాడరు రాజీలేని పోరాటం వల్ల నెల రోజుల క్రితం జీవో 49ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అది బిజెపి వీరోచిత పోరాటాన్ని చూసి ఆదివాసుల్లో ప్రభుత్వం పట్ల పెరుగుతున్న వ్యతిరేకతను చూసి స్థానికి ఎన్నికల్లో ఓటమి ఖాయమని గ్రహించి, కంటి తుడుపు చర్యగా, స్థానిక ఎన్నికల్లో ఆదివాసుల ఓట్ల కోసం జీవో 49ను తాత్కాలికంగా నిలిపివేసారు.



### స్థానిక ఎన్నికల అనంతరం మళ్లీ జీవో49ను పునరుద్ధిస్తారు. అందుకే జీవో శాశ్వత రద్దుకు బిజెపి రాజీలేని పోరాటం

స్థానిక ఎన్నికల అనంతరం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ జీవో 49ను పునరుద్ధరిస్తుందని గ్రహించి, ఆదివాసీ ప్రజల కోసం ఆ దుర్మార్గపు జీవో 49ను శాశ్వతంగా రద్దు చేయాలని ఆ నాటి గోండు వీరుడు కొమరం భీమ్ స్పూర్తితో నిరవధిక నిరాహార దీక్షకు దిగడం జరిగింది.ఐదు రోజుల క్రితం ఎమ్మెల్యే పోడురైతుల సమస్య పరిష్కరించాలనే డిమాండుతో కాగజ్‌నగర్ అటవీశాఖ ఆఫీసును ముట్టడించే కార్యక్రమం చేపట్టగా, పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ నిర్భంధాన్ని లెక్కచేయకుండా ఆదివాసుల హక్కుల కోసం నిరవధిక నిరాహార దీక్షకు దిగడం గిరిజనుల సంక్షేమం కోసమే..

### ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం నాడు కొమరం భీమ్ ఆయన స్పూర్తితో నిజాం సర్కారుపై పోరాటం

ఆదివాసీల హక్కుల కోసం వారి భూమి, అడవులు, నీటి వనరులను కాపాడుకోవడం కోసం ఆనాడు నిజాం పాలకులపై అప్పటి గిరజనోద్యమ నాయకుడు కొమరం భీమ్ “జల్, జంగల్, జమీన్” అనే నినాదంతో పోరాడితే, ఇపుడు అదే నిజాం పాలకులను ఆదర్శంగా తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి గిరిజన వ్యతిరేక పాలన సాగిస్తుండగా,, ఆదివాసుల సంక్షేమం కోసం నిజాం రేవంత్ రెడ్డిపై రాజీలేని పోరాటం చేస్తున్నాం. నిజాం పాలనకు వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం కొమరం భీమ్ పోరాడిన బాటలోనే నడుస్తూ, ఆదివాసుల హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ సర్కారుపై నిరవధిక నిరాహార దీక్ష అనే బాణాన్ని ఎక్కుపెట్టాం..

### జీవో 49 విషయంలో కేంద్ర ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదు. ఆదివాసీలను అడవికి దూరం చేసే అధికారం రాష్ట్ర సర్కారుకు లేదు.

కుమరంభీం జిల్లా టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ పేరిట ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 49ని శాశ్వతంగా రద్దు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కి, దొంగ దారిన జీవో 49ని తీసుకు వచ్చింది. ఆదివాసీలను అడవి నుంచి దూరం చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఈ జీవో 49 విషయంలో కేంద్ర ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదు. ఎలాంటి గ్రామసభలు పెట్టకుండా, పబ్లిక్ హియరింగ్ లేకుండానే దొడ్డి దారిన రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవో 49 తీసుకువచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తేనే ఈ జీవో తెచ్చామని కాంగ్రెస్ నేతలు తప్పుడు కూతలు కూసారు. మరి ఈ జీవోను తాత్కాలిక నిలుపుదల ఆదేశాలు ఇవ్వటానికి రాష్ట్ర సర్కార్ కేంద్రాన్ని సంప్రదించలేదు కదా దీన్ని బట్టే స్పష్టమవుతోంది కదా, ఇందులో కేంద్రం ప్రమేయం లేదని.

### మంత్రి వివేక్ సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి జీవో-49ని రద్దు చేయించాలి.

ఆదివాసుల బాగోగులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం శ్రద్ధ ఉన్నా ఈపాటికే ఎమ్మెల్యే హరీష్ బాబు ఐదు రోజులుగా చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు స్పందించి జీవో-49ని శాశ్వతంగా రద్దు చేస్తున్నట్టు హామీ ఇచ్చేది. కానీ, ఈ సర్కారుకు ఆదివాసులన్నా, గిరిజనులు, దళితులు, బీసీలన్నా చిన్న చూపు. వారికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అటకెక్కించిన దుర్మార్గపు ప్రభుత్వమిది. జీవో-49ని రద్దు చేయాలంటూ బిజెపితో పాటు ఆదివాసీ సంఘాలు 50 రోజులుగా రాజీలేని పోరాటం చేస్తున్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వ పెద్దల నుంచి కనీస స్పందన లేకపోవడం అంటే ఇది ముమ్మాటికీ బాధ్యతలేని సర్కార్. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మంత్రి వివేక్ కు చీమకుట్టినట్టయినా లేదు. దళిత వర్గానికి చెందిన నాయకుడై ఉండి కూడా గిరిజనుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా మంత్రి వివేక్ సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి జీవో-49ని రద్దు చేయించాలి.

### సీఎం రేవంత్ రెడ్డి, చాతనైతే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పోడు రైతులకు పట్టాలివ్వాలి. అంతేకానీ, నీ ప్రతాపం పోడు రైతులపై చూపొద్దు

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో యుపిఏ సర్కారు తెచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసి, అర్హులైన అందరికీ పోడు భూముల పట్టాల పంపిణీ అని హామీ ఇచ్చారు కదా, మరి ఈ 20 నెలలుగా ఎందుకని పోడు పట్టాలు ఇవ్వలేకపోయారు. దశాబ్దాలుగా, ముత్తాతల కాలం నుంచి పోడు చేసుకుని బతుకుతున్న ఆదివాసులను కాంగ్రెస్ సర్కారు అడ్డు కోవడం అన్యాయం. ఆదివాసుల ఆకలి కేకలు, గోసను వినే ఓపిక ఈ తోలు మందం ముఖ్యమంత్రికి లేదని స్పష్టమవుతోంది. పోడు రైతులను అరెస్టు చేయడం, వారి పక్షాన పోరాడుతున్న తనను అక్రమంగా నిర్బంధించడాన్ని బట్టి రేవంత్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదు గూండా పాలన అని అర్థమవుతోంది. పొట్టకూటి కోసం పోడు సాగు చేసు కుంటున్న వారిని అరెస్టు చేసి కేసులు పెట్టడం అత్యంత దారుణం, అన్యాయం. సీఎం రేవంత్ రెడ్డి నీకు చాతనైతే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన వేల ఎకరాల ఫారెస్టు భూమిని పరిరక్షించు. కంచ గచ్చిబౌలిలో రేవంత్‌రెడ్డి సర్కారు వందలాది మంది పోలీసుల సాయంతో పట్టపగలే బుల్డోజర్లు తెచ్చి అక్కడ వన్యప్రాణులున్నా లెక్కచేయకుండా ఫారెస్టు భూమిని నాశనం చేస్తే ... కనీసం వైల్డ్ లైఫ్ ప్రిజర్వేషన్ యాక్ట్, ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ కింద ఒక్క కేసు కూడా పెట్టలేదు, కానీ ఆసిఫాబాదులో మాత్రం అమాయక పోడు రైతులపై నీ ప్రతాపం చూపడానికి సిగ్గులేదా సీఎం రేవంత్ రెడ్డి. పోడు రైతులను వేధించడం ఆపి, వారికి వెంటనే పట్టాలివ్వాలి. కుట్రపూరిత అరెస్టులను మానుకోవాలి.

### ఎస్సీ, ఎస్టీల సంక్షేమం పట్ల కాంగ్రెస్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే చేవేళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషనులో ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

చేవేళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషనులో దళితులకు జనాభా దామాషా (proportionate to their population) ప్రకారం రిజర్వేషన్లను 15 శాతం నుంచి 18 శాతానికి పెంచుతామన్నారు కదా, మరి ఎందుకని పెంచలేదు. ఎవరు అడ్డుపడ్డారు.

ప్రభుత్వ ప్రొక్యూర్ మెంట్, అన్ని కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు, ప్రైవేటు విద్యా సంస్థల్లో, ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందే ప్రైవేటు కంపెనీల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు కదా, మరి ఎందుకని అమలు చేయలేదు. ఎవరు అడ్డుపడ్డారు.

ఇళ్లు లేని ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.ఆరు లక్షలు ఇస్తామన్నారు కదా, మరి ఈ 20 నెలల కాలంలో ఎంత మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఇందిరమ్మ పక్కా ఇళ్లు ఇచ్చారో చెప్పే దమ్ముందా సీఎం రేవంత్ రెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వంలో గుంజుకున్న ఎస్సీ, ఎస్టీల అసైన్డు భూములను తిరిగి అసైనీలకే అన్ని హక్కులతో పునరుద్దరిస్తామని హామీ ఇచ్చారు కదా, మరి ఎందుకని అసైన్డు భూములను తిరిగి ఇవ్వల్కేపోయారు. ఎవరు అడ్డుపడ్డారు.

### కొత్తగా మూడు ఎస్సీ కార్పోరేషన్లను

(మాల, మాదిగ, ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేకంగా ఒక్కోటి) ఏర్పాటు చేసి, ప్రతి ఏడాది ఈ కార్పోరేషన్లకు ఒక్కోదానికి రూ.750కోట్లు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు కదా, మరి ఎందుకని అమలు చేయడం లేదు. ఎవరు అడ్డుపడ్డారు

### ఎస్టీలకు మూడు కార్పోరేషన్లు

1.సంత్ సేవాలాల్ లంబాడా కార్పోరేషన్, 2.తుకారం ఆదివాసీ కార్పోరేషన్, 3.ఎరుకల కార్పోరేషను ఏర్పాటు చేసి, వీటికి ప్రతి ఏడాది ఒక్కో కార్పోరేషనులకు ఒక్కోదానికి రూ.500 కోట్లు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు కదా, మరి ఎందుకుని అమలు చేయడం లేదు. ఎవరు అడ్డుపడ్డారు.

### అంబేద్కర్ అభయహస్తం పథకానికి నిధులేవీ, ఇది ఎస్సీ, ఎస్టీలను దగా చేయడం కాదా?

అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓట్ల కోసం కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి కోసం రూ.12 లక్షలు ఇస్తామని ఎలక్షన్నుకు ముందు చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభలో ఈ మేరకు హామీ ఇచ్చింది. ఈ హామీని అంబేద్కర్ అభయహస్తం పేరుతో మేనిఫెస్టోలో పొందుపరిచింది. కానీ ఈ పథకాన్ని గత 20 నెలలుగా అమలు చేసేందుకు కనీస కసరత్తు కూడా కాంగ్రెస్ సర్కారు చేయలేదు. గత బడ్జెటులో ఆశించిన మేరకు నిధులు మాత్రం కేటాయించలేదు. అంటే ఈ స్కీము కూడా మొదలవ్వకుండానే రద్దయినట్టేనా. ఇది ముమ్మాటికీ ఎస్సీ, ఎస్టీ యువతను దారుణంగా వంచించడమే.

### మంత్రి పదవుల్లో, ఎమ్మెల్యే సీట్లలో బీసీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ సర్కార్

జనాభాలో 50 శాతమున్న బీసీలకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజెపిల కంటే బీసీలకు తక్కువ సీట్లు ఇచ్చి, అన్యాయం చేసింది. ఇపుడు క్యాబినెటులో అయినా న్యాయం చేసిందా అంటే అదీ లేదు. కాంగ్రెసు చెప్తున్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లనే సూత్రం ప్రకారం బీసీలకు కనీసం ఎనిమిది మంత్రి పదవులు ఇవ్వాల్సిన కాంగ్రెస్ ఇచ్చింది కేవలం ముగ్గురికే. ఇంకా ఖాళీగా ఉన్న మూడు క్యాబినెట్ బెర్తులను బీసీలకే ఇచ్చే దమ్ముందా కాంగ్రెసుకు. బీసీల మేలు కోసం కులగణన, 42శాతం రిజర్వేషన్లు అంటున్న కాంగ్రెస్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవులను బీసీలకే కేటాయించాలి.

### బీసీ సబ్ ప్లానుకు చట్టబద్ధత ఏదీ, నిధులేవీ?

అసెంబ్లీ మొదటి సెషనులోనే బీసీ సబ్ ప్లాన్ చట్టబద్ధం చేస్తామని కాంగ్రెస్ బీసీ డిక్లరేషనులో హామీ ఇచ్చింది. మరి ఏమైంది బీసీ సబ్ ప్లానుకు చట్టబద్ధత ఎందుకు కల్పించడం లేదు. ఏటా 20 వేల కోట్లు బీసీ సంక్షేమానికి కేటాయిస్తామన్నమాటను నిలబెట్టుకోకపోవడమంటే, ఇది బీసీలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కడం, వెనకబడిన వర్గాలను మోసం చేయడం కాదా ... ఎంబీసీ కులాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామంటూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయడానికి ఉన్న అడ్డంకి ఏంటి?

# పార్లమెంట్‌ను అపహాస్యం చేసిన కాంగ్రెస్

- సమావేశల్లో చర్చించకుండా కాలయాపన
- వెంకయ్య నాయుడు పోటీ చేసినప్పుడు తెలుగు ప్రైడ్ గుర్తుకు రాలేదా
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపి లక్ష్మణ్

**హైదరాబాద్,ఆగస్ట22( వెలుతురు):**
వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ముగిశాయి. 21 రోజుల వాడివేడిగా సాగిన పార్లమెంట్ సమావేశాలు గురువారంతో ముగిసినట్లు- బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ అలజడి, అల్లర్లు చేస్తూ.. ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చేలా వ్యవహరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ద్వంద నీతి అవలంబించిందని విమర్శించారు. మణిపూర్, ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరగాలని మొదట డిమాండ్ చేసిందని పేర్కొన్నారు. రాజ్యసభలో ఆపరేషన్ సింధూర్ చర్చలో పాల్గొనకుండా తోకముడిచిందని ఆయన ఎద్దేవా చేశారు. పదిహేను బిల్లులు ఉభయ సభల్లో ఆమోదం తెలిపితే ఒక్క చర్చలో కూడా కాంగ్రెస్ పాల్గొనలేదని తెలిపారు. చర్చలో పాల్గొనకుండా కాంగ్రెస్ ప్రజలను



మోసం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్‌కి ఎజెండా లేకుండా పోయిందని విమర్శించారు. పార్లమెంట్‌లో లేని చర్చకు ఆరోపణలతో రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. చరిత్మకమైన బిల్లులో కాంగ్రెస్ ఎక్కడ చర్చకు రాలేదని స్పష్టం చేశారు. జైల్లో అవినీతి నేతలు ఉండాలని బిల్లు పెడితే కాంగ్రెస్ నేతలు దాన్ని అడ్డుకొని బిల్లులు చించేశారని చెప్పుకొచ్చారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెడతామని చెప్పారు కానీ ఇప్పుడు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజలను భ్రమలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సదుర్శన్ రెడ్డి తెలుగు ప్రైడ్ అని రేవంత్ రెడ్డి అంటు-న్నారని లక్ష్మణ్ పేర్కొన్నారు. గతంలో పీవీ నరసింహారావును కాంగ్రెస్ ఎలా ఇబ్బంది పెట్టిందో చూశామని తెలిపారు. టి.అంజయ్యను ఏ విధంగా అవమానించారో ప్రజలకు తెలుసని చెప్పుకొచ్చారు. తెలుగు వారైనా వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా పోటీ- చేస్తే అప్పుడు కాంగ్రెస్ ఎందుకు మద్దతు ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలుగు వాడి ఆత్మగౌరవం కోసం ఆరోజు కి పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఆయనను రాజకీయాల్లో నైతిక విలువలు లేకుండా చేశారని కాంగ్రెస్ విమర్శించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎమర్జెన్సీ రోజుల్లో అధికారాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని ధ్వజమెత్తారు. పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ నైజం బయటపడిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి వారి వైఖరి మార్చుకోవాలని లక్ష్మణ్ హితవు పలికారు.

# బిజెపి అధ్యక్షుడు రామ్ అరెస్ట్ దుర్మార్గం

- బిజెపి అంటే ఎందుకంత భయం
- ప్రభుత్వంపై బండి విమర్శ

**హైదరాబాద్,ఆగస్ట22( వెలుతురు):**
భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్టును కేంద్ర మంత్రి బండి సంజయ్ ఖండించారు. చేవెళ్లలో పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుంటే ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భారత రాష్ట్ర సమితి బాటలోనే నడుస్తోందని మండి పడ్డారు. అరెస్టులతో వైఫల్యాలు కప్పిపుచ్చుకోవా లని ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. తక్షణమే రామచందర్‌రావు, కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భాజపా నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలను విడుదల చేయాలన్నారు. చేయాల్సింది అరెస్టులు కాదు.. సమస్యల పరిష్కారమని చెప్పారు. నిరంకుశ విధానాలు మానకపోతే ప్రజాక్షేత్రంలో మట్టి కరిపించడం ఖాయమ న్నారు. జీహెచ్‌ఎంసీలో సమస్యల పరిష్కారం కోరుతూ భాజపా శుక్రవారం సచివాలయం ముట్టడికి పిలుపుని చ్చింది. దీంతో పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. మొయినాబాద్ వద్ద ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును హైదరాబాద్‌కు వస్తుండగా అరెస్టు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు- కేంద్ర హోమ్ శాఖ సహా య మంత్రి బండి సంజయ్ తెలిపారు. చేవెళ్లలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయన్ని ఎందుకు అరెస్ట్ చేశారని ఈ సందర్భంగా పోలీసులను ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గత బీఆర్ఎస్ బాటలోనే పయనిస్తుం దని మండిపడ్డారు. బీజేపీ కార్యక ర్తల అరెస్టులతో తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవాలను కుంటుందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. అయినా బీజేపీ అంటే అంత భయమెందుకు అని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్దతిలో నిరసన చేస్తున్న బీజేపీ కార్యకర్తల ను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు- అని అభివర్ణించారు. తక్షణమే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అరెస్టయిన బీజేపీ కార్యకర్తలందరినీ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి సూచించారు. లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

# సంపాదకీయం..

# ప్రజాస్వామ్యంలో నిరంకుశం పనికిరాదు !

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భావించే భారతదేశంలో ఆరోగ్యకరమైన రాజకీయ వాతావరణం లేకుండా పోతోంది. అధికారం చేపట్టిన నేతలు నిరంకుశమనే విషసంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. అన్ని వ్యవస్థలతో పాటు మీడియా పైనా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. తాము కోరుకున్నది మీడియాలో రావాలన్న అహంకారంతో ఉన్నారు. లేకుంటే మాకు వ్యతిరేకంగా మీడియా కథనాలు రాస్తోందని అక్కసు వెళ్లగక్కుతున్నారు. అలాగే మీడియా సంస్థలపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. మీడియా ప్రతినిధులను దరిదాపుల్లోకి రాకుండా చూస్తున్నారు. సొంత మీడియాలను ప్రోత్సహిస్తూ..డబ్బా కొట్టుకుంటున్నారు. అహంకారం పతన హేతవు... ఇది అందరికీ తెలుసు.. కానీ మోడీ, మమతా బెనర్జీ, కెసిఆర్,జగన్ వీరంతా అహంకార పాలకులుగా నిలిచిపోతారనడంలో సందేహం లేదు. మోడీ దేశానికి ఏమిచేయలేదని.. మోడీ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని అధికారంలో ఉండగా కెసిఆర్ తరచూ మండిపడుతూ వచ్చారు. కానీ కెసిఆర్ అంతకు మించిన అహంకారి అని తెలంగాణలో ఎవరిని అడిగినా చెబుతారు. ఇప్పుడాయన కేవలం తను సృష్టించుకున్న ఏకాంతంలో గడుపుతున్నారు. ప్రజల్లో ఎక్కడా కానరావడం లేదు. ఆయన ఎవరినీ దరిచేరనీయరన్నది కూడా అంతే నిజం. అధికారంలో ఉండగా జనగ్ కూడా అదే తరహాలో ఐదేళ్ల అధికారం ఏలారు. జనాలను దూరంగా పెట్టారు. నిజానికి ప్రజాస్వామ్యంలో అహంకారం, నిరంకుశం పనికిరాదు. మోడీ గురించి విమర్శలు చేస్తున్న ఇండియా కూటమి నేతలు తమగతాన్ని కూడా గుర్తు చేసుకుంటే మంచింది. తమవైపు



కూడా జనం చూస్తారని గుర్తించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లు..వారిచ్చే ఓటుతో నిరంకుశంగా కాకుండా.. ప్రజాస్వామ్య యుతంగా పాలన సాగించాలి. ఓట్లేసుకోవడం ఎలాగో తెలుసుకుని రాజ్యమేలుతున్న మన రాజకీయ నేతలు అధికారంలోకి రాగానే ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేస్తున్నారు. ప్రజలను పురుగుల్లా చూస్తున్నారు. పోలీసులను తమ గుప్పిట్లో పెట్టుకుని పాలన చేస్తున్నారు. ప్రజల చెంతకు రావడం, వారి గురించి తెలుసుకోవడం అన్నది మరచి పోయారు. ఇలా జరుగుతుందని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మహాశయుడు ఆనాడు ఊహించి ఉండరు. లేకుంటే ఎక్కడో ఒక దగ్గర చెక్ పాయింట్ పెట్టేవారు. ప్రజలకు చేరువగా ఉండాల్సిన నేతలు ప్రస్తుతం గిరిగీసుకుని తమ బంగళాలు దాటి రావడం లేదు. ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దేశంలో మిగతా నేతల సంగతెలా ఉన్నా... మోడీ, కెసిఆర్, జగన్‌లు అహంకారంలో తారాస్థాయికి చేరుకున్నారు. నిరంకుశంలో హిట్లర్, మోస్సోలీలను మించారు. మోడీని ప్రశ్నించే ముందు ఈ విషయాలను తమకు తాముగా ప్రశ్నించుకుంటే



బాగుండేది. ఇకపోతే తెలంగాణలో కెసిఆర్‌కు ముందు సిఎంలుగా పనిచేసిన వారెవరూ ఎవరు కూడా ఇంత నిరంకుశంగా లేరు. దివంగత ప్రజాయుద్ధనౌక గద్దర్, కోదండరామ్ తదితర తెలంగాణ ఉద్యమకారులను కూడా కెసిఆర్ దూరం పెట్టిన విషయాన్ని జనం చూశారు. ఉమ్మడి ఎపిలో చెన్నారెడ్డి లాంటి నేత కూడా ఇంత నిరంకుశంగా పాలించ లేదు. దివంగత వైఎస్ కూడా ఎప్పుడూ ప్రజల్లో ఉండేవారు. ఇప్పుడు విభజన తరవాత అటు కెసిఆర్, ఇటు జగన్ పాలనా పగ్గాలు చేపట్టాక నిరంకుశంగా వ్యవహరించడంతో పాటు ఎదుటి పార్టీలను, వ్యక్తులను గంజిలో ఈగ తీసినట్లుగా వ్యవహరించారు. రాష్ట్రాలను అప్పులకుప్పగా తయారు చేశారు. అందుకే జనం వారిని కూడా నిరంకుశంగానే దూరం పెట్టారు. ప్రజాసంక్షేమం పేరుతో డబ్బుల పందేరంతో ఖాజానాను ఊడ్చేస్తున్న నాయకులు ఎప్పటికైనా జవాబుదారీగా ఉండాల్సిందే. అధికారంలో ఉన్న వారు నిజంగా మంచి పనులు చేస్తే ప్రజలు వారిని దూరం పెట్టరు. ప్రజలు నానా అవస్థలు పడుతున్నా వాటిపై పట్టింపు లేకుండా పాలన సాగిస్తున్నారు. ఇక బిజెపి విషయానికి వస్తే..అన్ని రాష్ట్రాల్లో పాగా వేయాలన్న సంకల్పం ఉంటే మంచిదే. అందుకు మంచి పనులు చేస్తే చాలు. ప్రజలకు ఉద్యోగ,ఉపాధి కల్పించి, జిఎస్టీ వాయింపులు లేకుండా చేసి, ధరలను అదుపులో పెట్టగలిగితే ప్రజలే నేరుగా వచ్చి ఓటేసి బిజెపిని అక్కున చేర్చుకుం టారు. అలా జరగడం లేదు కనుకనే హిమాచల్, కర్నాటకలో దెబ్బకొట్టారు. ఈ క్రమంలో మోడీ కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. తమ పాలన అంతా బ్రహ్మాండంగా ఉందన్న అహంకారంలో ప్రధాని మోడీ ఉన్నారు. ఎంతో గొప్ప పాలన అందిస్తున్నామని చాటుకుంటున్నారు. త్వరలోనే రెండు రాష్ట్రాల్లో జరుగ బోయే అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంది. ఈ ఎన్నికలకు ముందు అయినా బిజెపిని ప్రజలకు చేరువ చేసేలా మోడీ ప్రజలకు చేరువ కావాలి. ప్రజాస్వా మ్యాన్ని, హక్కులను, న్యాయాన్ని ప్రభుత్వాన్ని, వ్యవస్థలను కాపాడుకోవాల్సి ఉంది. పాలకులు ఇది గమనించి తమపనితీరును మెరుగు పర్చుకుంటే మంచిది. అలాకాకుండా నాయకలు తమ అహంకాన్ని వీడక పోతే కాలగర్భంలో కలసిపోక తప్పదు. ప్రజలతో మంచి అనిపించుకునేలా నిర్ణయాలు తీసుకోవాలి. కేంద్రంలో అయినా రాష్ట్రాల్లో అయినా పాలకులు నిజాయితీగా సాగాలి. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలి.

# చిన్న రాష్ట్రాల స్వప్నం నిజం... బీసీ, ఎంబీసీకు రాజకీయ సమన్యాయం ఎక్కడ...!

**భారతదేశంలో చిన్న రాష్ట్రాల కోసం జరిగిన పోరాటాలు ఎప్పటికప్పుడు ఒక ప్రధాన రాజకీయ అజెండాగా నిలిచాయి. భౌగోళిక విస్తీర్ణం తగ్గి పరిపాలన సులభతరం అవుతుందని, ప్రాంతీయ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని, ప్రజలకు సమాన న్యాయం లభిస్తుందని ఆశతో ప్రజలు చిన్న రాష్ట్రాల కోసం కష్టపడ్డారు. తెలంగాణ, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల ఆవిర్భావం ఈ స్వప్నాన్ని నిజం చేసింది. అయితే ప్రశ్న ఏమిటంటే -ఈ చిన్న రాష్ట్రాల్లో నిజంగా అన్ని వర్గాలకూ, ముఖ్యంగా బీసీలకు, రాజకీయ సమన్యాయం కలుగుతోందా?చిన్న రాష్ట్రాల కోసం పోరాటంలో ప్రధాన నినాదం "సమాన వనరుల పంపిణీ, సమాన రాజకీయ అవకాశాలు" అని. తెలంగాణ ఉద్యమంలో కూడా బీసీలు (Backward Classes) ముఖ్య భూమిక పోషించారు. పల్లె స్థాయి నుండి నగర స్థాయివరకు వేలాది బీసీ నాయకులు, కార్యకర్తలు ఉద్యమంలో తలమునకలయ్యారు. ఆత్మగౌరవం, స్థానిక పాలన, సొంత వనరులపై హక్కు అనే నినాదాలు బీసీ సమాజంలో విశేష స్పందన కలిగించాయి.కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ సమాన అవకాశాలు ఎక్కడో కరువయ్యాయి. ముఖ్యమంత్రి, మంత్రివర్గం, ముఖ్యమైన అధికార పదవుల్లో బీసీల శాతం అతి తక్కువగా ఉండటం గమనార్హం. చిన్న రాష్ట్రం ఏర్పడితే అధికారం సులభంగా అందుతుందని భావించిన బీసీల ఆశలు, వాస్తవ రాజకీయ కుతంత్రాల కింద నలిగిపోయాయి.**

రాజకీయ సమన్యాయం అనేది కేవలం పదవులు పంచుకోవడమే కాదుబీ నిర్ణయాధికారం, విధానాల రూపకల్పనలో సమాన పాత్ర కలిగి ఉండటమే. బీసీలు జనాభాలో 50% పైగా ఉన్నా, అసెంబ్లీ సీట్లలో, మంత్రివర్గంలో, లోకసభ స్థానాల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉండటం అసమానతను చూపిస్తుంది.ఒక చిన్న రాష్ట్రంలో భౌగోళిక సౌలభ్యం ఉన్నా, రాజకీయ నిర్ణయాలు ఇంకా సాంప్రదాయిక కులాధారిత శక్తుల చేతుల్లోనే ఉండటం, సమన్యాయం కేవలం నినాదంగా మిగిలిపోవడానికి కారణమవుతోంది. తెలంగాణ

ఏర్పాటుకు ముందు బీసీ వర్గాలు ఉద్యమానికి వెన్నెముకలా నిలిచాయి. కానీ ఆవిర్భావం తరువాత మంత్రివర్గంలో, ముఖ్య పదవుల్లో వారికున్న ప్రాధాన్యం చాలా తక్కువ. ముఖ్యమంత్రి పదవి లేదా ముఖ్య మంత్రిత్వ శాఖలు (హోం, ఆర్థిక శాఖ , మున్సిపల్, రెవెన్యూ,) బీసీలకు దూరంగానే ఉన్నాయి. గ్రామ, మండల స్థాయిలలో కొంతమేర బీసీ నాయకులు ఉన్నా, విధాన రూపకల్పనలో ప్రభావం చూపే స్థాయిలో అవకాశం తక్కువ. ఇక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిన్న రాష్ట్రాల ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యాన్ని చాలా స్పష్టంగా చెప్పారు – "అధికార వికేంద్రీకరణ ద్వారా బహుజనులకు, ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు, నిజమైన రాజ్యాధికారం చేరాలి" అని. ఈ ఆలోచన ప్రకారం, చిన్న రాష్ట్రాల ద్వారా అధికారం కొద్దిమంది చేతుల్లో కాకుండా, గ్రామాల నుంచి పట్టణాల వరకు సమానంగా పంచబడాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు జరిగిన ఉద్యమంలో ఈ భావజాలం కొంతవరకు ప్రతిఫలించింది. ఎందుకంటే, ఆ ఉద్యమంలో బడుగు బలహీన వర్గాలే కాకుండా, బీసీ లు, ఎంబీసీ లు, నిమ్న కులాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరి రక్తం, చెమట, త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది.కానీ రాష్ట్రం ఏర్పడిన 11 సంవత్సరాలు గడిచినా, అంబేద్కర్ కలలలోని "నిజమైన ప్రజాధికారం" ఈ వర్గాలకు ఎంతవరకు చేరిందో ఆలోచిస్తే నిరాశ కలుగుతుంది.

## స్థానిక సంస్థల నుంచే ప్రజాస్వామ్యానికి ప్రవేశం

నిమ్న కులాలకు చెందిన వ్యక్తులు రాజకీయ ప్రస్థానంలో ముందుకు రావాలంటే మొదటగా స్థానిక సంస్థలలో – సర్పంచ్, కార్పొరేటర్, వార్డు కౌన్సిలర్ వంటి పదవులలో – అవకాశాలు రావాలి. ఎందుకంటే, ఇవే రాష్ట్ర అసెంబ్లీలు, పార్లమెంటులకు పునాది రాళ్లు. కానీ వాస్తవం ఏమిటంటే, రాష్ట్రంలోని వేల గ్రామాల్లో ఇప్పటికీ కొంతమంది కులాలవారికి ఒక్కసారి కూడా సర్పంచ్ పదవి దక్కలేదు. అందుకు నిదర్శనం 2014లో తెలంగాణ వచ్చిన తర్వాత బీసీ రిజర్వేషన్లు మొత్తం 8592 సర్పంచ్ స్థానాల్లో బిసిలకు రిజర్వ్ అయిన 2955 స్థానాల్లో మున్నూరు కాపులకు 549, గౌడ్లకు 818, యాదవులకు 560, ముదిరాజ్లకు 625 స్థానాలు దక్కాయి. మొత్తం 6490 ఎంపిటిసి స్థానాల్లో బిసిలకు రిజర్వ్ అయిన 2206 స్థానాల్లో మున్నూరు కాపులకు 457, గౌడ్లకు 733, యాదవులకు 467, ముదిరాజ్లకు 418 స్థానాలు దక్కాయి, మొత్తం 434 ఎంపిపి స్థానాల్లో, బిసిలకు రిజర్వ్ అయిన 147 స్థానాల్లో మున్నూరు కాపులకు 42, గౌడ్లకు 40, యాదవులకు 31, ముదిరాజ్లకు 22 స్థానాలు లభించాయి. మొత్తం 441 జడ్పిటిసి స్థానాల్లో, బిసిలకు రిజర్వ్ అయిన 149 స్థానాల్లో మున్నూరు కాపులకు 45, గౌడ్లకు 31, యాదవులకు 24, ముదిరాజ్లకు 15 స్థానాలు లభించాయి. జిల్లా పరిషత్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు ఈ పదవులకు ఎన్నికల్లో కూడా బిసిలకు ఇదే విధమైన ప్రాతినిధ్యం దక్కింది. ఒక కులానికి గ్రామంలో ఓటు శాతం ఉన్నా, ఆ స్థానాన్ని ఎప్పటికీ ఇతర శక్తివంతమైన కులాలే ఆక్రమిస్తారు. కారణం, ఏ బి సి డి, రిజర్వేషన్ విధానంలో వర్గీకరణ లేకపోవడం. 2014లో తెలంగాణలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించబడింది. ఇది కాగితం మీద మంచి శాతం అనిపించినా, వర్గీకరణ లేకపోవడం వల్ల ఆ రిజర్వేషన్ ఎక్కువగా ప్రభావవంతమైన బీసీ కులాలకే దక్కింది. మిగిలిన నిమ్న, బలహీన బీసీ కులాలకు మాత్రం ప్రాతినిధ్యం దొరకలేదు. ఇక 2019లో స్థానిక సంస్థలరాష్ట్రంలో మొత్తంగా 12,751 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీల్లో 50 శాతానికి లోబడే రిజర్వేషన్లు ఉండాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో బీసీలకు 22.8 శాతం,వాటిలో 3146 ఎస్టీలు, 2113 ఎస్సీలు, 2345 బిసిలు, ఓపెన్ క్యాటగిరీలో 5417 మంది సర్పంచ్లు బాధ్యతల్లోకి వచ్చినట్టు పంచాయతీరాజ్ గతంలో ఉన్నతాధికారులు వెల్లడించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించిన పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లు 34 నుంచి 22 శాతం తగ్గించి బీసీలనా యకత్వాన్ని ఎదగకుండా దెబ్బ తీశారు. నిజానికి బిఆర్ఎస్ సర్కార్ సుప్రీంకోర్టులో బీసీల కేసు వాదించ కుండా వాపస్ తీస్కొని బీసీలకు అన్యాయం చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించింది. అదీగాక ఇంకేవేవో తప్పుడు లెక్కలు చూపి కేవలం 18 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. మొత్తం గ్రామపంచాయతీలు సుమారు 12751 కాగా 56శాతం జనాభా ఉన్న బీసీలకు 6822 గ్రామ పంచాయతీలు దక్కాలి. గతంలో లెక్క 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే 4300 పంచాయతీలో బీసీలకు దక్కాలి. కానీ 2332 మాత్రమే కేటాయించింద్రు. అంటే 18 శాతం మాత్రమే దక్కాయి. దీంతో రెండు వేల గ్రామ సర్పంచులు. 23వేల వార్డు మెంబర్లు బీసీలకు దక్కాల్సినవి దక్కకుండా పోయాయి. అట్లనే జడ్పీటీసీ, ఎంపీటీసీ, జిల్లా పరిషత్ చైర్మన్, మండల్ పరిషత్ చైర్మన్ పదవులల్ల కూడా బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 తగ్గించి బీసీల నాయకత్వాన్ని ఉద్దేశపూర్వకంగా అణచివేశారు.

## ఇక మహిళలు

50% పంచాయతీలు 6,378 కేటాయించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ సామాజిక నేపథ్యం 1952 నుంచి 2018వరకు ఎమ్మెల్యేలుగా అగ్రకులం, 869 మంది గెలిస్తే. బీసీల ఎమ్మెల్యే లు 260, మైనార్టీలు , 104 ఎమ్మెల్యేలు , లోక్సభ సభ్యులు 24 ,లోక్సభ సభ్యులు అగ్రకులాలు, 390, కాగా బీసీలు 62, ఎమ్మెల్సీలు అగ్రకులాలు 296, బీసీలు 43, మైనార్టీలు 41, రాష్ట్ర మంత్రివర్గంలో, అగ్రకులాలు, 584, బిసి మంత్రులు, 142, మైనార్టీలు 45, అగ్రకులాలు 55 సంవత్సరాలుగా స్పీకర్లు 45, బీసీలు సుమారు ఐదుగురు, ఇక ముఖ్యమంత్రులు 66సంవత్సరాలుగా 53 మంది అగ్రవర్ణాలే వివిధ పత్రికల ఆధారంగా నమోదైన సంఖ్య, ఇక బీసీ ముఖ్యమంత్రి ఇంతవరకు లేరు అనేది నగ్న సత్యం. ఇక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 2014లో రెడ్డి సామాజిక వర్గం ఎమ్మెల్యేలు 42, 2018లో 40, వెలమ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు 2014లో 09, 2018 లో 10, కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు 2014లో 06, 2018లో 05, బ్రాహ్మణ వర్గానికి చెందినవారు 2014లో,02, 2018లో02, ఆర్యవైశ్య ఎమ్మెల్యేలుగా 2014లో,01, 2018లో,01, మైనార్టీ వర్గానికి చెందినవారు 2014లో08, ఎమ్మెల్యేలు 2018లో08, ఇక బిసి ఎమ్మెల్యేలు 2014లో 20, 2018లో 22, ఎమ్మెల్యేగా గెలుపొందారు, ఇక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 2014 -16 సం:స్థానిక సంస్థల్లో సర్పంచులు గా గెలుపొందిన కులాలు, రెడ్డి సామాజిక వర్గం,1081, కాగా, వెలుమా సామాజిక వర్గం 119, కమ్మ సామాజిక వర్గం97, బ్రాహ్మణ సామాజిక వర్గం28, వైశ్య సామాజిక వర్గం,37, ముస్లిం సామాజిక వర్గం44, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత 2014లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఫలితాలను గమనిస్తే 34 శాతం రిజర్వేషన్లు బీసీ రిజర్వేషన్ అయిన స్థానాలలో సుమారు 2955 స్థానాలలో మున్నూరు కాపులకు 549, గౌడలకు, 818, యాదవులకు 560, ముదిరాజులకు 625, స్థానాలు దక్కాయి, ఎంపీటీసీ స్థానాలలో బీసీల రిజర్వేషన్ ప్రకారంగా సుమారు, యాదవులకు 467, కాపులకు 457, గౌడలకు 733, ముదిరాజులకు 418, స్థానాలు దక్కాయి. ఎంపీపీ స్థానాల్లో మున్నూరు కాపులకు 42, గౌడలకు 40, యాదవులకు 31, ముదిరాజులకు 22, స్థానాలు లభించాయి, జడ్పిటిసి స్థానాల్లో, మున్నూరు కాపులకు 45 గౌడలకు 31, యాదవులకు 24, ముదిరాజులకు 15, స్థానాలు దక్కాయి,ఇక అనుచబడ్డ కులాలకు ప్రాతినిధ్యం లేకుండా 75 సంవత్సరాలుగా పాలించిన పాలకులు కళ్ళకు ఈ కులాలు కనబడలేదా...? ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని, చట్టాలను అనుసరించి పారదర్శకంగా, పనిచేయాలి , శాసనము ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం అందరికీ సమాన వాట కల్పించాలని, ప్రభుత్వ శాసన నిర్మాణ శాఖ, న్యాయశాఖ, కార్యనిర్వహణ శాఖ అనే ఈ మూడు అంగాల ద్వారా పనిచేస్తుంది శాసన నిర్మాణ శాఖ కేంద్రంలో లోక్సభ, రాష్ట్రంలో అసెంబ్లీ , శాసనమండలి, ద్వారా పనిచేస్తుంది వీటిపై గత 60 సంవత్సరాలగా ఎవరి ఆధిపత్యం ఉందో మనందరికీ తెలిసిందే ఒక ప్రక్కన కార్యనిర్వాహక శాఖ మంత్రి సచివాలయాలు, కమిషనరేట్లు ,డైరెక్టర్లు, ఇతర అనేక పాలన లో ఎవరు ఉంటున్నారు అనేది మనకు అర్థమయ్యింది. ఇక రాజకీయ పార్టీల అధ్యక్షులు, అగ్రవర్ణాలు కాంగ్రెస్ పార్టీ,( 69%), బిజెపి( 90%) శాతం టిడిపి (100%) సిపిఐ (100%) సిపిఎం (100%) బిఆర్ఎస్ (100%) వైఎస్ఆర్సిపి (100%) ఇక మహిళల పట్ల సాధికారత తో పాటు శ్రద్ధచూపిస్తున్నట్లు నటించడంలో నేటి సాటి ఈ పార్టీలు, మహిళల పట్ల చిత్తశుద్ధి లేక సమతుల్యత లేక స్వాతంత్రం వచ్చి నాటి నుండి మహిళలకు ఎమ్మెల్యే సీటు ఎంపీ ఎమ్మెల్సీలల్లో టికెట్లు ఇయ్యడానికి ఈ పార్టీలకు చేతులు రావు కానీ వారి ఓటు మాత్రం కావాలి. ఇదెక్కడి సమన్యాయం, ఇక 1954 తర్వాత దాదాపు 9000 పైగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, మొదలగు ఉన్నత సర్వీసులలో అధికారులలో సుమారు 6000 వరకు అగ్రకులాల వారే నియమించబడ్డారు, బీసీ ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ అప్పటికే జనరల్ సీట్లో అగ్రకులాలకు రిజర్వు చేయుచున్నట్టుగా నియమించడం జరిగింది,. బీసీ రిజర్వేషన్ లేనప్పుడు అన్ని నియమకాలు కూడా అగ్రకులస్తులే నియామకాలు పెద్ద ఎత్తున జరిగింది.

ఇక కేంద్ర సర్వీస్ లో గ్రూప్ ఏ లో 11. 29%, బి లో 12. 68% ,సి లో 15. 78%, డి లో 19. 99%, మాత్రమే ఇక పారిశుద్ధ సిబ్బందిలో మాత్రం, 66% ఎస్సీలు,, ఎస్టీలు 15% పై మిగిలిన శాతాన్ని మొత్తం బీసీలుగా ఉన్నారు, ఇక ఉదాహరణకు, ఒక మండలంలో 10 సర్పంచ్ స్థానాలు ఉన్నాయనుకుందాం. అందులో 3–4 బీసీ రిజర్వేషన్ ఉన్నా, ఆ స్థానాలన్నీ పెద్ద రాజకీయ ప్రభావం ఉన్న బీసీ ఉపవర్గాలకే వెళ్ళే అవకాశం ఉంది. ఎంబీసీ లు లేదా సామాజికంగా చాలా వెనుకబడిన ఉపవర్గాలు మాత్రం మళ్ళీ పక్కకు నెట్టబడతాయి.స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు, అంటే 75 సంవత్సరాలుగా, పాలకులు బీసీల విషయంలో ఒకే రకమైన తప్పు చేస్తూ వచ్చారు – "వర్గీకరణ లేకుండా రిజర్వేషన్". ఈ విధానం వల్ల రిజర్వేషన్ ప్రయోజనం శక్తివంతమైన బీసీ కులాల వద్దే కేంద్రీకృతమైపోయింది. దాంతో బీసీలలోని నిమ్న కులాలు, ఎంబీసీ లు రాజకీయంగా, ఆర్థికంగా ఇంకా అట్టడుగునే ఉన్నారు.ప్రతి ప్రభుత్వం తమ పాలనలో "బీసీలకు ప్రాధాన్యం" ఇస్తామని హామీ ఇచ్చినా, వాస్తవానికి స్థానిక సంస్థల్లోనూ, చట్టసభల్లోనూ ఈ వర్గాల ప్రాతినిధ్యం పెంచే విధమైన ప్రణాళికలు అమలు కాలేదు.బీసీలు ఒకే కులం కాదని, వందలాది కులాల సమాహారమని మనందరికీ తెలుసు. వీటిలో ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు విపరీతంగా తేడా ఉంటాయి.కొన్ని కులాలు చరిత్రలోనే శక్తివంతంగా ఎదిగాయి.మరికొన్ని కులాలు ఇప్పటికీ విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలలో చాలా వెనుకబడి ఉన్నాయి.వర్గీకరణ లేకుండా రిజర్వేషన్ ఇవ్వడం అంటే, ఇప్పటికే బలమైనవారికి మరింత బలం ఇవ్వడమే అవుతుంది. అంబేద్కర్ ఆలోచన ప్రకారం, నిజమైన సామాజిక న్యాయం అందాలంటే రిజర్వేషన్ లోపలే ఉపవర్గీకరణ తప్పనిసరి.ఈ సమస్యకు పరిష్కారం సాధించాలంటే, మొదటగా ప్రజల్లో అవగాహన రావాలి. ఒక నిమ్న కులానికి చెందిన వ్యక్తి సర్పంచ్, కార్పొరేటర్, వార్డు కౌన్సిలర్‌గా ఎన్నిక కాకపోతే, ఆయన లేదా ఆమె అసెంబ్లీ, పార్లమెంట్ స్థాయికి చేరడం చాలా కష్టం. ప్రభుత్వం కూడా "వర్గీకరణ లేని రిజర్వేషన్" విధానం మార్పు చేసి,ప్రతి బీసీ ఉపవర్గానికి తగిన ప్రాతినిధ్యం,స్థానిక సంస్థల నుంచే అవకాశాలు రాజకీయ శిక్షణ, ఆర్థిక సహాయం ఇవన్నీ కలిపి ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించాలి. చిన్న రాష్ట్రాలు ఏర్పడితే బహుజనులకు అధికారం వస్తుందని అంబేద్కర్ చెప్పినది సత్యమే. కానీ అధికారం సత్యంగా బహుజనుల వద్దకు రావాలంటే, ఆ బహుజనులలోని అత్యంత వెనుకబడిన వర్గాలకు ముందుగా హక్కులు, అవకాశాలు ఇవ్వాలి. లేకపోతే, రాష్ట్రం చిన్నదైనా, అధికారం మాత్రం కొద్దిమందికే పరిమితం అవుతుంది. తెలంగాణ సాధనలో కష్టపడిన బీసీ, ఎంబీసీ, నిమ్న కులాలు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం పొందే రోజు రాకపోతే, మనం అంబేద్కర్ కలలలోని సమానత్వ రాజ్యానికి ఇంకా చాలా దూరంలోనే ఉన్నట్టే. ఇక రాజకీయ పార్టీలు ప్రజలకు సమాన హక్కులు కల్పించడానికి చట్టసభల్లో పోలేని కులాలకు,జనాభా శాతానికి సరిపడని రాజకీయ ప్రాతినిధ్యం.ప్రధాన పదవులు పరిమిత కులాలకే కేంద్రీకృతం కావడం.బీసీల అవసరాలకు సరిపోయే విధానాలు రూపకల్పన కాకపోవడం.

## బీసీలను కేవలం ఓటు బ్యాంకులుగా చూడడం.

మంత్రివర్గంలో, ముఖ్య పదవుల్లో బీసీలకు నిర్దిష్ట శాతం రిజర్వేషన్ కల్పించాలి. బీసీ వర్గాల నుండి యువ నాయకులను శిక్షణ ఇచ్చి, రాజకీయాల్లో ప్రోత్సహించాలి. బీసీల కోసం ప్రత్యేక రాజకీయ వేదికలు, సంఘాలు బలపడాలి.బీసీలు తమ ఓటు శక్తిని వ్యూహాత్మకంగా వినియోగిస్తేనే సమన్యాయం సాధ్యం.చిన్న రాష్ట్రాల స్వప్నం ప్రజలకు పరిపాలనలో సౌలభ్యం, స్థానిక సమస్యల పరిష్కారం అందించడంలో కొంతవరకు సఫలమైంది. కానీ బీసీలకు నిజమైన రాజకీయ సమన్యాయం ఇంకా అందలేదు. జనాభా శాతానికి తగిన ప్రాతినిధ్యం లేకపోతే చిన్న రాష్ట్రం అనే రూపకల్పన కూడా అసమానతలనే కొనసాగిస్తుంది. కాబట్టి, చిన్న రాష్ట్రాల విజయాన్ని కొలిచే ప్రమాణం – అందులోని ప్రతి వర్గానికి, ముఖ్యంగా బీసీలకు, రాజకీయ న్యాయం ఎంతవరకు జరిగిందనే దానిపైనే ఆధారపడి ఉంటుంది.చిన్న రాష్ట్రం విజయాన్ని కొలిచే అసలు ప్రమాణం – అందులోని ప్రతి వర్గానికి, ముఖ్యంగా బీసీలకు, తగిన రాజకీయ ప్రాధాన్యం లభించిందా లేదా అన్నదే. అది సాధ్యమవ్వాలంటే, బీసీ సమాజం ఐక్యంగా, వ్యూహాత్మకంగా ముందుకు రావాల్సిందే.



మన్నారం నాగరాజు

## గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**- ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు**



**మంచాల వెలుతురు ఆగస్టు 22:**

మంచాల మండలం కేంద్రంలోని డండేటికార్ శర్వింటి పక్షన్ హాల్ లో మంచాల పోలీస్ స్టేషన్ సీఐ మధు ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల సన్నాహక సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథి గా ఇబ్రహీంపట్నం ఏసిపి కె వి పి రాజు మాట్లాడుతూ త్వరలో ప్రారంభమయ్యే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని పర్యావరణాన్ని కాపాడుతూ సమస్యలు సృష్టించకుండా డీజె సౌండ్ మోతలు లేకుండా ఉదయం ఆరు గంటల నుండి రాత్రి పది గంటల వరకు చిన్న సౌండ్ బాక్స్ లానే పెట్టి భక్తి గీతాలే పెట్టాలి అన్నారు పెద్ద పెద్ద గణేశ్ విగ్రహాలు కాకుండాచిన్న చిన్నమట్టి గణపతి విగ్రహాలను పెట్టు కోవాలని అన్నారు గణపతులు మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి ప్రతి మండపం దగ్గర ఇద్దరు వ్యక్తులు పండుకోవాలి దారి అడ్డంగా మడపటు ఏర్పాటు చేయకూడదు ఇతర మతాలను వ్యతిరేకించే గీతాలు పెట్టకూడదు ప్రభుత్వం నిర్ణయించిన సెప్టెంబర్ ఆరవ తేది రోజు గణేష్ నిమజ్జనం చేసుకోవాలి అన్నారు, గణేశ్ నిమజ్జనం చేసుకునే రోజు ఎలాంటి గొడవలు జరగకుండా జాగ్రతలు తీసుకోవాలి ప్రతి గణేశ్ మండపానికిపోలీస్ అనుమతి తీసుకోవాలి గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శాంతి యుతంగా ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు ఈకార్యక్రమంలో మంచాల పోలీస్ స్టేషన్ ఎస్సైలు వంశీ నాగేశ్వరరావు ఎస్సై సతీష్ రెవిన్యూ అధికారి అర్బ శ్రీనివాస్ వివిధ పార్టీల నాయకులు యువజన సంఘాల యువకులు తదితరులు పాల్గొన్నారు

## ఆరుట్ల గ్రామంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**- సిఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం**

**- కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు రావుల బాషా**



**మంచాల వెలుతురు ఆగస్టు 22:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో అనారోగ్యంతో ప్రైవేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకున్న దాసరమోని పాండరీ లోంగిరి ఆనంద్ కోరే పాండులకు,వైద్యం ఖర్చుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ ఆరుట్లగ్రామ శాఖ అధ్యక్షుడు రావుల బాషా కార్యదర్శి దాసరమోని రమేష్, ముదిరాజ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు అయిన ఆరుట్ల మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్ ముదిరాజ్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ముంది నసిరాం కలిసి మాట్లాడుతూ పేద ప్రజల వైద్యం కోసం అనాడు స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశ పెట్టి ఎంతో మంది ప్రజల ప్రాణాలు కాపాడిన గొప్ప ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు అదే బాటలో నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పది లక్షలకు పెంచి ప్రైవేట్ హాస్పిటల్లో వైద్యం చేయించు కొని పేద ప్రజలకు ఆసరాగా ఉంటున్న డైనమిక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు, పేద ప్రజల వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం మంజూరు చేసే సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరంలాంటిది అన్నారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో వైద్యం ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ డబ్బులు మంజూరు చేస్తున్నా ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ మాజీ సర్పంచ్ అసంగల్ల యాదయ్య ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నరసింహాగౌడ్ బుట్టి కృష్ణ ముదిరాజ్ నాయకులు పాంపాల బుగ్గరాములు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ అంతటి రాజుగౌడ్ బుట్టి జంగయ్య ముదిరాజ్ మార సురేష్ మణి పాటి వెంకటేష్ బీర్ మల్లేష్ రావుల శ్రీకాం త్ తదితరులు పాల్గొన్నారు

## ఆరుట్లలో పనుల జాతర సమావేశం

**- ప్రభుత్వం చేసిన పనుల గురించి వివరించిన గ్రామ కార్యదర్శి వెంకటేష్**



**మంచాల వెలుతురు ఆగస్టు22:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వం ఆగస్టు 22నుండి మొదలు పెట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఆరుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో పనుల జాతర సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కార్యదర్శి వెంకటేష్ ఇప్పటి వరకు గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అమలు అవుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు అండర్ డ్రైనేజీ సిసి రోడ్లు వీధిలైట్లు ఇంకా గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరిగాయి పూర్తిగా సమావేశం లో వివరించారు జరిగిన పనులు ఉపాధి హామీ 65పనులు14లక్షల 96 వేల రూపాయలు పిఆర్ ఇంజనీరింగ్ వర్క్స్40లక్షల రూపాయల ఖర్చు, వాటర్ షెడ్103పనులు 80లక్షల ఖర్చు నిరుపేద కుటుంబాలకు 52 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు గృహజ్యోతి రెండువందల లోపు యూనిట్ల వరకు గృ హాలకు ఉచిత విద్యుత్ 1182 లబ్ధిదారులకు మహాలక్ష్మి 95 లబ్ధిదారులకు రేషన్ కార్డులు 77 లబ్ధిదారులకు ఆత్మీయ భరోసా 54 లబ్ధిదారులకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం 2133 లబ్ధిదారులకు సంక్షే మ పథకాలు అందుతున్నాయి అని కార్యదర్శి వెంకటేష్ వివరించారు ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బుట్టి కృష్ణ ముదిరాజ్ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ కావలి నరసింహా గ్రామ పంచాయతీ కరోబార్ సాతిరి శంకరయ్య గ్రామస్తులు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ ప్రజాగళం భూపాల్ మార సురేష్ బోయిని నరసింహా తవిటి యాదయ్య బచ్చయ్య తదితరులు పాల్గొన్నారు

## ఎసిబికి చిక్కిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్

**కరీంనగర్,ఆగస్ట్22( వెలుతురు):**

జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్గా పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డి ఎసిబి వలకు చిక్కారు.వివరాలలోకి వెళితే.. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం ఒక బాధితుడి నుంచి రూ.5 వేలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. అయితే, లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు శుక్రవారం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ లంచం డబ్బులు స్వీకరిస్తుండగా రెడ్హ్యాండెడ్గా పట్టు-కున్నారు. తదుపరి విచారణ కోసం అతనిని కరీంనగర్ కోర్టుకు తరలించున్నట్లు- ఎసిబి డిఎస్పి మధు తెలిపారు.

# పదోన్నతులు కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు

**- ఇతర సమస్యల పరిష్కారాలపై దృష్టి పెట్టండి.**

**- ప్రభుత్వాన్ని కోరిన ఎస్ టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు**




**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

గత ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్ టి ఎఫ్) తెలంగాణ ధన్యవాదాలు తెలిపింది. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ టి ఎఫ్ అధ్యక్షుడు దేవరకొండ సైదులు,%ట%రాష్ట్ర ప్రధాన కార్యదర్శి %ఖ% పోచయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల విషయంలో ఎన్ని పోరాటాలు చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. ప్రజాపాలన అందిస్తామని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని శాస్త్రీయంగా పరిష్కారానికి ప్రయత్నిస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే ఉపాధ్యాయులకు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజుల్లోనే సుమారు 22,000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని చెప్పారు. దీంతోపాటు బదిలీల కోసం వేచి ఉన్న 47,244 ఉపాధ్యాయులకు బదిలీలు చేశారని తెలిపారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే లక్ష్యంతో పదివేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజ్యాంగబద్ధంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వానికి తెలియజేసే ప్రయత్నం చేసే అవకాశం కూడా ఇవ్వలేదని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ నేతలను నిత్యం పోలీసులు వెంటాడే వారని గుర్తు చేశారు. కాగా ఇప్పటికీ ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నగదు రహిత వైద్య పథకానికి సంబంధించిన అన్ని చర్యలు తక్షణమే తీసుకోవాలని కోరారు. జీవో నెంబర్ 25 ను సవరించాలని ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 40 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షనరీ బెనిఫిట్స్ ను వెంటనే అందించాలి, సి పి ఎస్ ను రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న 420 మంది కాంట్రాక్ట్ లెక్చరర్స్ ను సర్వీస్ క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలపు జీతాన్ని చెల్లించాలి, కేజీబీవీ సమగ్ర శిక్షలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. 317 జీవో ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులందరిని వారి స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

## నూతన పదవి బాధ్యతలను స్వీకరించిన పోచారం మున్సిపల్ పురపాలక సంఘం కమిషనర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**పోచారం వెలుతురు ఆగస్టు 22:**

పోచారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని నూతన పదవి బాధ్యతలను చేపట్టిన కమిషనర్ నిత్యానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి, శు భాకాంక్షలు తెలియజేసిన్నారు, బీసీసీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాలగౌని వెంకటేష్ గౌడ్, సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, గ్రామ అభివృద్ధిలో ముందుండి నడిపించి అక్రమాలకు తావు లేకుండా, పోచారం మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ఆదర్శప్రాయంగా జిల్లావ్యాప్తంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరడం జరిగినది. ఈకార్యక్రమంలో పాల్గొన్న కర్రె రాజేష్ మండల అధ్యక్షులు, మెట్టు గణేష్ జనరల్ సెక్రెటరీ యూసుఫ్, అంజన్ గౌడ్, బద్రి హేమంత్, మల్లికార్జున్ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, బద్దం వెంకట్రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ నరసింహ, విజయ్ రెడ్డి, సిహెచ్ పరమేష్ యాదవ్, ఎర్ర రాజు, శాంత కుమార్, భాస్కర్ రెడ్డి, నరేష్ గౌడ్, సహదేవ్, సగ్గు శీను, లక్ష్మణ్, శ్రీశైలం, దర్శన్, వెంకటరెడ్డి, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్ర మాధవి, వంగాల లక్ష్మి, యూత్ కాంగ్రెస్ వినోద్ మరియు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియపరచారు.

# తెలుగు సాహితీ వైభవానికి సినారె విశేష కృషి

**- మౌనశ్రీ మల్లిక్ కు సినారే సాహితీ పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి**



**వెలుతురు, హైదరాబాద్ ఆగస్టు 22 :**

తెలుగు సినిమా పాట ఉన్నంత కాలం సి.నారాయణ రెడ్డి చరిత్రలో నిలిచి ఉంటారని ఎమ్మెల్సీ మధు సూదనాచారి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారం తో సత్య సంగీత ఇంటర్నేషనల్ ఆ ధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీ త,పద్మభూషణ్, మహాకవి సి.నా రాయణరెడ్డి జయంతిని పురస్కరించుకొని ప్రముఖ సినీ, టీవీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ కి సినారే సాహిత్య పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమం త్యాగరాయగానసభ లో నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మ ధుసూదనాచారి హాజరై మన శ్రీ మల్లికి సినారె సాహిత్య పురస్కా రం ప్రదానం చేసి ప్రసంగించారు. తెలుగు సాహితీ సౌరభాలను ప్రపం చానికి చాటిన మహనీయుడు సినా రె అని కొనియాడారు. మల్లిక్ కవిగా దిగంబర, గరళం, తప్పస్పృహ, మం టల స్నానం, చలనకాంక్ష వంటి ఉ త్తమశ్రేణి కవితా సంపుటులు వెలు వరించారని, అవి పలు పురస్కారా లు పొంది, సాహిత్య రంగంలో మం చి గుర్తింపును పొందారన్నారు. మౌ నశ్రీ కవిగానే కాకుండా టీవీధారవా హికలకు సుమారు 700 పైగా పాట లు రాసి రికార్డులు సృష్టించారని అన్నారు. అంతేకాకుండా పలు సిని మాలకు కూడా పాటలు రాస్తున్నా రని ప్రశంసించారు. మల్లిక్ అన్ని ర కాల పాటలు కలుపుకొని 1000 పా టల మైలురాయిని దాటడం గొప్ప విషయం అన్నారు. సినారె 94 జయంతి ఉత్సవాల్లో పు రస్కారం ప్రదానం చేయడం సము చితంగా ఉందని పేర్కొన్నారు. స త్య సంగీత ఇంటర్నేషనల్ వ్యవస్థా పక అధ్యక్షులు ఓంకార్ రాజు, సంస్థ కార్యద ర్శి శైలజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాస కులు దైవజ్ఞశర్మ, డాక్టర్ వంశీ రామరాజు, దూ ల్ పేట మహంకాళి దేవాలయం ట్ర స్టీ జరర్ మహేష్ కుమార్, ప్రముఖుల మీద సాధనాల వెంకటస్వామి, క్రాం తి కృష్ణ, కల్పన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల సాధన కోసం దళిత సంఘాల ఐకాస మద్దతు ప్రకటించడం శుభపరిణామం

**- 33 జిల్లాల పర్యటనకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేసిన దళిత, బీసీ సంఘాల నాయకులు**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ దళిత సంఘాల ఐకాస రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ తెలంగాణలోని అన్ని జిల్లాల పర్యటనకు సంబంధించిన గోడపత్రికలను హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్,దళిత సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బత్తుల చంద్రం తదితరులు ఆధ్వర్యంలో కలిసి ఆవిష్కరించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఇంతవరకు బీసీలే ఉద్యమం చేశారని న్యాయమైన బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి మేము కూడా మద్దతిస్తాం అని ముందుకొచ్చి ఆగస్టు 27 నుండి డిసెంబర్ 27 వరకు 33 జిల్లాల పర్యటనకు సిద్ధమైన దళిత సంఘాల ఐకాస కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

## మద్యం దుకాణాలలో (వైన్ షాపులలో) గౌడ కులస్తులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.

**- బీసీ నేత జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా వైన్ షాపులలో గౌడ కులస్తులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ బహిరంగ సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ముఖ్య అతిథిగా హాజరైన ఆ సభకి అప్పుడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సిద్దరామయ్య కలిసి బీసీ డిక్లరేషన్‌ను విడుదలచేశారు. గౌడ కులస్తులకు మద్యం దుకాణాలలో ప్రస్తుతం 15 శాతం ఉన్న రిజర్వేషన్ ను 25 శాతానికి పెంచుతాం అని స్పష్టంగా హామీ ఇచ్చారని పేర్కొన్నారు.కానీ మద్యం దుకాణాల్లో గౌడ సామాజికవర్గానికి 25 రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇంకా ఏ నిర్ణయం తీసుకోకపోవడం బాగోలేదన్నారు.

## డివిజన్ లో ఎటువంటి ఇబ్బంది కలగకుండా చెట్ల కొమ్మలను తొలగించి, రోడ్ టాక్స్ వర్కులు చేయించిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామానుగౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**



మరొక నాలుగు రోజుల్లో వినాయక చవితి నవరాత్రులు ప్రారంభమవుతుంది కాబట్టి హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ డివిజన్ లో సంబంధించి అన్ని శాఖల అధికారులతో మాట్లాడి వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా మరియు ఈ రహదారిపై అనేక విగ్రహాలు ముఖ్యంగా పోతున్న కారణంగా వాళ్ళకి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చెట్ల కొమ్మలను తొలగించి మరియు రోడ్ టాక్స్ వర్కులు చేయించి అన్ని విధాలుగా సౌకర్యాలలో వాళ్లకు జరిగేలా చూడాలని ఆదేశించారు.

## జేపల్లి రేణుక ఎల్లమ్మ దేవాలయానికి మైక్ సెట్ విరాళం

**- దాత వెలిజాల వెంకటేష్ ను సత్కరించి అభినందనలు తెలిపిన గ్రామపెద్దలు...**



**వెలుతురు, చారకొండ ఆగస్టు 22 :**

చారకొండ మండలం జేపల్లి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయానికి అదే గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు, మాజీ వార్డు సభ్యులు వెలిజాల వెంకటేష్ రూ.15వేల విలువ గల మైక్ సెట్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ...మైక్ సెట్ అందజేసిన దాత వెంకటేష్ ను ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్థులు శాలువాతో సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఇటీవల గ్రా మంలో జరిగిన రేణుక ఎల్లమ్మ బోనాల పండుగకు తమకు తోచిన విధంగా చే యూత అందించిన గ్రామ పెద్దలు గును గంటి శ్రీనివాస్ రావును, వంకేశ్వరం చిన్న రమేష్ ను గ్రామపెద్దలు సత్కరించి అభి నందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చిన్నారి రీతూ జన్మదిన వేడుకలకు హాజరైన సమ్మి గౌడ్ చిలువేరు




## సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలి

**- తపస్ జిల్లా అధ్యక్షులు రేపాక ఉమా**







**భువనగిరి వెలుతురు ఆగస్టు 22:**

ఉపాధ్యాయుల సీపీఎస్ రద్దు,పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తపస్ అధ్యక్షులు రేపాక ఉమా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆలేరు మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున సభ్యత్వం తీసుకుని సంఘంలో చేరారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని లేదంటే ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని ప్రభుత్వానికి తెలియజేశారు. అలాగే ఆగస్టు 23 న పెద్ద సంఖ్యలో సంఘ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వివిధ స్థాయిలో వినతి పత్రాలను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు . ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ డీఏ, పీఆర్సీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా సాలరీలు ఇచ్చేలా తగు ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు కేజీబీవీ మహిళా ఉపాధ్యాయినులకు ఎంటీఎస్ ఇవ్వాలని, కేర్ టేకర్ ని నియమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పల్ల రామకృష్ణారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కే సుభాషిణి వెంకటేశ్వర్లు, సైదారావు, మండల బాధ్యులు రాఘవరెడ్డి కల్పన పాల్గొన్నారు

## ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భారీ విరాళం

### - సమ్మిగౌడ్ చిలువేరు

**- ఆంజనేయు స్వామి ఆలయ స్లాబ్ నిర్మాణానికి విరాళంగా రూ. 20,000 విలువగల సామాగ్రి అందజేత..**

**- అడిగితే లేదనకుండా సహాయం చేసే సహృదయుడు చిలువేరు సమ్మి గౌడ్ - ధరావత్ సోమని -ఆలయ కమిటీ అధ్యక్షులు**



**కేసముద్రం వెలుతురు ఆగస్టు 22:**

కేసముద్రం మండలం బిచ్చా నాయక్ తండా లో 2 ఫిబ్రవరి 2025 న శంకుస్థాపన చేసి నిర్మిస్తున్నటువంటి ఆంజనేయ స్వామి గుడికి సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ విరాళంగా రూ.20,000/- విలువగల ఆలయ స్లాబ్ సామాగ్రి ని ఆలయ కమిటీ కి అందజేశారు.ఆలయ కమిటీ పెద్దలు మాట్లాడుతూ... ఆ ఆంజనేయస్వామి ఆశీస్సులు వారికి వారి కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని కోరుతూ మండలంలోని ఎన్నో గ్రామాలకు అడిగితే లేదనకుండా సహృదయంతో ఎన్నో రకాలుగా విరాళాలు అందించి ఆయా గ్రామాల గ్రామదేవతల ఆశీస్సులు ప్రజల మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి అని అన్నారు.అదేవిధంగా ధరావత్ సోమని మాట్లాడుతూ... ఏమీ ఆశించకుండా నిస్వార్థమైన ప్రేమతో నిరుపేదలకు సహాయాన్ని అందించడమే కాకుండా ఎవరు అడిగినా సరే వెంటనే స్పందించి అడిగిన ప్రతివారికి ఆలయాల నిర్మాణాలకు తన వంతు సహాయంగా విరాళాలు అందజేయడంలో ముందుండే వ్యక్తి సమ్మి గౌడ్ అని ఇలాంటి వ్యక్తికి ప్రజలు ప్రజాక్షేత్ర పాలనలో అవకాశం కల్పిస్తే ప్రతి గ్రామం అభివృద్ధి దిశలో ఉంటుందని,వారికి మా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు.. ఈ కార్యక్రమంలో తేజావత్ మోహన్,గుగులోత్ నరేష్,వాంకుడోత్ రవి నాయక్ బాధావత్ సంజయ్,ధరావత్ శ్రీనివాస్,ధరావత్ భాష,,ధరావత్ బాలు, ఇస్లావత్ వీరన్న, ,బానోత్ వీరన్న, ఇస్లావత్ వెంకన్న, ధరావత్ రాజేష్,తేజా బాలు,నాగార్జున, తేజావత్ అరవింద్, లకావత్ సోమ్లా,నాన బాలు రమేష్, వాగుడుత్ రాజా తదితరులు పాల్గొన్నారు..



## రామన్నపేట బిజెపి నాయకులు ముందస్తు అరెస్ట్



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 22**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక పాలనకి వ్యతిరేకంగా బిజెపి రాష్ట్ర పార్టీ అసెంబ్లీ ముట్టడి పిలుపుమేరకు వెళుతున్నట్వంటీ బిజెపి నాయకులు నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జ్ నకిరేకంటి మొగులయ్య మరియు రామన్నపేట బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి లను అక్రమ అరెస్టులు చేయడం జరిగింది. అలాగే ఈ రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్నటువంటి రోహింగ్యాలని బయటకి పంపివ్వడం చేతగాక బిజెపిపై దుష్ప్రచారం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్నంటి నిర్ణయాలు బిజెపి రామన్నపేట మండల శాఖ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం.

## ప్రభుత్వం మద్యం పాలసీని సవరించాలి

**- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు**



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 22**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 2025 సంవత్సరము ఎక్సైజ్ పాలసీని ప్రకటించడం జరిగింది. అని అట్టి పాలసీలో మార్పు చేయవలసిన అవసరం ఉన్నాదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు అన్నారు. తేదీ 22.08.2025 శుక్రవారం రోజున రామన్నపేట పట్టణ కేంద్రంలో జరిగిన కల్లు గీత కార్మిక సంఘం మండల కమిటీ సమావేశాము సంఘం మండల అధ్యక్షులు ఎర్ర రవీందర్ అధ్యక్షతన జరిగింది. యిట్టి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జయరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందుకు తమ ఎన్నికల మేనిఫెస్టోలో గౌడ గీత కార్మికులకు వైన్స్ షాపులలో 25 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మాట ఇచ్చారని, ఇప్పుడు ప్రకటించిన ఎక్సైజ్ పాలసీలో 15% మాత్రమే ఉన్నదని ఇది ప్రభుత్వం మాట తప్పడమేనని ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఎక్సైజ్ పాలసీ ని సవరించి గౌడగీత కార్మికులకు వైన్స్ షాపులలో 25 శాతం కేటాయించి ధరావత్ 3 లక్షల రూపాయలు కట్టడం లేకుండా షాపులను మండల యూనిట్ గా కల్లు గీత సొసైటీలకు లాటరీ పద్ధతిలో కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని, దానివల్ల పేద గీత కార్మికులకు వారి కుటుంబాలకు ఉపయోగం జరుగుతుందని, అన్నారు. కానీ గౌడులకు కేటాయించిన వైన్సులో ధరావత్ 3 లక్షలు రూపాయలు పెట్టడం వల్ల గౌడ ధనిక కుటుంబాలకు మాత్రమే లాభం జరుగుతుందని పేద గౌడ గీత కార్మికులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, ప్రభుత్వం అనుకున్నా లక్ష్యం కూడా నెరవేరదని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు రాగిర్ కృష్ణయ్యా మాట్లాడుతూ జిల్లాలో వృత్తిలో ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని, వృత్తి చేస్తున్న గీత కార్మికులందరికీ తక్షణమే కాటమయ్య రక్షణ కవచాలను అందించాలని. పెండింగ్ ఎక్స్ గ్రేషియా లకు నిధులు కేటాయించాలని ఉన్నతాధికాలను కోరుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు,జిల్లా ఉపాధ్యక్షులు బావండ్లపల్లి బాలరాజు, జిల్లా నాయకులు కూనూరు మల్లేశం,మండల కోశాధికారి మునుకుంట్ల లెనిన్, గంగాదేవి అంజయ్య, సూర్పి ఎల్లయ్య, పాలకూర్ల యాదయ్య,పల్సం కనకయ్య,ఆకిటి శ్రీనివాస్, పాలకూర అంజయ్య పాలకుర శీను తదితరులు పాల్గొన్నారు.

## మార్వాడి వ్యాపారుల గోబ్యాక్

**- స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేసి నిరసన**




**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 22**

ఓయూ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్తంగా (మార్వాడి వ్యాపారుల గో బ్యాక్) పిలుపు మేరకు రామన్నపేట వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను శుక్రవారం నాడు మూసివేసి బంద్ పాటించారు. ఈ సందర్భంగా మండల వర్తక వ్యాపారుల సంఘం మండల అధ్యక్షులు కన్నెకంటి వెంకటేశ్వర చారి మాట్లాడుతూ,మార్వాడీలే అన్ని రకాల వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ఎన్నో సంవత్సరాలుగా స్థానికంగా వ్యాపారాలు నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు మార్వాడీల వల్ల మా జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ముమ్మందు తమ వ్యాపారాలు కొనసాగుతాయో లేవోనన్న నమ్మకం కూడా కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి ఎంఏ వహీదు, ఉపాధ్యక్షులు వనం బిక్షపతి, చోల్లెటి పాండురంగాచారి, తమ్మిశెట్టి సందీప్, మోటి బీరప్ప, ఊట్కూరి శ్రీను, షఫీ, సోహెల్, కామిశెట్టి రాంబాబు, గంజి నరేష్, మోటి నరేష్, నజీర్ టైలర్, గంగుల వెంకట్ రెడ్డి, ఎండి వహీద్ తదితరులు పాల్గొన్నారు.

## రుద్రారం లోని శ్రీ గణేష్ దేవస్థాన బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన కాట శ్రీనివాస్ గౌడ్



**పటాన్ చెరు వెలుతురు ఆగస్టు 22:**

పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామంలోని శ్రీ గణేష్ దేవస్థానంలో 27-08-2025 నుండి 06-09-2025 వరకు జరగబోయే వినాయక చవితి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేపట్టింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ని మహోత్సవానికి ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం కాట శ్రీనివాస్ గౌడ్ ఆలయ కమిటీతో కలిసి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “భక్తిశ్రద్ధలతో జరగబోయే వినాయక బ్రహ్మోత్సవాలు గ్రామానికి శ్రేయస్సు, సుభిక్షం తీసుకురావాలని కోరుకుంటున్నాను” అన్నారు.

## బిజెపి వర్తకసంఘం ఆధ్వర్యంలో నూతన ప్రెస్ క్లబ్ కు సన్మానం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 22**

నూతనంగా ఎన్నికైన రామన్నపేట ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని బిజెపి మండల నాయకులు, వర్తక వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో శు క్రవారం నాడు సంఘంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎటెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అప్పం చెన్నకేశ్వర్, ఉపాధ్యక్షులు నోముల శంకర్, కోశాధికారి శివరాత్రి రమేష్ లను వారు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తారని, సమస్యల పరిష్కరించడంలో పత్రికలు ప్రధాన భూమిక పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్, బిజెపి జిల్లా నాయకులు, వర్తక సంగం అధ్యక్షులు కన్నెకంటి వెంకటేశ్వర చారి, వర్తక సంఘం కార్యదర్శి ఎం.డి వహీద్,నాయకులు కట్కూరి బిక్షం, కూనూరు సుధాకర్, సింధ%శీ% లింగయ్య, నకిరేకంటి సుదర్శన్, వహీద్, గురుకు శివ తదితరులు పాల్గొన్నారు.

## 'మూన్' సెషన్‌లు విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయి

**- కుతుబుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్**



**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 22:**
మోడల్ యునైటెడ్ నేషన్స్ (మూన్) సెషన్‌లు విద్యార్థుల విమర్శనాత్మక ఆలోచన మరియు నాయకత్వం వంటి కీలక నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని కుతుబుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్ పేర్కొన్నారు. మూన్ సెషన్‌లు ఐక్యరాజ్యసమితిని అనుకరించే విద్యా సమావేశాలలో ప్రతియొక్క విద్యార్థి పాల్గొని తమ ప్రతిభ కనబరచాలని కోరారు. హైదరాబాద్, గుండ్ల పోచంపల్లి డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్ లో శుక్రవారం డిఆర్ఎస్ 2025 మూన్ సెషన్‌లను స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ అంజనీ కుమార్ అగర్వాల్, గర్వ్ అగర్వాల్, ప్రిన్సిపాల్, ఐ. వేణుగోపాల్ లతోకలసి కె.పి. వివేకానంద గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మూన్ సెషన్‌లు విద్యార్థులకు భవిస్యత్తు లో ప్రపంచ దేశాలను పరిశోధించడానికి, ప్రపంచ సమస్యలను చర్చించడానికి మరియు అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారాలను చర్చించడానికి వీలు కల్పిస్తాయన్నారు. విద్యార్థులు ప్రజా ప్రసంగం, పరిశోధన, రచన మరియు దౌత్యంతో కూడిన నిర్మాణాత్మక ఎజెండాను అనుసరించాలని అన్నారు. మూడు రోజుల మూన్ సెషన్‌లలో ప్రెస్ కార్ప్స్, ఇండియన్ ప్రీమియర్ లీగ్, ఎఫ్ఐఎ, యు.ఎన్.హెచ్.ఆర్.సి, డిఐఎస్ఈసి, యుఎన్ఈపి, డబ్ల్యూఈఎఫ్, ఏ.ఐ.పి.పి.ఏం, నిరంతర సంక్షోభ కమిటీ లతోపాటు ప్రత్యేకంగా నేతాజీ ఫైల్స్ సెషన్‌లను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సెషన్‌లలో విద్యార్థులు ఉత్సాహభరితమైన సంభాషణలు, అనర్గళమైన వాక్చాతుర్యం మరియు ప్రపంచ పౌరసత్వం యొక్క నీతి పట్ల అచంచలమైన నిబద్ధత ప్రదర్శించి తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూన్ అధ్యక్షురాలు ఎస్. మేరీ తనూజ, 2025 మూన్ సెషన్‌ల సెక్రటరీ జనరల్ అద్విక్ రెడ్డి మరియు వివిధ స్కూల్ ల నుండి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంజిజి 295 రకం పెసర పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారి లావణ్య



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
జహీరాబాద్ మండల డిడిగి గ్రామంలో వ్యవసాయ శాఖ ప్రదర్శన నిమిత్తం ఎంజిజి 295 పెసర పంటను మండల వ్యవసాయ అధికారి లావణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ యొక్క పెసర రకాన్ని ప్రదర్శన నిమిత్తం రైతులతో సాగు చేయించి దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో తదుపరి సీజన్లో మిగతా రైతులకు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, ప్రదర్శన క్షేత్రం యొక్క రైతు అంజయ్య పాల్గొన్నారు.

## నిర్బంధాలతో కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజా స్వామ్యానికి విరుద్ధం

**- జహీరాబాద్ పట్టణ బీజేపీ అధ్యక్షులు పూల సంతోష్....**



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి ప్రతిపక్ష పార్టీల నాయకులను అణచివేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చూడటం నిర్బంధాలతో కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజా స్వామ్యానికి విరుద్ధమని జహీరాబాద్ పట్టణ బీజేపీ అధ్యక్షులు పూల సంతోష్ పేర్కొన్నారు. చలో సెక్రటేరియట్ ముట్టడికి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నుండి బయలుదేరుతున్న బీజేపీ ముఖ్య నాయకులను జహీరాబాద్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పి ఎస్ కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని పూల సంతోష్ ఆరోపించారు. ఈ రోజు పోలీసులు అరెస్టు చేసిన వారిలో బిజెపి రాష్ట్ర నాయకులు సుధీర్ బండారి, సోమ అనిల్, బొగ్గుల సంతోష్ తదితరులు ఉన్నారు.



శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలోని నిర్మల పాలీ క్లినిక్ లో డాక్టర్ తోట నరసింహాచారి గారిని మర్యాద పూర్వకంగా కలిసి ఆత్మీయంగా శాలువాతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త నిమ్మల అంజయ్య గౌడ్ సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాసం ఆత్మీయ సోదరుడు ఎడవల్లి సురేష్ కుమార్

**మునుగోడు వెలుతురు ఆగస్టు 22:**

## కల్లుగీత పై ప్రభుత్వ వివక్ష, అమరవీరుల స్థూపం వద్ద గౌడ సంఘాల నిరసన, నివాళులు

**- మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘాలు.**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
కల్లుగీత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రేవంత్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాము..
శుక్రవారం రోజున గౌడ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్,గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, అయిలి వెంకన్న గౌడ్ రాష్ట్ర అధ్యక్షులు గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం,సహా పలువురు గౌడ సంఘాల నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత వృత్తిదారుల సంక్షేమం కోసం అనేక డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు,కల్తీకల్లు పేరుతో అక్రమ కేసులు బనాయించి హైదరాబాదులో మూసివేసిన కల్లు దుకాణాలు తక్షణమే తెరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా పాలు,పెరుగు,అల్లం,కారం అనేక వస్తువులు కల్తీ భయం అయినాయని యూరియాతో కల్తీపాలను తయారు చేస్తున్నా వారిని తక్షణం అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.. ఈనెల 14న మద్యం పాలసీ 93 జీవోను విడుదల చేసింది. తక్షణమే



జీవోను సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ జీవోను 14న విడుదల చేయకుండా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిలో సిఎం కు నిరసన సెగ తగలకుండా 20న విడుదల చేశారు.

1. కల్లగీత సొసైటీలకు వైన్స్, బార్ల కేటాయింపులో 25 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి.
2. మూతపడిన కల్లు దుకాణాలను వెంటనే తెరవాలి.
3. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును పెట్టాలి.
4. తాటి చెట్లపైనుండి పడి మరణించిన, శాశ్వత వికలాంగలకు కల్లుగీత వృత్తిదారుల పెండింగులో రూ.13 కోట్ల ఎక్స్-గ్రేషియాను తక్షణమే చెల్లించాలి.రూ 10 లక్షలు ఇవ్వాలి.
5. ప్రతి గ్రామంలో 5 ఎకరాల భూమిని కేటాయించి తాటి, ఈత వనాలను పెంచాలి.

ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, బీసీ సంఘాల నాయకులు ఎస్. దుర్గయ్య గౌడ్, బైరు శేఖర్, జీబిఎన్ చీకటి ప్రభాకర్ గౌడ్, బత్తిని కీర్తిలతా గౌడ్, సింగం నాగేశ్వర్ గౌడ్, రెస్టారెంట్ అండ్ బార్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ గౌడ్, గడ్డమీది విజయ్ కుమార్ గౌడ్, ముత్యం ముఖేష్ గౌడ్, గజ్జె శ్రీనివాస్ గౌడ్, బబ్బూరి భిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నిరసన అనంతరం, శ్రీనివాస్ గౌడ్, ఇతర నాయకులు అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

## - పి.రాములు నేత

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని తెలంగాణ ఉద్యమ కారుడు, జహీరాబాద్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పి.రాములు నేత అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాగో తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు, యావత్తు తెలంగాణ సమాజం రోడ్లపైకి రాకముందు కల్తీ, నకిలీ వ్యాపారాలను, పరిశ్రమల కాలుష్యాన్ని, కార్మికులపై జరుగుతున్న మోసాలను ప్రభుత్వాలు అధికార యంత్రాంగం తో పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఉత్తర భారతదేశం నుండి వచ్చిన వర్తకులు, పరిశ్రమల పెట్టుబడిదారులు తెలంగాణ ప్రాంతంలో నాణ్యతలేని తినుబండరాలను, నకిలీ వస్తువులను విక్రయిస్తూ తెలంగాణ ప్రజలను పూర్తిగా మోసానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. వీరి బారిన పడి అనేక మంది ప్రజలు తమ



ఆరోగ్యాలే కాకుండా ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఈ ప్రాంతంలో పెట్టుబడిదారులుగా వచ్చిన పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు నెలకొల్పి కార్మిక చట్టాలను పూర్తిగా తుంగలో తొక్కి తెలంగాణ ప్రాంతంలోని నవయువ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకొని వారికి సరిపడా వేతనాలు ఇవ్వకుండా, సరైన సౌకర్యాలు కల్పించకుండా వారి ఆరోగ్యాలను, సమయాన్ని, ఆర్థిక పరిస్థితులను నిలువున దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్మ గారాల యజమాన్యాలు మన గడ్డమీద టికానపెట్టి మన ప్రాంతంను కాలుష్యంతో నింపి వేస్తున్నారన్నారు. వీరి బారిన పడి ప్రజలు అనేక సందర్భాల్లో అనారోగ్యం పాలవుతున్నారని ఈ విషయాలపై జాగో తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు పి.రాములు నేత తేదీ 22 -8 -2025 నాడు జహీరాబాద్ బందుకు పిలుపునివ్వగా జహీరాబాద్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి జహీరాబాద్ పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లారు బందు పిలుపును అడ్డుకున్నారు. కార్యక్రమంలో జాగో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ ఇమ్రాన్, మాదినం శివప్రసాద్, ప్యార్ల దశరథ్, జహీరాబాద్ కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు సంతోష్ లను ముందస్తుగా అరెస్టు చేసి సొంత పూచికతపై వదిలిపెట్టారు

## 19 బిల్లులకు ఆమోదం తెలిపిన పార్లమెంట్ బీసీ బిల్లు విషయంలో మొండి చేయి చూపింది

**- పార్లమెంటరీ పార్టీ నేత రాహుల్ గాంధీ ఏ ఒక్క రోజు కూడా బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడలేదు.**

**- బీసీ నేత జాజుల లింగంగౌడ్ ఆగ్రహం**



హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:
నెల రోజుల పాటు జరిగిన (జూలై 21 నుండి ఆగస్టు 21 వరకు) జరిగిన వర్షాకాల పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై పార్లమెంట్ కనీసం చర్చ జరగకపోవడం అత్యంత బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడగాల్సిన ఇండియా కూటమి అడగకుండా బీసీలకు అన్యాయం చేస్తే,బాధ్యతతో స్పందించాల్సిన ఎన్డీఏ కూటమి స్పందించకుండా బీసీలకు అన్యాయం చేశారని వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు బీసీలకు తీవ్ర నిరాశకు గురి చేశాయని అన్నారు.ఎలాంటి చర్చ లేకుండా 19 బిల్లులు ఆమోదించిన పార్లమెంట్ బీసీ రిజర్వేషన్ల బిల్లు విషయంలో మొండి చేయి చూపడం బాధాకరమని అన్నారు. తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్ బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్చార్జి గోదా రవీందర్ పాల్గొన్నారు

## విచారణ పేరుతో కాలయాపన చేయడం సరైనది కాదు

**- బిఆర్ఎస్ పార్టీ నాయకులు నామరవికిరణ్, బండి మోహన్...**



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని హెూతి కె లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లకు సంబంధించిగతంలో పట్టాలు అందజేసి విచారణ పేరుతో 132 లబ్ధిదారులకు



తాళాలు అందజేయకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ నాయకులు నామరవికిరణ్, బండి మోహన్ ఆరోపించారు. ఆగస్టు 14 నాడు ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ జరిగిన సభలో స్థానిక శాసనసభ్యులు మాణిక్ రావు విజ్ఞప్తి మేరకు స్థానిక పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్, రెవెన్యూ అధికారులు వారం రోజులలో తాళాలు ఇస్తామని గతంలో మాట ఇవ్వడం జరిగింది. వారు చెప్పి వారం రోజుల సమయం నిన్నటితో పూర్తయింది. ఇట్టి విషయమై ఈరోజు లబ్ధిదారులతో కలిసి స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ వద్ద లబ్ధిదారులకు తాళాలు వెంటనే ఇవ్వాలని ఆందోళన చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు నామ రవి కిరణ్ మాట్లాడుతూ లబ్ధిదారులకు వెంటనే తాళాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, విచారణ పేరుతో కాలయాపన చేయడం సరైనది కాదు అన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వ హయాంలో దివ్యాంగులకు డబుల్ బెడ్ రూమ్ పట్టాలు అందజేస్తే, కనీసం వారిపై కనికరం లేకుండా తాళాలు అందించకుండా వారికి ఇబ్బందులను గురి చేయడం సరైన పద్ధతి కాదు అన్నారు. ఇట్టి విషయమై డిప్యూటీ తాసిల్దార్ ఇంకొక వారం రోజులు తప్పనిసరిగా లబ్ధిదారులకు తాళాలు అందజేస్తామని చెప్పారు. వారం రోజుల్లో తాళాలు ఇవ్వని యెడల లబ్ధిదారులు నేరుగా వారికి గతంలో కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు స్వాధీనం చేసుకుంటారని హెచ్చరించడం జరిగింది. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు శివప్ప, నాయకులు గణేష్, చంద్రయ్య విద్యార్థి విభాగం నాయకుడు రాకేష్ ,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని జహీరాబాద్ ప్రభుత్వ డాక్టర్లు



**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పరిధిలోని ఏరియా ఆసుపత్రిలో డాక్టర్స్ కరువయ్యారు. నిత్యం జహీరాబాద్ నియోజకవర్గం నుండి కొని వందల మంది రోగులు వైద్యనిమిత్తం వస్తుంటారు. ఉదయం 9గంటలకు వచ్చి మధ్యాహ్నం 2 గంటలకు వరకు అందుబాటులో ఉండవలసిన వైద్యులు 12గంటల లోపే విధులు ముగించుకొని కొని వెళ్లిపోతున్నారు. చిన్న పిల్లల వైద్యులు ముందు వారి ప్రయివేట్ ఆసుపత్రిలో రోగులను చూసి తీరికగా ప్రభుత్వ ఆసుపత్రికి 10:30 నుండి 11:00 గంటలకు వస్తున్నారు. వచ్చి రోగులను పరీక్షించకుండా సూపరిండెంట్ ఛాంబర్లో కూర్చొని కాలయాపన చేసి వెళ్లిపోతున్నారు. రోగులు ఉదయం నుండి వైద్యుల గురించి ఎదురు చూసి చూసి ఇంటిదారి పడుతున్నారు. చికిత్స నిమిత్తం రోగులు ఆసుపత్రి ఆవరణలో ఉన్నా కూడా వైద్యులు చికిత్స చేయకుండా వెళ్లి పోతున్నారు. ఈ విషయం పై సూపరిండెంట్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు, రోగులు పలు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి పై దృష్టి సారించి రోగుల పక్షాన నిలబడి రోగులకు నిరంతరం సేవలు అందించేలా చేయాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

### మద్యం కేసులో మాజీమంత్రి నారాయణ స్వామి విచారణ

**చిత్తూరు,ఆగస్ట్22( వెలుతురు):**
ఏపీ మద్యం కేసులో మాజీ మంత్రి, వైకాపా నేత కె.నారాయణ స్వామిని పుత్తూరులోని ఆయన నివాసంలో సిట్ అధికారులు 6గంటల పాటు- ప్రశ్నించారు. వైకాపా హయాంలో మద్యం పాలసీలో మార్పులు, మద్యం ఆర్డర్స్‌లో ఆన్‌లైన్ విధానం తీసేసి మాన్యువల్ తేవడంపైనా ప్రధానంగా విచారించినట్టు- సమాచారం. సిట్ విచారణ అనంతరం నారాయణ స్వామి మీడియాతో మాట్లాడారు. సిట్ అధికారులు నాలుగు ప్రశ్నలు అడిగారు. వారు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇచ్చాను. సిట్ అధికారులు ఎప్పుడు పిలిచినా విచారణకు సహకరిస్తానని తెలిపాను. మరోసారి విచారణకు రావాలని అధికారులు నోటీసు ఇచ్చారని తెలిపారు. వైకాపా హయాంలో కె.నారాయణస్వామి ఎ-కై-÷-సజ్‌శాఖ మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే.

## సేవ్ హైదరాబాద్ ఛలో సెక్రటేరియట్ ముట్టడి

**- జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ముందస్తు అరెస్ట్**




**నర్సాపూర్ వెలుతురు ఆగస్టు 22:**
శుక్రవారం రోజున బీజేపీ ఆధ్వర్యంలో ఛలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టగా తెల్లవారు జామున మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మరియు పట్టణ అధ్యక్షులు చంద్రయ్య ని ప్రధాన కార్యదర్శి సంఘసాని రాజు ముందస్తుగా పోలీసులు అధికారులు అక్రమంగా అరెస్ట్ చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

## అనారోగ్యంతో మరణించిన ఎఎస్ఐ కుటుంబ సభ్యులకు భద్రత చెక్ అందజేత

**- పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తాం**

**- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ ఐపిఎస్.**



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 22**
రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ రామకృష్ణపూర్ పోలీస్ స్టేషన్ లో ఎఎస్ఐ గా విధులు నిర్వహిస్తూ ఎం. వెంకట్ రెడ్డి, ఎఎస్ఐ-70 అనారోగ్యంతో మరణించగా ఆయన భార్య శ్రీలత కి భద్రత ఎక్స్గ్రేషియా 8,00,000/- రూపాయల చెక్ ను ఈ రోజు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ తన కార్యాలయం లో వారికి చెక్ ను అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మరణించి ఎ ఎస్ ఐ కుటుంబ ప్రస్తుత స్థితిగతులను సీపీ అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ పరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసే విధంగా చూస్తామని తెలియజేశారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం తో పాటు వారి కుటుంబాలకి అండగా ఉంటామని సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఓ శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లాకుంట పోచలింగం పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా అభివృద్ధికి 1200కోట్లు విడుదల

**- మంత్రి సీతక్క చొరవతో నిధులు మంజూరు**

**వరంగల్,ఆగస్ట్22( వెలుతురు):**
ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి పనుల కోసం తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు నిధులు విడుదల అయ్యాయి. మంత్రి సీతక్క చొరవతో పంచాయతీరాజ్ శాఖకు రూ.1200 కోట్లు- నిధులు విడుదలయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ఇంటిగ్రేటెడ్ భవనాలు, అదేవిధంగా ఎంపీపీ భవనాలకు నిధులు మంజూరయ్యాయి.మరోవైపు.. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం, కొత్తగూడ మండలాల్లో మంత్రి సీతక్క పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పథకాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఉద్ఘాటించారు మంత్రి సీతక్క.పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని స్పష్టం చేశారు. గృహజ్యోతి పథకం కింద రూ.500లకే సబ్సిడీ గ్యాస్ పంపిణీ చేస్తున్నామని వివరించారు. ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని మంత్రి సీతక్క కోరారు.

## చిమ్మ చీకట్లో విశ్వనగరం

**- కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు**

**హైదరాబాద్,ఆగస్ట్22( వెలుతురు):**



విద్యుత్ సరఫరా గురించి గొప్పలు చెబుతున్న ప్రభుత్వం వీధి లైట్లు వెలగని నగరం దేశంలో ఏదైనా ఉందంటే అది హైదరాబాదేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చీకటి పడితే వీధిలైట్లు- వెలగక దయనీయమైన పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కడ ఉందో అక్కడే వెలుగులా అని విమర్శించారు. ప్రభుత్వం రియల్ హైదరాబాద్ వదిలేసి.. రియల్ ఎస్టేట్ హైదరాబాద్ చుట్టూ తిరుగుతోందని ధ్వజమెత్తారు. నాడు కేసీఆర్ విశ్వనగరం అన్నారు.. రేవంత్‌రెడ్డి అంతకన్నా మహా విశ్వనగరం అంటున్నారని ఎద్దేవా చేశారు. చిమ్మ చీకట్లు- అలముకోవడం మహానగరమా? అని ప్రశ్నించారు. మౌలిక వసతుల్లేక నగర ప్రజలు అల్లాడుతున్నారని, ఎక్కడ చూసినా డ్రైనేజీ ఓవర్ ఎ÷-లో అవుతోందన్నారు. హౌస్ అరెస్టులు చేసేంత భయం ప్రభుత్వానికి ఎందుకని ప్రశ్నించారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని, పార్టీ నేతలను అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. అరెస్ట్‌లకు భయపడేది లేదని, అన్నింటికీ సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. బేషరతుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులు త్వరగా నిర్మించుకుంటే సకాలంలో బిల్లులు మంజూరు

**- పనుల జాతరలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన న్యాల్కల్ మండల ఎంపిపి సౌమ్యరావు...**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
ఇందిరమ్మ ఇళ్ళు మంజూరైన లబ్ధిదారులు అధికారుల





సూచన మేరకు త్వరగా నిర్మించుకుంటే సకాలంలో బిల్లులు మంజూరు అవుతాయని మండల ఎంపిపి సౌమ్యరావు తెలిపారు. శుక్రవారం నాడు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధి న్యాల్కల్ మండలంలోని అత్నూర్ గ్రామంలో పనుల పండుగ కార్యక్రమన్ని పురస్కరించుకుని మండల ఎంపిపి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించి నేరుగా లబ్దిదారులతో మాట్లాడి నిర్మాణం పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి సౌమ్యరావు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను నిర్మాణం మొదలుపెట్టి సకాలంలో నిర్మాణాలు పూర్తి చేస్తే బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు. నిర్మాణం మొదలుపెట్టని లబ్ధిదారులు త్వరగా మొదలుపెట్టాలని సూచించారు. లేనియెడల ఇళ్ల మంజూరు రద్దవుతుందని తెలిపారు. నిర్మాణాలు మొదలుపెట్టిన లబ్ధిదారులు పనులను వేగవంతం చేయాలని సూచించారు. అంచెలంచెలుగా నిర్మిస్తున్న వారికి బిల్లులు మంజూరు అవుతున్నాయని, వారికి ఉన్న కష్టాలను తమ దృష్టికి తేవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ రఫియోద్దీన్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా షోయబుల్లాఖాన్ వర్ధంతి వేడుకలు

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 22:**
బిజెపి మైనారిటీ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కరీంనగర్ పార్లమెంటు కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ ముందుగా షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షోయబుల్లాఖాన్ భాగ్య ప్రపంచానికి అంతగా తెలియని త్యాగధనుడని , ఆయన చరిత్రను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. షోయబుల్లా ఖాన్ ఒక తెలుగు పాత్రికేయుడని , తెలంగాణ విమోచన ఉద్యమంలో నిజాం పాలన, రజాకర్ల దురాగతాలను ఎదిరిస్తూ వార్తలు సంపాదకీయాలు రాసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన అక్షర యోధుడని కొనియాడారు. ఆనాటి నిజాం ప్రభుత్వం ఆయన రచనలను నిషేధించినప్పటికీ , ఆయన మానవతా వాదిగా నిజాం నిరంకుషత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. ముఖ్యంగా ఆయన రచనలను ఆయుధాలుగా మార్చుకొని ప్రభుత్వ దురాగతలను ఎండగట్టారని ,



హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి జరిగిన ఉద్యమంలో షోయబుల్లాఖాన్ కీలక పాత్ర పోషించారని తెలిపారు.

షోయబుల్లా ఖాన్ తెలంగాణ చరిత్రపుటల్లో ఒక మహోన్నత వ్యక్తిగా నిలిచిపోయారని , ఆయన ప్రజల మేలు కోసం చేసిన ఉద్యమాలు, కృషి త్యాగాలు మర్చిపోలేనివన్నారు. షోయబుల్లాఖాన్ మత దురహంకారానికి వ్యతిరేకి అని తెలిపారు. అందుకే ఆయన ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. షోయబుల్లా ఖాన్ స్ఫూర్తి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు ముందు కొనసాగాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సమీపరవేజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బషీరుద్దీన్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్, సమీయుల్లా అహ్మద్, షహజాద్, సాబీర్, ఫసి, ఫయాజ్ చిస్తి, ఆఫ్ నాన్, సైద్, ఫహాద్ తదితరులు పాల్గొన్నారు

## హుజురాబాద్‌లో బీఆర్ఎస్ జోష్, కాంగ్రెస్‌కు భారీ షాక్!

**కేటీఆర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సమక్షంలో భారీ చేరికలు**

**కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి గులాబీ కండువాలు కప్పుకున్న మాజీ సర్పంచులు, కీలక నేతలు**

**ప్రజలు తిరిగి కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు: చేరిన నాయకులు**






**హుజురాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
హుజురాబాద్ నియోజకవర్గంలో రాజకీయాలు రోజురోజుకు వేడెక్కుతున్నాయి. నిన్న బిజెపి నుంచి ఈటెల ముఖ్య అనుచరులు పార్టీని వీడి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కండువా కప్పుకోగా, ఇప్పుడు ఒక్కరోజు వ్యవధిలోనే అటు కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా పలువురు మాజీ సర్పంచులు, కీలక నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ చేరికలు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి కొత్త ఊపునిచ్చాయి.
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలం కావడం, ప్రజల్లో ఆ పార్టీపై పూర్తిస్థాయిలో వ్యతిరేకత రావడం వంటి కారణాలతో జమ్మికుంట మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు, కీలక నేతలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ చేరికలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో జరిగాయి.
బీఆర్ఎస్‌లో చేరిన వారిలో తనుగుల మాజీ సర్పంచ్ రామస్వామి, శంభునిపల్లి మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, పాపక్కపల్లి మాజీ సర్పంచ్ మహేందర్, శాయంపేట మాజీ సర్పంచ్ భద్రయ్య, నాగంపేట మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి, రాచపల్లి సదానందం, జైద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే..

ఈ సందర్భంగా గులాబీ కండువాలు కప్పుకున్న నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగితే తమకు రాజకీయ భవిష్యత్తుతో పాటు కనీస గౌరవం కూడా ఉండదని గ్రహించి, తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీలో చేరామని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరేలా ప్రభుత్వంతో పోరాడుతున్నారని, ఇక నుంచి తాము కూడా ఆయన బాటలోనే నడుస్తామని హామీ ఇచ్చారు.

### కాంగ్రెస్ పాలన రాక్షస పాలన..

అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత పాలనతో విసిగిపోయారని అన్నారు. ముఖ్యంగా రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో 'రామరాజ్యం' నడిచిందని, కానీ ఇప్పుడు 'రాక్షస పాలన' నడుస్తోందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ సస్యశ్యామలమై, దేశంలోనే అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలంతా తిరిగి కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని, భవిష్యత్తులో తప్పక కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీ వైపే చూస్తున్నారని, ఇకనుంచి రాబోయే అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కెళ్లపల్లి రాజేశ్వర్ రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామ్యం

**- జహీరాబాద్ మండల అధ్యక్షులు ఎంజి దుర్గయ్య...**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
రాష్ట్రంలో గ్రామ పంచాయతీలలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ముఖ్యంగా ధ్వంసమైన చెరువులు ఆనకట్టలు, రోడ్లు, యూరియా కొరత వంటి సమస్యల గురించి నిరసన ప్రదర్శనలు చేయడానికి ప్రయత్నించిన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని బిజెపి నాయకులకు రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని జహీరాబాద్ బిజెపి మండల అధ్యక్షులు ఎంజి దుర్గయ్య అన్నారు. వారు మాట్లాడుతూ... ప్రభుత్వానికి రాష్ట్రంలో యున్న సమస్యలను పరిష్కరించమని కోరుతూ సెక్రెటరీ చేయాలని బిజెపి రాష్ట్ర పార్టీ నిర్ణయించిందని, ఈ నిరసనలో భాగంగా పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని



ప్రణాళికలు రూపొందించారు. నిరసన ప్రదర్శన వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తి కుండా ఉండడానికి పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా జహీరాబాద్ బిజెపి మండల అధ్యక్షులు ఎంజి దుర్గయ్య ,జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎం విశ్వనాథ్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు చాకలి. మోహన్, ఉపాధ్యక్షులు చల్లాప్రభాకర్ రెడ్డి, దిడిగి భాయ్, లక్ష్మారెడ్డి లను జహీరాబాద్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు.

## సిపిఐ కార్యదర్శిగా కూనంనేని

**- వరుసగా రెండోసారి ఎన్నిక**



**హైదరాబాద్,ఆగస్ట్22( వెలుతురు):**

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మరోసారి ఎన్నికయ్యారు. గాజులరామారంలో జరిగిన సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల్లో ఆయన పేరును పార్టీ సీనియర్ నేత పల్లా వెంకట్‌రెడ్డి ప్రతిపాదించగా.. మరో నేత శంకర్ బలపరిచారు. కూనంనేని వరుసగా రెండోసారి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మూడేళ్లపాటు– ఆయన పదవిలో కొనసాగనున్నారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన సాంబశివరావు పార్టీలో సాధారణ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించారు. విశాలాంధ్ర పత్రికలో జర్నలిస్టుగానూ పనిచేశారు. 1984లో కొత్తగూడెం పట్టణ సీపీఐ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1987లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన కొత్తగూడెం మండల పరిషత్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మండలాధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. 2005లో ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1999, 2004 ఎన్నికల్లో సుజాతనగర్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ– చేసి ఓటమిపాలయ్యారు. 2009లో కొత్తగూడెం నుంచి పోటీ– చేసి.. అప్పటి మంత్రి వనమా వెంకటేశ్వరరావును ఓడించి శాసనసభలో అడుగుపెట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను గుర్తించి ఖమ్మం జిల్లాలో 450 కి.మీ. పాదయాత్ర నిర్వహించారు. 2023 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా ఆయన విజయం సాధించారు.

## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద



**నిజామాబాద్,ఆగస్ట్22( వెలుతురు):**

జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో 16 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తి నీటి నిల్వ సామర్థం 80.5 టీ–ఎంసీలు కాగా.. ప్రస్తుతం 79.65 టీ–ఎంసీలుగా నమోదైంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 80 వేల క్యూసెక్కులు, ఔట్‌ఎ÷–లో 78,812 క్యూసెక్కులుగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 16 గేట్ల ద్వారా 49,280 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 6,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,500 క్యూసెక్కులు, ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.8 అడుగులకు చేరుకుంది.

## కావేరీ-గోదావరిల అనుసంధానం

**- బనకచర్లపై చర్చ రాలేదన్న రాహుల్ బొజ్జా**



**హైదరాబాద్,ఆగస్ట్22( వెలుతురు):**

గోదావరి– కావేరి నదుల అనుసంధానంపై ఎన్‌డబ్ల్యూడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సంప్రదింపుల భేటీ– ముగిసింది. మరోమారు సమావేశం నిర్వహిస్తామని సీడబ్ల్యూసీ ఛైర్మన్ అతుల్ జైన్ వెల్లడించారు. నదుల అనుసంధానంపై రాష్ట్ర అభిప్రాయాలు వివరించినట్లు– తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా పేర్కొన్నారు. తెలంగాణ నుంచి వెళ్తున్న నీటిలో సగం అంటే.. 74 టీఎంసీలు కోరినట్లు– తెలిపారు. ఏపీ నాలుగు ఇంట్రా లింక్‌లను ప్రతిపాదించింది. తెలంగాణ సమ్మతి లేకుండా ఇంట్రా లింకులు ఆమోదించవద్దని కోరాం. బనకచర్ల లింక్ అంశం అంతగా చర్చకు రాలేదు. ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర అభిప్రాయాలను గతంలోనే చెప్పామని రాహుల్ బొజ్జా వివరించారు.

## ఎన్డీఎలో ఉంటూ ఇతరులకు ఎలా మద్దతు ఇస్తాం

**- రాధాకృష్ణన్ ను కలిసి అభినందించిన చంద్రబాబు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్22( వెలుతురు):**

దేశం గౌరవించదగిన వ్యక్తి ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దిల్లీలో శుక్రవారం సీఎం ఆయన్ను కలిసి అభినందించారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేశాయి. ఆయనకు మా మద్దతు ఉంటుందని చెబుతూ అభినందనలు తెలిపాను. దేశానికి, ఉపరాష్ట్రపతి పదవికి



సీపీ రాధాకృష్ణన్ గౌరవం తీసుకొస్తారు. ఎన్నికల ముందు నుంచి ఎన్డీయేలో తెదేపా ఉంది. ఆ అభ్యర్థికే మా మద్దతు ఉంటుంది. తెలుగువాడు అన్నప్పుడు గెలిచే అవకాశం ఉంటేనే అభ్యర్థిని పెట్టాలి. గెలిచే అవకాశం లేకపోయినా అభ్యర్థిని పెట్టి ఇండియా కూటమి రాజకీయం చేస్తోంది. ఎన్డీయేలో ఉన్నప్పుడు ప్రతిపక్ష అభ్యర్థికి ఎలా మద్దతు ఇస్తాం?అని చంద్రబాబు అన్నారు. కూటమికి కట్టుబడి వెళతామని అన్నారు. ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్‌ను గెలిపిస్తామని అన్నారు. చంద్రబాబు వెంట తెలుగు పార్టీకి చెందిన మంత్రులు, ఎంపిలు ఉన్నారు.

# ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం

**- జిల్లాలో మంత్రి వివేక్ పర్యటన**

**- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 22**

రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి జిల్లాలోని కోటపల్లి మండలం దేవులవాడ గ్రామంలో సి. సి. రోడ్డు, సెంట్రల్ లైటింగ్ సిస్టం, భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించి కొల్లూరు గ్రామంలో పనుల జాతరలో భాగంగా అంగన్వాడీ కేంద్రానికి భూమి పూజ చేశారు. సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కరకట్టలు నుంచి వరదలను నియంత్రించి, బ్యాక్ వాటర్ రాకుండా చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే దెబ్బతిన్న పంట పొలాలను గుర్తించి సర్వే చేయాలని, ఒక ఎంక్వయిరీ కమిషన్ ఏర్పాటు చేసి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామపంచాయతీల పరిధిలో 20 లక్షల రూపాయల వ్యయంతో పంచాయితీ కార్యాలయాలు, 12 లక్షల రూపాయల వ్యయంతో అంగన్వాడీ కేంద్రాలు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ మండలం సుందరశాల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2 కోట్ల రూపాయలు మంజూరు చేసి డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయుల నియామకం జరిగిందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఆర్. ఓ. ప్లాంట్ల ద్వారా శుద్ధమైన త్రాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్నారని, ఉపాధ్యాయులు పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. లంబడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు 8 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించడం జరిగిందని, 20 లక్షల రూపాయల నిధులతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో సోలార్ హైమాస్ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ప్రతి ఇంటికి త్రాగు నీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకం ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం కార్యచరణ ప్రకారం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో పనుల జాతరలో భాగంగా 50 కోట్ల రూపాయలతో అన్ని గ్రామాలను కలుపుతూ సి.సి. రోడ్లు, మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ఉపాధి హామీ పథకం క్రింద అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి నిర్మాణ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో భాగంగా జిల్లాలో 25 శాతం పనులు పూర్తి అయ్యాయని, లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించుకోవాలని, నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల మంజూరు వేగంగా జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు రాని అర్హత కలిగిన లబ్ధిదారులు ఆందోళన పడవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గృహ జ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించడం జరుగుతుందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా నిరుపేదలకు అందించే వైద్య సేవలను 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచడం పెంచడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం అందించడం జరిగిందని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. దాదాపు 10 సంవత్సరాల పాటు రేషన్ కార్డు లేకుండా ఎంతో మంది నిరుపేదలు ఇబ్బందులు పడ్డారని, ప్రభుత్వం జిల్లాలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులు జారీ చేసి వారి సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా రైతు భరోసా ద్వారా వానాకాలం పంట పెట్టుబడి సహాయాన్ని ముందుగానే రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం జైపూర్ మండల కేంద్రంలో 3 లక్షల రూపాయల నిధులతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేసి, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవరణలో మొక్కలు నాటారు. భీమారం మండల కేంద్రంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి 12 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మనమంతా హిందువులం, మనమంతా సోదరులం

**- విజయవంతంగా కొనసాగిన ఎస్సీ కులాల, సంచార తెగల ఆత్మీయ సమ్మేళనం....**







**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 22:**

సామాజిక సమరసత వేదిక, జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కరీంనగర్ పట్టణంలోని వైశ్య భవనంలో ఎస్సీ కులాల, సంచార తెగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. మనమంతా హిందువులం మనమంతా సోదరులం అనే నినాదంతో ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహించారు.. ఇట్టి కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక అఖిలభారత సమరసత కన్వీనర్ శ్యాం ప్రసాద్ సామాజిక సమసరసత వేదిక అఖిలభారత కళా ప్రముఖ అప్పాల ప్రసాద్ లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సి లోని 59 కులాల వాళ్ళు ఏదో ఒక సందర్భంలో కలుస్తూ ఉండటం వల్ల, సమరసతా భావం వెల్లి విరుస్తుందన్నారు. ,ఎస్ సి లు,ఇతర కులాల వారి మధ్య అంతరాలు తొలగిపోవాలని ఆశించినట్లుగానే,ఎస్ సి కులాల మధ్య అసమానతలు తొలగించేందుకు కృషి చేయాలన్నారు. కులం పేరుతో పరిహాసాలు ఆడొద్దని,ఎక్కువ తక్కువ భేదాలు చూపొద్దని,ఇంట్లో కుటుంబ సభ్యులకు కూడా ఉపయోగించే పదాల విషయంలో జాగ్రత్తలు చెప్పాలని,కష్ట సుఖాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా బెడ ,బుడగ జంగం,.మాల జంగం, మోచి,. వాల్మీకీ,. మాదిగ, మాల,. గోసంగి,. నేతకాని,. మిథుల అయ్యవార్లు, .చిందు,. పెద్దమ్మల వాళ్ళు,.మాష్టి మొదలైన కుల పెద్దలకు సన్మానం చేశారు. ఇట్టి ప్రోగ్రాంలో సమరసతా వేదిక రాష్ట్ర కార్యదర్శి పి రామారావు, ఎస్ సి రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షులు దావు సంతోష్, జిల్లా అధ్యక్షులు తుమ్మల రమేష్ రెడ్డి, ఎస్ సి పరిరక్షణ సమితి కార్యదర్శి కల్లేపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ద్వారా యువతికి అసభ్యకర మెయిల్స్ పంపి వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 22**

మందమర్రి పట్టణంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని నకిలీ ఈమెయిల్ ఐడి ద్వారా అసభ్యకర, అశ్లీల సందేశాలు పంపిస్తూ మానసికంగా వేధిస్తున్న ఒక వ్యక్తిని మందమర్రి పోలీసులు అరెస్ట్ చేశారు. మందమర్రి పట్టణానికి చెందిన ఒక యువతి, ప్రస్తుతం ఇంటి నుండి (వర్క్ ఫ్రమ్ హోమ్) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆమెకు మార్చి 2025 నుండి, గుర్తు తెలియని వ్యక్తి ఒక నకిలీ ఈమెయిల్ ఐడి సృష్టించి, ఆమె స్నేహితులను ట్యాగ్ చేస్తూ, పదేపదే అసభ్యకరమైన, అశ్లీలమైన సందేశాలు పంపుతూ తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులు రోజు రోజుకు ఎక్కువవడంతో, బాధితురాలు తేది 07.06.2025 నాడు మందమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు, మందమర్రి ఎస్సై రాజశేఖర్ ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం, మందమర్రి సిఐ శ్రీ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, నకిలీ ఈమెయిల్ ఐడి మూలాలను గుర్తించి, ఈ నేరానికి పాల్పడింది హైదరాబాద్‌కు చెందిన నెల్లి నిఖిల్ బాబు అని నిర్ధారించారు. శుక్రవారం రోజు నిందితుడిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని మందమర్రికి తరలించింది. విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిఐ శశిధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలు గతంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు నిందితుడు నిఖిల్ బాబు ఆమె సహోద్యోగి. అతను బాధితురాలిని ప్రేమిస్తున్నానని చెప్పగా, ఆమె తిరస్కరించింది. ఆ కోపంతో ఆమెపై పగ పెంచుకుని, ఆమె ప్రతిష్టకు భంగం కలిగించాలనే దురుద్దేశంతో ఈ నీచమైన చర్యకు పాల్పడ్డాడు. నిందితుడు నెల్లి నిఖిల్ బాబు ప్యారడైజ్ బ్రాంచ్, హైదరాబాద్ కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మహిళల భద్రతకు తెలంగాణ పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఆన్‌లైన్‌లో వేధించే వారిని ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని సిఐ శశిధర్ రెడ్డి హెచ్చరించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు పోలీస్ శాఖ వారి సూచనలు పాటించాలన్నారు. ఈ సంఘటన నేపథ్యంలో, సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ శాఖ ఈ క్రింది సూచనలు జారీ చేసింది: వ్యక్తిగత సమాచారం పట్ల జాగ్రత్త మీ ఈమెయిల్ ఐడి, ఫోన్ నంబర్, వ్యక్తిగత ఫోటోలు, ఇతర సున్నితమైన సమాచారాన్ని అపరిచితులతో లేదా నమ్మకం లేని వ్యక్తులతో పంచుకోవద్దు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ఖాతాలలో మీ ప్రైవసీ సెట్టింగ్‌లను 'ఫ్రెండ్స్ ఓన్లీ' లేదా 'ప్రైవేట్'గా ఉంచుకోండి. మీ ఫ్రెండ్ లిస్ట్‌ను కూడా ఇతరులకు కనబడకుండా చూసుకోండి.మీ ఆన్‌లైన్ ఖాతాలన్నింటికీ ఊహించడానికి వీలు లేని, బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించండి. అన్ని ఖాతాలకు ఒకే పాస్‌వర్డ్ వాడరాదు. వేధింపులకు స్పందించవద్దు: ఎవరైనా ఆన్‌లైన్‌లో మిమ్మల్ని వేధిస్తుంటే, వారికి తిరిగి సమాధానం ఇవ్వవద్దు. వారి సందేశాలకు స్పందించడం వల్ల వేధింపులు మరింత పెరిగే అవకాశం ఉంది. వేధింపులకు సంబంధించిన ఈమెయిల్స్, మెసేజ్‌లు, ఫోటోలు లేదా కామెంట్లను స్క్రీన్‌షాట్‌లు తీసి భద్రంగా దాచుకోండి. ఇవి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కీలకమైన సాక్ష్యాలుగా ఉపయోగపడతాయి. మిమ్మల్ని వేధిస్తున్న వ్యక్తి యొక్క ఖాతాను వెంటనే బ్లాక్ చేయండి సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌కు రిపోర్ట్ చేయండి. ఎటువంటి ఆన్‌లైన్ వేధింపులు ఎదురైనా ఏమాత్రం ఆలస్యం చేయకుండా, భయపడకుండా వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో లేదా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేసి లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. అన్నారు.

# డికెకు సిఎం పదవి దక్కేనా?

**- నివురుగప్పిన నిప్పులా అసంతృప్తి**

**- అంతుచిక్కని కాంగ్రెస్ తీరు**



**బెంగళూరు,ఆగస్ట్22( వెలుతురు):**
కర్ణాటకలో 'సీఎం మార్పు' అంశంపై పార్టీలో అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. డికె శివకుమా÷- నివురుగప్పిన నిప్పులా తన కోరికణను అణచివేసుకుని పైకి సౌమ్యుడిలా కనిపిస్తున్నారు. తను పోరాటం చేసి అధికారంలోకి తీసుకుని వస్తే సిఎం పీఠం దక్కడం లేదన్న బాధలో కుమిలిపోతున్నారు. మరోవైపు ఐదేళ్లు తనే సిఎంనని సిద్ధరామయ్య భీష్మించుకున్నారు. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రినని ఓవైపు సిద్ధరామయ్య నొక్కి చెబుతున్నా.. అటు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్.. తన చేతుల్లో ఏమీ లేదంటూనే 'ఆశ పడటంలో తప్పులేదు కదా' అనే సంకేతాలిస్తున్నారు. అయితే సీఎం మార్పునకు పార్టీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో శివకుమార్ అసంతృప్తితో ఉన్నట్లు- తెలుస్తోంది. తాను కూడా ఎప్పటికై-నా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తానని పలుమార్లు బహిరంగంగానే చెప్పిన డీకే.. తన వ్యాఖ్యల ద్వారా ఆ పీఠంపై తనకున్న ఆశను వెలిబుచ్చుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా డీకే వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ సమావేశంలో శివకుమార్ తన రాజకీయ జీవితం గురించి మాట్లాడుతూ.. ఆరెస్సెస్తో తనకున్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆరెస్సెస్ గీతమైన 'నమస్తే సదా వత్సలే'ను ఆయన పాడడంతో భాజపా నాయకులంతా చిరునవ్వులు చిందిస్తూ, బల్లలపై చప్పట్లు- చరుస్తూ.. నినాదాలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారడంతో అసెంబ్లీలో శివకుమార్ ప్రవర్తనపై నెట్టింట మరోమారు చర్చ మొదలైంది. తనకు సీఎం పీఠం ఇవ్వకపోతే భాజపాలో చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీని, సిద్ధరామయ్యను బెదిరించేందుకే ఆయన ఈవిధంగా చేసి ఉంటారని పలువురు నెటిజన్లు చర్చించు కుంటున్నారు. ఇటీవల స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ ఆరెస్సెస్ను ప్రశంసించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుపట్టిన నేపథ్యంలో శివకుమార్ పరోక్షంగా ఆయనకు పార్టీ మార్పు గురించి హెచ్చరికలు చేసి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్లు రెండున్నరేళ్ల పాటు- పదవిలో కొనసాగేలా ఓ అంగీకారానికి వచ్చారన్న వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి.

# యూరియా కొరత పేరిట చెప్పల రాజకీయం

**- కావాలనే రైతులను బజారుకీడుస్తున్నారు**

**- కేంద్రం నుంచి యూరియా సరఫరాలో కొంత ఆలస్యం**

**- మెదక్ ఎంపి రఘునందన్ రావు వెల్లడి**



**సిద్దిపేట, ఆగస్ట్22( వెలుతురు):**
ఆపరేషన్ సిందూర్ వల్ల యూరియా రావడం ఆలస్యమైందని బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు వెల్లడించారు. శుక్రవారం సిద్దిపేటలో ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కొంత మంది కావాలని యూరియా కొరత పేరిట చెప్పులను లైన్లో పెట్టించి మరీ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాను వారం రోజుల్లో తెలంగాణకు తీసుకు వస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతులకు యూరియా ఇచ్చేది బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కాదని కేంద్ర ప్రభుత్వం మాత్రమే అని ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు గుర్తు చేశారు. రైతులందరికి సరిపడే యూరియాను వారం రోజుల్లో అందిస్తామన్నారు. కొంత మంది యూరియాను కృత్రిమ కొరత సృష్టిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు ఆయన ఆదేశించారు. రాజకీయ నాయకుల తప్పుడు ఆరోపణలను నమ్మవద్దని.. అలాగే ఆందోళన చెంద వద్దంటూ రైతులకు సూచించారు. ఇక ఫ్లెక్సీల కోసం దిగజారి రాజకీయం తాము చేయమని స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు పనులు చేసే వారికి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ సైతం రాదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు జోస్యం చెప్పారు. రాష్ట్రాల మధ్య వివక్ష చూపుతున్నారంటూ ప్రధాని మోదీపై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం సమ దృష్టితో.. సమన్యాయం చేస్తుందని తెలిపారు. ఒక్కొక్క గ్రామ పంచాయతీ భవనానికి రూ. 20 లక్షలు, అంగన్వాడీ కేంద్రానికి రూ. 10 లక్షలు నిధులను కేంద్రం విడుదల చేస్తుందని చెప్పారు. సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజక వర్గాల్లో 26 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 2. 8 కోట్లు- కేటాయించారని వివరించారు. కాంగ్రెస్ నాయకులు పనుల జాతర పేరిట కొబ్బరి కాయలు కొడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. కేంద్రం ఇచ్చే నిధులను వారు ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను కోరారు. మెదక్ జిల్లాలోని 27 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 2. 10 కోటలు నిధులు మంజూరు చేశామని వివరించారు. మెదక్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో 56 అంగన్వాడీ కేంద్రాలకు రూ. 4. 6 కోట్ల నిధులు కేంద్రం విడుదల చేసిందని గుర్తు చేశారు. పనుల జాతర పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించే పనుల్లో 75 శాతం నిధులు కేంద్రం ఇచ్చిందని.. మిగిలిన 25 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.

# రామ్మోహన్ ఇంటికి చంద్రబాబు

**- కుమారుడిని ఎత్తుకుని ముద్దాడిన బాబు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్22( వెలుతురు):**
దిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడి (శపపురశ కశష) నివాసానికి వెళ్లారు. ఇటీ-వల రామ్మోహన్ దంపతులకు జన్మించిన బాబుకు సీఎం దీవెనలు అందించారు. చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి దంపతులు, కుటుంబసభ్యులతో చంద్రబాబు మాట్లాడారు. దివంగత కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకున్నారు. చంద్రాబు రాకతో రామ్మోహన్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# పార్లమెంట్ వద్ద భద్రతా వైఫల్యం

**- భద్రతా సిబ్బంద కళ్లుగప్పి గోడదూకిన ఆగంతకుడు**

**- వెంటనే అప్రమత్తం అయిన పట్టుకున్న సిబ్బంది**




**న్యూఢిల్లీ,ఆగస్ట్22( వెలుతురు):**
పార్లమెంట్లోని భద్రతా సిబ్బంది వైఫల్యం మరోసారి బహిర్గతమైంది.ఓ ఆగంతకుడు గోడ దూకి పార్లమెంట్ భవనంలోకి చొరబడ్డాడు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై.. అతడిని అదుపులోకి తీసుకుంది. శుక్రవారం ఉదయం ఒక వ్యక్తి రైలు భవనం వైపునున్న చెట్టు ఎక్కి.. కొత్త పార్లమెంట్ భవనంలోని గరుడ గేట్ వద్ద కిందకి దూకి పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించాడు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది చూసి.. అతడిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని పార్లమెంట్ భద్రతా సిబ్బంది కార్యాలయానికి తరలించి.. విచారిస్తున్నారు. పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు ముగిసిన ఒక రోజు తర్వాత ఈ సంఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఈ సమావేశాలు ఆగస్టు 21వ తేదీన ముగిసిన సంగతి తెలిసిందే. గత ఏడాది సైతం ఈ తరహా ఘటన చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. 20 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి పార్లమెంట్ గోడ దూకి అనెక్స్ భవనం ఆవరణలోకి ప్రవేశించాడు. షార్ట్స్, టీ షర్ట్ ధరించిన ఆ యువకుడిని సీఐఎస్ఎఫ్ సిబ్బంది పట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. అతడు ఉత్తరప్రదేశ్కు చెందిన మనీష్గా గుర్తించారు. అతడి వద్ద ఎటువంటి ఆయుధాలు లభ్యం కాలేదు. అయితే అతడి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని పోలీసులు తెలిపారు. ఇక రెండేళ్ల క్రితం పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్న వేళ.. లోక్సభలో పబ్లిక్ గ్యాలరీలో కూర్చొన్న ఇద్దరు యువకులు ఆ తర్వాత సభలో దూకి సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారు. లోక్సభలోని పబ్లిక్ గ్యాలరీ వద్ద కూర్చొన్న ఇద్దరు యువకులు సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. రంగుల పొగను వదిలి అందరినీ భయభ్రాంతులకు గురిచేశారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల కూడా ఇద్దరు వ్యక్తులు ఇదేరకమైన నిరసనను చేపట్టారు. ఈ ఘటన తర్వాత పార్లమెంట్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ఘటన పార్లమెంట్లోని భద్రతా వైఫల్యాన్ని బయటపెట్టింది. అనంతరం పార్లమెంట్ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. 2001, డిసెంబర్ 13వ తేదీ పార్లమెంట్పై ఉగ్రవాదులు దాడికి యత్నించారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న రోజే.. ఈ ఆగంతకులు సభలోకి ప్రవేశించి గందరగోళం సృష్టించడం గమనార్హం. గతేడాది ఆగస్టులో కూడా ఈతరహా ఉల్లంఘన చోటుచేసుకుంది. ఓ యువకుడు పార్లమెంట్ గోడ దూకి లోపలికి చొరబడేందుకు యత్నించాడు. నిందితుడిని ఉత్తరప్రదేశ్కు చెందిన మనీశ్గా పోలీసులు గుర్తించారు. అప్పుడు నిందితుడి వద్ద ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని అప్పట్లో పోలీసులు వెల్లడించారు.

# గోదావరికి తగ్గిన వరద ఉధృతి

**- భద్రాచలం వద్ద నెమ్మదించిన గోదావరి**

**- కృష్ణానదికి కొనసాగుతున్న ప్రవాహం**



**హైదరాబాద్,ఆగస్ట్22( వెలుతురు):**
ఎగువన కురిసిన భారీ వర్షాలు, వస్తున్న వరదతో ఉగ్రరూపం దాల్చిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గురువారం రాత్రి 8 గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 51.9 అడుగులు ఉండగా వరద ప్రవాహం 13.66 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. రాత్రి 11 గంటలకు నీటిమట్టం తగ్గుముఖం పట్టి 51.4 అడుగులకు చేరింది. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు 48.6 అడుగులు ఉండగా గురువారం తెల్లవారుజామున 3 గంటలకు 49.5 అడుగులకు పెరిగింది. ఉదయం 6 గంటలకు 50.3, 9 గంటలకు 50.9, మధ్యాహ్నం 12 గంటలకు 51.4, 3 గంటలకు 51.9 అడుగులకు చేరింది. 5 గంటల పాటు- అదేస్థాయిలో నిలకడగా కొనసాగింది. రాత్రి 9 గంటలకు 51.7, 10 గంటలకు 51.5, 11 గంటలకు 51.4 అడుగులకు తగ్గింది. శుక్రవారం తెల్లవారుజాముకల్లా ఈ ప్రవాహం మరింత తగ్గినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం దుమ్ముగూడెం (సీతమ్మసాగర్)కు 13.23 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీకి 8.26 లక్షలు, మేడిగడ్డకు 7.40 లక్షల క్యూసెక్కుల ఇన్ఎ÷-లో రాగా.. వచ్చింది వచ్చినట్లే దిగువకు వదిలిపెట్టారు. గోదావరి ఉధృతితో తెలంగాణ-ఏపీ సరిహద్దులోని అల్లూరి జిల్లా యటపాక మండలం రాయనిపేట వద్ద జాతీయ రహదారిపై వరద నీరు వచ్చి చేరింది. ముందు జాగ్రత్తగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భద్రాచలం-చర్ల మార్గంలో కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గోదావరి ఉగ్రరూపంతో ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 29 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రెండు మండలాల్లో లోతట్టు- ప్రాంతాలు, రహదారులపైకి వరద చేరుకోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. శబరి నది ఉధృతి కారణంగా వేలేరుపాడు మండలంలోకి వరద అంతకంతకు పెరుగుతూనే ఉంది. భద్రాచలం నుంచి దిగువకు 13.60 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండటంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని గ్రామాలను వరద చుట్టుముట్టింది. కుక్కునూరు మండలంలో 1,222 కుటుంబాలు, వేలేరుపాడు మండలంలో 2,468 కుటుంబాలు ముంపు బారిన పడ్డాయి. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా, భీమా, తుంగభద్ర నదులకు వరద పెరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 5.40 లక్షల క్యూసెక్కుల ఇన్ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు పది గేట్లు- ఎత్తి 4.20 లక్షల క్యూసెక్కులను నాగార్జున సాగర్కు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 4.32 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. 26 క్రస్ట్ గేట్ల నుంచి 3.81 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రాల్లో జోరుగా ఉత్పత్తి జరుగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి పెరుగుతూనే ఉంది. జలాశయం ఇన్ఫ్లో 5,40,756 క్యూసెక్కులు కాగా.. ఔట్ఫ్లో 5,16,493 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 29,648 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 10 స్పిల్వే గేట్ల ద్వారా 4,21,530 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్కు విడుదల అవుతోంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 882.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 199.73 టీ-ఎంసీలుగా కొనసాగుతోంది. శ్రీశైలం నుంచి భారీగా నీరు విడుదలవుతుండటంతో దిగువన ఉన్న నాగార్జునసాగర్ జలాశయానికి వరదనీరు పోటెత్తుతోంది. సాగర్కు 4.45 లక్షల క్యూసెక్కుల ఇన్ఎ÷-లో వస్తుండగా.. 26 గేట్లు- ఎత్తి..4.18 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 22 గేట్లను 10 అడుగల మేర, నాలుగు గేట్లను 13 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. స్పిల్వే ద్వారా 3.67 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. కుడి కాల్వకు 9,019 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 6,401 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 583.20 అడుగుల నీటి మట్టం ఉంది. సాగర్ పూర్తి నీటినిల్వ సామర్థం 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 292.24 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# స్మార్ట్ కార్డుతో రేషన్ పంపిణీ

**- అక్రమాలకుచెక్ పెట్టేలా చర్యలు**

**- మీడియాతో మంత్రి నాదెండ్ల మనోహర్**



**అమరావతి,ఆగస్ట్22( వెలుతురు):**
టెక్నాలజీ వినియోగంతో పారదర్శకతతో సంక్షేమం అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. సుపరిపాలనలో భాగంగా అనేక సంస్కరణలు తీసుకువచ్చామని ఉద్ఘాటించారు. ఈ నెల 25వ తేదీ నుంచి స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ ప్రారంభిస్తామని వెల్లడించారు.శుక్రవారం విజయవాడలో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు.ఈనెల 25వ తేదీన 9 జిల్లాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. వచ్చెనెల 15 తేదీ వరకు నాలుగు విడతల్లో పండుగ వాతావరణంలో స్మార్ట్ కార్డుల పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పండుగ వాతావరణంలో కార్డుల పంపిణీ ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. 1.45కోట్ల కుటు-ంబాలకు స్మార్ట్ రైస్ కార్డులను ఉచితంగా ఇంటింటికీ వెళ్లి అందజేస్తామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 6.70లక్షల కార్డుదారులకీ స్మార్ట్ కార్డులు ఇస్తామని వెల్లడించారు. క్యూఆర్ కోడ్తో సహా ... పలు సాంకేతిక అంశాలతో స్మార్ట్ కార్డులు తయారు చేశామని పేర్కొన్నారు. మండలాల వారీగా స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తైందని చెప్పుకొచ్చారు. స్మార్ట్ రైస్ కార్డుతో స్వైప్ చేసి సరుకులు పొందవచ్చని సూచించారు. సరుకుల పంపిణీ సమాచారాన్ని ఎప్పటి కప్పుడు కేంద్ర సర్వర్కు చేరవేస్తుందని వివరించారు. ప్రస్తుతం వృద్ధులు, వికలాంగులకు 16.70లక్షల మందికి సరుకులను డోర్ డెలివరీ చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. పర్యవేక్షణలో లోపం లేకుండా పకడ్బందీగా కార్డులు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ఏపీ వారు ఎక్కడినుంచైనా రేషన్ తీసుకోవచ్చని సూచించారు. స్మార్ట్ కార్డుల రాకతో డీలర్ల అక్రమాలకు చెక్ పడుతుందని చెప్పుకొచ్చారు. స్మార్ట్ కార్డులతో పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా సమర్థవంతంగా పర్యవేక్షణ జరుగుతుందని వెల్లడించారు. మార్కెట్ ధరలు పెరిగినప్పుడు తప్పకుండా పౌర సరఫరాల ద్వారా అదనపు సరుకులు పంపిణీ చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ఈనెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ ప్రారంభించనున్నట్లు- నాదెండ్ల మనోహర్ తెలిపారు. తొలిరోజు 9 జిల్లాల్లో పంపిణీ చేస్తామన్నారు. సెప్టెంబర్ 15 వరకు మొత్తం 4 విడతల్లో పండుగ వాతావరణంలో స్మార్ట్ కార్డులను అందిస్తామని వివరించారు. 25న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తాం. ఆ తర్వాత ఈనెల 30, వచ్చే నెల 6, 15వ తేదీల్లో విడతల వారీగా మిగిలిన జిల్లాల్లో అందిస్తాం. ప్రజాప్రతినిధులతో గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తాం. 1.45 కోట్ల కుటుంబాలకు మహిళల పేరిట తయారు చేసిన స్మార్ట్ రైస్ కార్డుదారులకు ఉచితంగా ఇంటింటికీ వెళ్లి అందజేస్తాం. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 6.70లక్షల మందితో పాటు- చిరునామా మార్పు చేసుకున్నవారికీ ఇస్తాం. రాష్ట్రంలో ఇతర జిల్లాలకు వలస వెళ్లినవారు.. పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకోవచ్చు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే కుటుంబ వివరాలు సహా సరకుల సమాచారాన్ని క్షణాల్లో తెలుసుకోవచ్చని మనోహర్ తెలిపారు.

# లైసెన్స్‌డు కేబుల్స్ తప్ప అన్నీ తొలగించండి

**- పుట్టినరోజు నాడే బాలుడు తండ్రికి కొరివి పెట్టాడు**

**- ఈ ఘటన తనను ఎంతో కలచి వేసింది**

**- కేబుల్ వైర్ల తొలగింపు విచారణలో జస్టిస్ బీమపాక**

**హైదరాబాద్,ఆగస్ట్22( వెలుతురు):**
పుట్టిన రోజు నాడే తండ్రికి తలకొరివి పెట్టిన బాలుడు ఘటనపై జస్టిస్ నగేష్ బీమాపాక ఉద్వేగ భరిత వ్యాఖ్యలు చేశారు. కేకు కోయాల్సిన తొమ్మిదేళ్ల బాలుడు తలకొరివి పెట్టడం తనను తీవ్రంగా కలచి వేసిందని జస్టిస్ నగేష్ భావోద్వేగానికి గురయ్యారు. విద్యుత్ ప్రమాదంపై ఎవరికి వారు చేతులు దులుపుకుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలకు బాధ్యులు ఎవరని జస్టిస్ నగేష్ బీమాపాక ప్రశ్నించారు. ఈ ఘటనతో ప్రతి హృదయం పగిలిపోయిందని.. అందరం బాధ్యులమేనని జస్టిస్ నగేష్ పేర్కొన్నారు. ఈ విషయంలో సమాజం సిగ్గుతో తలదించుకోవాలని జస్టిస్ బీమాపాక నగేష్ చెప్పుకొచ్చారు. నెట్వర్క్ కేబుల్ వైర్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం మరోసారి విచారణ జరిగింది. రామంతాపూర్ ఘటన తర్వాత హైదరాబాద్లోని పలు ఏరియాల్లో కేబుల్ వైర్లను విద్యుత్ అధికారులు కట్ చేశారు. వైర్లకు తిరిగి కనెక్షన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని ఎయిర్టెల్ సంస్థ కోరింది. అయితే, ఎయిర్టెల్ దాఖలు చేసిన పిటిషన్పై హైకోర్టు విచారణ చేపట్టింది. లైసెన్సు తీసుకున్న కేబుల్స్ తప్ప ఏవీ ఉంచవద్దని జస్టిస్ నగేష్ బీమాపాక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటంపై జస్టిస్ నాగేష్ బీమాపాక సీరియస్ అయ్యారు. రామంతాపూర్లో ఐదుగురు మరణించిన ఘటనను ఈ సందర్భంగా జడ్జి ప్రస్తావించారు. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.



https://epaper.velthuru.com

వెలుతురు

cinema

# మెగాస్టార్‌కు అభినందనల వెల్లువ

## బర్త్‌డే విషెస్ తెలిపిన ప్రముఖులు

'పునాది రాళ్లు' చిత్రంతో తన కెరీర్‌కు పునాది వేసుకొని 'స్వయంకృషి'తో ఉన్నత శిఖరాలను అధిరోహించిన మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. దీంతో ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అభిమానులు, అగ్ర కథనాయకులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని పంచుకుంటూ విషెస్ చెబుతున్నారు. 'హ్యాపీ బర్త్‌డే.. వన్ అండ్ ఓన్లీ మెగాస్టార్ చిరంజీవి గారు' అంటూ అల్లు అర్జున్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో కలిసి డ్యాన్స్ చేస్తోన్న ఫొటోను పంచుకున్నారు. పుట్టినరోజు శుభాకాంక్షలు డియర్ చిరంజీవి. ఎప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఇలాంటి పుట్టిన రోజులు ఎన్నో చేసుకోవాలని కోరుకుంటున్నాను అంటూ వెంకటేశ్ విషెస్ తెలిపారు. చరిత్రలో చిరస్థాయిగా.. మా గుండెల్లో చిరుస్థాయిగా. లవ్‌యూ బాస్. హ్యాపీ బర్త్‌డే అంటూ దర్శకుడు హరీశ్ శంకర్ తెలిపారు. నేను చూసిన మొదటి హీరో మా మామయ్య. ఆయన జీవితం నాకు ఆదర్శం. మామ చేతి నడకే ఈ రోజు నా పయనం. ఆయన నేర్పిన నడవడికే ఓ జీవిత పాఠం. మామయ్యే నా సర్వస్వం. కష్టమైనా, సుఖమైనా.. ఆయన తోడుంటే అదే కొండంత ధైర్యం. మామయ్య మాటే నాకు శాసనం. ఎప్పటికీ ఆయనే నా బలం. మీ మెగాస్టార్.. మన మెగాస్టార్.. నా ముద్దుల మామయ్య చిరంజీవి గారికి జన్మదిన శుభాకాంక్షలు అని సాయి దుర్గా తేజ్ తెలిపారు. మెగాస్టార్ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు. విశ్వంభర గ్లింప్స్, విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని నారా రోహిత్ పేర్కొన్నారు. సెన్సేషన్‌కు 70 ఏళ్లు.. కాలం గడుస్తున్నకొద్దీ మీపై ప్రేమ ఎప్పటికీ పెరుగుతూనే ఉంటుంది. నాలాంటి మిలియన్ల మందిలో స్ఫూర్తి నింపినందుకు కృతజ్ఞతలు సర్ అంటూ తేజ సజ్జా అభిమానం చాటుకున్నారు. ఇండియన్ సినిమా గాడ్ ఫాదర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. మీ సినీ ప్రయాణం ఎంతోమందికి ఆదర్శం. మీ ఎనర్జీ ఓ అద్భుతం. మీ తదుపరి సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అని మంచు మనోజ్ అన్నారు. భారతీయ సినిమాకు గర్వకారణం, మిలియన్ల మంది హృదయస్పందన మా అన్నయ్య మెగాస్టార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ దర్శకుడు బాబీ అభిమానం వెలిబుచ్చారు. తనను తాను శిల్పంగా మలచుకొని కొన్ని తరాల్లో స్ఫూర్తినింపిన పద్మవిభూషణ్ చిరంజీవికి గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు అని దర్శకుడు వంశీ పైడిపల్లి అన్నారు.

# చిరుకు అభినందల వెల్లువ

## బర్త్‌డే విషెస్ తెలిపిన బాబు



ఇక చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న మెగా 157 సినిమా టైటిల్ గ్లింప్స్ బర్త్‌డే సందర్భంగా విడుదలైంది. చిరు లుక్ ఆకట్టుకుంటూ అభిమానుల్లో కొత్త ఉత్సాహం నింపింది. 70 ఏళ్ల వయసులోనూ యంగ్ అండ్ ఎనర్జిటిక్, ఇన్‌స్పైరింగ్ లీడర్‌గా నిలుస్తున్న చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ, దేశం అంతటా అభిమానుల సందడి కొనసాగుతోంది. మెగాస్టార్ చిరంజీవి గారికి హృదయపూర్వక 70వ జన్మదిన శుభాకాంక్షలు. సినీ ప్రయాణం, ప్రజా జీవితం, సేవా కార్యక్రమాల్లో మీ విశిష్టమైన ప్రస్థానం లక్షలాది మందికి ఎంతో స్ఫూర్తినిచ్చింది. మీ ఉదారత, అంకితభావంతో మరెన్నో జీవితాలకు వెలుగునిస్తూ ముందుకు సాగాలని కోరుకుంటు-న్నాను. ఆనందం, ఆరోగ్యంతో మీరు సంతోషంగా కలకాలం జీవించాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

# గోవాలో చిరు బర్త్‌డే వేడుకలు

## కేక్ కట్‌చేసి తినిపించిన చెర్రీ

## మీరెప్పటికీ మా హీరో అంటూ వీడియో షేర్



మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా ఆయన తన కుటుంబంతో కలిసి గోవాలో వేడుకలు జరుపుకున్నారు. బర్త్‌డే వేడుకలు ఎంతో ఘనంగా, సంతోషంగా జరుగుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా చిరుకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిరు తనయుడు మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ తన తండ్రికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ ఎమోషనల్ వీడియోను షేర్ చేశాడు. వీడియోలో చరణ్ తండ్రికి కేక్ తినిపిస్తూ, చిరు పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరూ ప్రేమతో ఆలింగనం చేసుకున్నారు. చిరంజీవి కూడా చరణ్‌కు కేక్ తినిపిస్తూ కుమారుడిపై తనకున్న ప్రేమని తెలియజేశారు. అయితే రామ్ చరణ్ తన తండ్రికి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెట్టిన పోస్ట్ అందరిని టచ్ చేసింది. 'ఇది కేవలం మీ పుట్టినరోజు మాత్రమే కాదు నాన్న... ఇది మీ లాంటి గొప్ప వ్యక్తికి జరుపుతున్న గొప్ప సంబరమూ! నా హీరో, నా గైడ్, నా ప్రేరణ మీరు. నా ప్రతి విజయం, నేను మోసే విలువలు అన్నీ మీ నుంచే వచ్చాయి. 70 ఏళ్ల వయసులో కూడా మీరు మా హృదయంలో యువకుడిగా ఉండి, మాకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మీరు ఆనందంగా, ఆరోగ్యంగా మరెన్నో సంవత్సరాలు ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఎవరైనా కోరుకునే ఉత్తమ తండ్రిగా ఉన్నందుకు ధన్యవాదాలు నాన్న అంటూ రామ్ చరణ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్‌గా మారింది. మెగా అభిమానులు ఈ వీడియోను పెద్దఎత్తున షేర్ చేస్తూ హ్యాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాని షేక్ చేస్తున్నారు.

# మన శంకర వరప్రసాద్ టైటిల్ ఖరారు

## వెంకటేశ్ వాయిస్‌తో విడుదల

మెగా157 । మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు 2025 పుట్టినరోజు మరపురాని వేడుకగా మారబోతోంది. ఫ్యాన్స్ ఆశించినట్లుగానే క్రేజీ అప్‌డేట్స్ వరుసబెట్టి వచ్చేస్తున్నాయి. మెగా అభిమానులు మాత్రమే కాదు, సినీ ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిరంజీవి - అనిల్ రావిపూడి సినిమా -టైటిల్, గ్లింప్స్ ఎట్టకేలకి విడుదలైంది. చిరంజీవి -అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా -టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. 'మన శంకర వరప్రసాద్ గారు అనే -టైటిల్ కొద్ది రోజులుగా ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతుండగా, అదే -టైటిల్‌ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ -టైటిల్‌ను విక్టరీ వెంకటేష్ వాయిస్ ఓవర్‌తో అందించడం స్పెషల్ హైలైట్. చిరంజీవి, వెంకటేష్ మధ్య మంచి స్నేహబంధం ఉండటంతో, ఈ ప్రాజెక్ట్‌లో వెంకీ కీలక పాత్రలో కనిపించనున్నారు. గ్లింప్స్ లో చిరంజీవి సూట్ ధరించి సిగరెట్ తాగుకుంటూ అలా వస్తుండడం చూసి ఫ్యాన్స్ ఆనందం అంతా ఇంతా కాదు. చివరిలో గుర్రం పట్టుకొని నడుచుకుంటూ వచ్చే షాట్ కూడా అదిరిపోయింది. ఇక మన శంకర వర ప్రసాద్ గారు పండక్కి వస్తున్నారు అంటూ వెంకీ చెప్పడం మరో హైలైట్ అయింది. ఈ సినిమా 2026 సంక్రాంతికి థియేటర్లలోకి రాబోతోంది. గతంలో అనిల్ - వెంకటేష్ కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 వంటి హిట్ కామెడీ ఎంటర్-టైనర్లు సంక్రాంతికి రిలీజై ఘన విజయం సాధించిన నేపథ్యం చూస్తే, ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ కావొచ్చన్న అంచనాలు బలపడుతున్నాయి. చిరంజీవి నటిస్తున్న ఫ్యాంటసీ డ్రామా 'విశ్వంభర' నుంచి గ్లింప్స్ ఇప్పటికే రిలీజ్ కాగా, ఇది అలరించింది. ఈ చిత్రం 2026 వేసవిలో థియేటర్లలోకి వచ్చే అవకాశముంది. ఇక ఈ రోజు సాయంత్రం చిరంజీవి - బాబీ కొల్లి కాంబోలో మరో కొత్త సినిమా అనౌన్స్‌మెంట్ ఉంటు-ంది. 'వాల్తేరు వీరయ్య' తరహాలోనే మాస్ మజా ఉన్న సినిమా ఉండబోతుందని సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించనుంది.




# బాస్ పండగకు వస్తున్నాడు

## చిరు సినిమాపై అనిల్ రావిపూడి




'మన శంకరవరప్రసాద్‌గారు'లో వీఎఫ్ఎక్స్ చాలా తక్కువ వాడామని అనిల్ రావిపూడి చెప్పారు. చిన్నప్పటినుంచి చిరంజీవి సినిమాలు చూస్తూ పెరిగానన్నారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ నటిస్తున్న చిత్రానికి 'మన శంకరవరప్రసాద్‌గారు' అనే -టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో అనిల్ మాట్లాడుతూ చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని తెలిపారు. ఈ గ్లింప్స్‌తో సినిమా ఎలా ఉండనుందో అని హింట్ ఇచ్చాను. నేను చిన్నప్పటినుంచి చిరంజీవి సినిమాలు చూస్తూ పెరిగాను. నాకు ఆయన నటించిన రౌడీ అల్లుడు, గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు సినిమాలు చాలా ఇష్టం. ఈ మాట ఎన్నోసార్లు చెప్పాను. మీరందరూ చిరంజీవిని ఎలా చూడాలనుకుంటున్నారో దానికి రెండింతలు 'మన శంకరవరప్రసాద్‌గారు'లో చూస్తారు. పాటలు, వినోదం అన్నీ అద్భుతంగా వచ్చాయి. ఆయన అసలు పేరు శివశంకర వరప్రసాద్‌ను కాస్త మార్చి 'మన శంకరవరప్రసాద్‌గారు' అని పెట్టాం. -టైటిల్ గ్లింప్స్ వీడియోకు వాయిస్ ఓవర్ ఇచ్చినందుకు వెంకటేశ్‌కు థాంక్స్. ప్రస్తుతానికి ఆయన వాయిస్ మాత్రమే విన్నారు. త్వరలోనే ఆయన సినిమాలో ఎంట్రీ- ఇవ్వనున్నారు. చిరంజీవి- వెంకటేశ్ కాంబో ఎలా ఉంటుందో ఈసారి సంక్రాంతికి సర్‌ప్రైజ్‌తో చూస్తారు. ఆ సర్‌ప్రైజ్‌లు అన్నీ ఒక్కొక్కటిగా రివీల్ చేస్తాం అన్నారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన చిరంజీవికి ధన్యవాదాలు. ఆయన పాట, ఆట, మ్యానరిజమ్స్, ఫైట్స్, లుక్స్‌ను అభిమానించని వారు, అనుకరించని వారు ఎవరూ ఉండరు. ఎక్కడో ఒకచోట ఆయనని అనుకరిస్తూనే ఉంటారు. కచ్చితంగా ఈ సినిమా మీ అంచనాలను అందుకుంటుంది. ఇందులో ఆయన కనిపించిన లుక్ ఒరిజినల్. వీఎఫ్ఎక్స్ చాలా తక్కువ వాడాం. 5 శాతం వీఎఫ్ఎక్స్ కూడా లేవు. చిరంజీవి ఈ లుక్ కోసం ఎంతో కష్టపడ్డారు. అది నా అదృష్టం. బాస్ పండగకు వస్తున్నాడు..' అని అనిల్ రావిపూడి తెలిపారు.

# సైన్యానికి రాజువై నడిపించు


## పవన్‌కు చిరు ఆశిస్సులు



నీకు తమ్ముడిగా పుట్టడం నా అదృష్టమంటూ చిరంజీవికి పవన్ విషెస్ చెప్పగా.. నీకు అన్నయ్యని అయినందుకు ఎంతో ఆనందంగా ఉందని చిరు అన్నారు. మెగాస్టార్ చిరంజీవి నేడు 70వ పుట్టినరోజు చేసుకుంటు-న్నారు. ఈసందర్భంగా ఆయనకు సోషల్ మీడియాలో పవన్ ఆయనకు విషెస్ చెప్పారు. ఆ శుభాకాంక్షలకు చిరంజీవి స్పందిస్తూ ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ్ముడికి ప్రేమతో ఓ నోట్ విడుదల చేశారు. తమ్ముడు కల్యాణ్.. ప్రేమతో నీవు పంపిన పుట్టినరోజు శుభాకాంక్షలు అందాయి. అందులోని ప్రతి మాట.. ప్రతి అక్షరం నా హృదయాన్ని తాకింది. నన్ను చూసి నువ్వెంత (శూశ ఔశశా) గర్విస్తున్నావో.. నీ విజయాల్ని, నీ పోరాటాన్ని నేనూ అంతగా ఆస్వాదిస్తున్నాను. నీ కార్యదీక్ష, పట్టుదల చూసి ప్రతి క్షణం గర్వపడుతూనే ఉన్నా. నిన్ను నమ్మినవాళ్లకు ఏదో చేయాలన్న తపనే నీకు ఎప్పటికప్పుడు కొత్త శక్తిని ఇస్తుంది. ఈ రోజు నీ వెనక కోట్లాదిమంది జన సైనికులు ఉన్నారు. ఆ సైన్యాన్ని ఓ రాజువై నడిపించు. వాళ్ల ఆశలకు, కలలకు కొత్త శక్తినివ్వు. అభిమానుల ఆశీర్వాదం, ప్రేమ నీకు మెండుగా లభిస్తూనే ఉండాలి. ఓ అన్నయ్యగా నా ఆశీర్వచనాలు ఎప్పుడూ నీకు ఉంటాయి. నీ ప్రతి అడుగులోనూ విజయం నిన్ను వరించాలని ఆ భగవంతుడ్ని కోరుకుంటు-న్నాను' అంటూ అరుదైన ఫొటోలను షేర్ చేశారు.

# బాలయ్య ఎనర్జీకి ఫిదా అవ్వాల్సిందే

## అఖండ-2 విలన్ ఆది పినిశెట్టి



నందమూరి బాలకృష్ణను చూసినవాళ్లెవరైనా ఆయన ఎనర్జీకి ఫిదా అయిపోవాల్సిందే. తాజాగా టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. బాలయ్యతో కలిసి నటించడం ఓ ప్రత్యేక అనుభవంగా మిగిలిందని చెబుతూ, బాలకృష్ణ గారు ఒక వ్యక్తి కాదు... ఓ శక్తి. ఆయన ఒరిజినల్‌గా స్క్రీన్ మీద కనిపించేలా నిజ జీవితంలోనూ పవర్ హౌస్ లాంటి వ్యక్తిత్వం కలవారు అంటూ పొగడ్తల వర్షం కురిపించారు. తెలుగులో మోస్ట్ అవైటెడ్ మూవీగా వస్తున్న అఖండ 2 కోసం బాలయ్య-బోయపాటి శ్రీను మళ్లీ కలిశారు. ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆయన, బాలయ్య గారి పనితీరు, కష్టపడే తత్వం చాలా మందికి స్ఫూర్తిదాయకం. స్క్రీన్ పైనా, ఆఫ్ స్క్రీన్ పైనా ఆయన ఎనర్జీ అసాధారణం అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వ శైలిపై ఆది ప్రశంసలు కురిపిస్తూ, ఆయన డైరెక్షన్‌లో ఓ మ్యాజిక్ ఉంటుంది. బాలయ్య- బోయపాటి కాంబినేషన్ అంటేనే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉంటాయి. అలాంటి సినిమా లో నాకూ ఛాన్స్ రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. గతంలోనూ బోయపాటి దర్శకత్వంలో పనిచేసిన అనుభవం ఉందని, ఈ సారి మరింత బలమైన పాత్ర దక్కిందని వెల్లడించారు ఆది. తనకు విలన్ పాత్రల్లో నటించడంపై ఉన్న ఆసక్తిని వెల్లడించిన ఆది, విలన్ క్యారెక్టర్లకు ఎలాంటి పరిమితులు ఉండవు. అవి నటనకు విశేషమైన అవకాశాలు కలిగిస్తాయి. మంచివాడు కాదు, చెడ్డవాడు కాదు, మిడిల్‌లో ఉండే పాత్రలే ఎక్కువ బలాన్నిస్తాయి. అందుకే విలన్ పాత్రలు నాకు ఎక్కువ ఇష్టంగా ఉంటాయి అని అన్నారు. ఇక అఖండ 2 సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మొదట భావించగా, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం వల్ల సినిమా వాయిదా పడే అవకాశం ఉందని ఫిలింనగర్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రగ్యా జైస్వాల్, సంయుక్త మీనన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు.

# సరదాగా సాగిన... పరదా మూవీ

చాలా రోజుల తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన మరో నాయికా ప్రధానమైన చిత్రం 'పరదా' . కమర్షియల్ సినిమాల్లో సగటు- హీరోయిన్‌గా, పక్కింటి అమ్మాయిగానే కనిపించిన అనుపమ పరమేశ్వరన్ ఇందులో ప్రధాన పాత్రధారి. యువ దర్శకుడు ప్రవీణ్ కంద్రేగుల ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పడతి అనే ఓ కల్పితమైన ఊరు నేపథ్యంలో సాగే కథ ఇది. అక్కడ ప్రతి యువతీ పరదా కప్పుకొనే తిరగాలనేది ఆచారం. పరదా తీసినట్టు- రుజువైతే మాత్రం గ్రామ దేవత జ్వాలమ్మ ముందు ఆత్మార్పణ చేసుకోవాల్సి ఉంటుంది. అనాదిగా వస్తున్న ఆ ఆచారాన్ని కొనసాగిస్తున్న ఊరి యువతి సుబ్బు (అనుపమ పరమేశ్వరన్) ఊహించని రీతిలో చిక్కుల్లో పడుతుంది. పరదా లేని ఆమె ఫొటో బయటకి రావడమే అందుకు కారణం. తాను ఆచారాన్ని తప్పలేదని వేడుకున్నా... ఆత్మార్పణ చేసుకోవాల్సిందే అని ఊరి ప్రజలు తీర్మానం చేస్తారు. ఒక పక్క తాను మనసిచ్చిన రాజేశ్ (రాగ్ మయూర్)తో నిశ్చితార్థానికి సిద్ధం అవుతుండగానే ఇదంతా జరుగుతుంది. ఆచారం ప్రకారం ప్రాణాలైనా వదలాలి, లేదంటే తప్పు చేయలేదనైనా నిరూపించుకోవాలని కోరతారు ఊరి ప్రజలు. దాంతో సుబ్బు తాను తప్పు చేయలేదని నిరూపించుకోవడం కోసం ధర్మశాలకి పయనం కావాల్సి వస్తుంది. ఆ ప్రయాణం ఎలా సాగింది? తనకి తోడుగా నిలిచిన రత్న (సంగీ), అమిష్ట (దర్శన రాజేంద్రన్) ఎవరు? ఇంతకీ పరదా లేని సుబ్బు ఫొటో ఎలా బయటికొచ్చింది? పడతి అనే ఊరు అనుసరిస్తున్న కఠినమైన ఆ కట్టుబాటు- వెనక చరిత్ర ఏమిటి?సుబ్బు తాను తప్పు చేయలేదని నిరూపించుకుందా లేదా అన్నకథలో సాగిందీ సినిమా. అప్పుడప్పుడూ కొత్త కథలు అరుదుగా వస్తుంటాయి. చాలా రోజుల తర్వాత తెలుగు తెరపైకి వచ్చిన ఓ కొత్త కథ... 'పరదా'. హీరో, హీరోయిన్, కమర్షియాలిటీ-... తరహా లెక్కల్ని పట్టించుకోకుండా చేసిన ఓ సాహసోపేతమైన ప్రయత్నం. ముగ్గురు మహిళల స్నేహాల్ని, ఒకరి సమస్య కోసం ముగ్గురూ కలిసి చేసిన స్వేచ్ఛా విహారాన్ని అందంగా, ఆలోచన రేకెత్తించేలా ఆవిష్కరిస్తుంది. దైనందిన జీవితాల నుంచి బయటికొచ్చి చేసిన ఆ ప్రయాణం వాళ్లకు ఏం నేర్పింది?వాళ్లలో ఎలాంటి మార్పుని తీసుకొచ్చింది? సమాజం ముందు ఎలాంటి ప్రశ్నల్ని లేవనెత్తిందన్నది ఇందులో కీలకం.




లింగ సమానత్వం అంశాన్ని ఓ కొత్త కోణంలో ఆవిష్కరించిదీ చిత్రం. సమానత్వం అంశం ఎప్పుడు ప్రస్తావనకి వచ్చినా అవతలి వాళ్లవైపు వేళ్లు వెళతుంటాయి. కానీ, ఈ సినిమా అందుకు భిన్నమైన విషయాల్నీ ప్రస్తావించింది. మనుషుల్లో మార్పుని, ఆ అవసరాన్ని సూచిస్తుంది. అయితే, చెబుతున్న కథ కొత్తదైనా... పాతదైనా తెరపై ఎంత ఆసక్తికరంగా సాగిందన్నదే కీలకం. సన్నివేశాలన్నీ ఒక విహారయాత్ర డాక్యుమెంటేషన్‌లా అనిపిస్తుంది తప్ప, కథ కథనాలు ఏమాత్రం ఆసక్తిని రేకెత్తించవు. ముగింపుతోపాటు- పతాక సన్నివేశాలు ఆకట్టు-కుంటాయి. సుబ్బు పాత్రలో ఒదిగిపోయింది అనుపమ పరమేశ్వరన్. ప్రతి సినిమాలోనూ తన కళ్లతోనే భావాలు పలికించే ఆమె ఈ సినిమాలో ఎక్కువభాగం సన్నివేశాల్లో పరదా కప్పుకొనే కనిపిస్తూ ఉంటుంది.

## నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన అజెండా

**- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**





**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
రసూల్ పుర సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్ రూం ప్రాంగణంలోని ప్రజల మంచినీటి అవసరాలను తీర్చేందుకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గారు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ తో శుక్రవారం డబుల్ బెడ్ రూం వాసులతో కలిసి పూజా కార్యక్రమం నిర్వహించి బోర్ వెల్ వేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన అజెండా గా పనిచేస్తానని,గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ నాయకులు ఇక్కడి ప్రజల కనీస అవసరాలు పట్టించుకోలేదని,నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారితో మాట్లాడి నియోజకవర్గానికి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ తీసుకువచ్చానని,తక్షణ అవసరాలైన మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచడానికి నిధులను వెచ్చిస్తున్నామని, నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి గారు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.మీ అందరి ఆశీస్సులతో ఎమ్మెల్యే గా ఎన్నికైన నేను నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## పవన్‌తో అటవీ సిబ్బంది భేటీ

**అమరావతి,ఆగస్ట్22( వెలుతురు):**
శ్రీశైలంలో టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తన అనుచరులతో కలిసి... ఫారెస్ట్ సిబ్బందిని అర్ధరాత్రి కార్లలో తిప్పుతూ చిత్రహింసలకు గురి చేయటం కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన డిప్యూటీ–సీఎం పవన్ కళ్యాణ్.. ఎమ్మెల్యే బుడ్డాపై కేసు నమోదు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. శుక్రవారం అటవీశాఖ మంత్రి అయిన పవన్ కళ్యాణ్ ను కలిసి తమ గోడు విన్నవించుకున్నారు ఫారెస్ట్ సిబ్బంది. ఇదిలా ఉండగా.. ఈ కేసులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని ఏ2 గా చేర్చి.. జనసేన నేత అశోక్ రౌత్ ను ఏ1 గా చేర్చడం హాట్ టాపిక్ గా మారింది. ఇద్దరిపైనా బెయిలబుల్ కేసులు పెట్టడం గమనార్హం. అయితే.. టీ–డీపీ ఎమ్మెల్యేను తప్పించేందుకే ఈ కేసులో ఏ2 గా చేర్చారని, తమ పార్టీ నేతను ఏ1 గా చేర్చారని ఆరోపిస్తున్నారు జనసేన శ్రేణులు.

# తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ చిల్లర పార్టీ అయ్యిందా..!?

### కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్...

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 22:**
కాంగ్రెస్ పార్టీ పై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. శుక్రవారం రోజున గాంధీభవన్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ ఉపరాష్ట్రపతి ఎన్నికల విషయంలో సుదర్శన్ రెడ్డి గారిని అభ్యర్థిగా ఇండియా కూటమి అభ్యర్థిగా ప్రకటించిందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ చిల్లర పార్టీ అయ్యిందా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తరువాత సోనియా గాంధీ ఇంటికి వెళ్లినప్పుడు చిల్లర పార్టీ అనిపివ్వలేదా.. ఇప్పుడు ఎందుకు అనిపిస్తుంది.. తెలంగాణ వచ్చిన తరువాత రాజకీయంగా మీ కుటుంబం వెలుగుతుంది అంటే కారణం అది కాంగ్రెస్ పార్టీ కాదా..థర్డ్ క్లాస్ పార్టీ అని ఎలా అంటావు.. సోనియా గాంధీ వలనే తెలంగాణ వచ్చిందని మీ నాన్న కేసీఆర్ అసెంబ్లీ లో చెప్పారు మరిచి పోయావా కేటీఆర్. కాంగ్రెస్ పార్టీ థర్డ్ క్లాస్ పార్టీ అయితే..మీ నాన్న రాజకీయ ప్రయాణం కాంగ్రెస్ నుండి ప్రారంభం అయ్యింది అది మర్చిపోయావా..అయితే మీ నాన్న థర్డ్ క్లాస్ నాయకుడు అయినట్టే కదా.. దేశానికి స్వతంత్రం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ..దేశానికి స్వతంత్రం తెచ్చిన పార్టీ నీ



పట్టుకుని ఇలాంటి మాటలు ఎలా మాట్లాడాలని అనిపించింది కేటీఆర్.. కాంగ్రెస్ పార్టీ సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే ఇన్ని వేల కోట్లు సంపాదించకపోతువు.. నువ్వు ఉద్యోగం చేసుకుంటూ అమెరికా లోనే బతికేవాడివి.. తెలంగాణ బిడ్డ ను ఉప రాష్ట్రపతి అభ్యర్థి గా నిలబెడితే ఒక తెలంగాణ బిడ్డకు ఓటు వేయాల్సింది పోయి ఈ మాటలు అన్ని ఎందుకు కేటీఆర్. నా ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం చెప్పాలి. కేటీఆర్ కు ఇంకా పొలిటికల్ మెచ్యూరిటీ రాలేదు. బాధ్యాయతంగా కేటీఆర్ మాట్లాడుతున్నారు.. కాంగ్రెస్ తిట్టడంను వాళ్ళ తాత నానమ్మ చూస్తే కెటిఆర్ ను తిడతారు.. త్యాగాలు చేస్తే వాటి విలువ కెటిఆర్ కు తెలుస్తుంది. కేటీఆర్ ఒక డ్రామా ఆర్టిస్ట్. కేసీఆర్ దీక్ష డిజైన్ చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులు..కేసీఆర్ తినుకుంటూ దీక్ష చేసిన జనాలు ఒప్పుకున్నారు.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలనే బలమైన నినాదం కోసం జనాలు ఒప్పుకున్నారు.. 69 ఏండ్ల లో ఉమ్మడి రాష్ట్రం అప్పు 60,000 వేల కోట్ల అప్పు..తెలంగాణ ఏర్పడ్డ తరువాత రాష్ట్రం అప్పు 7,00,000 కోట్ల అప్పు అయ్యింది.. రాజకీయంగా పోటీ ఉండాలంటే %ఎతీం% మాకు మాత్రమే పోటీ ఉండాలి.మేము ఇద్దరం సెక్యులర్ పార్టీలం..బీజేపీ మతతత్వ పార్టీ. సంగారెడ్డి ప్రజలకు మంజీరా నీళ్లు ఇవ్వాలని,నిధుల కోసమని నేను సెక్రటేరియట్ కూర్చొని రివ్యూ చేసాను తప్పు ఏముంది నేను ఏమైనా దందా లు చేశానా.. మీ లాగా బావ,బామ్మర్ది, చెల్లె లాగ రాష్ట్ర ఆస్తులు పంచుకున్నామా..నేను జనాల కోసం పని చేస్తున్న.. కిషన్ రెడ్డి స్ట్రీట్ లీడర్.. ప్రచారక్ రాసిచ్చిన పేపర్ ను కిషన్ రెడ్డి చదవాలి అంతే.. ఎరువులు ఇవ్వకపోతే రైతులలో వ్యతిరేకత వస్తే దాన్ని అందిపుచ్చుకోవాలని బీజేపీ చూస్తుంది. రైతులకు రైతు బంధు రుణమాఫీ చేసింది.. ఎరువులు ఇవ్వడం మాకు వచ్చిన తలనొప్పి ఏంటిది..రాష్ట్రానికి ఎరువులు రాకుండా కిషన్ రెడ్డి కుట్ర చేస్తున్నారు.. దేశంలో అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రాలకు ఎరువులు వస్తాయి..మన రాష్ట్రానికి ఎరువులు రాకుండా చేసే కుట్ర కిషన్ రెడ్డి చేస్తున్నాడు. దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే ఇలా ఎరువుల ఇబ్బంది వచ్చి ఉండేది కాదు. యూరియా విషయంలో రైతులకు కోపం వచ్చి ధర్నాలు చేసిన రైతుల ముసుగులో బీజేపీ నేతకు ధర్నాలు చేసిన పోలీస్ లు లాఠీ లకు పని చెప్పకండి.. సంయమనం పాటించండి..

# వీధికుక్కల బెడదపై సుప్రీం కీలక ఆదేశాలు

**- బబహిరంగ ప్రదేశాల్లో ఆహారం నిషేధం**

**- నిర్దేశిత స్థలాల్లోనే ఆహార ఏర్పాట్లు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్22( వెలుతురు):**
వీధి కుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు వెలువరించింది. వీధులు లేదా బహిరంగ ప్రదేశాల్లో వీటికి ఆహారం అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలని, ఇందుకోసం అధికారులు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఆహారం అందించాలని సూచిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటు–చేయాలని వెల్లడించింది. దీనిని ధిక్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. వీధి కుక్కల బెడదను తగ్గించే క్రమంలో సుప్రీం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదని, ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు




ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటు–చేసుకుంటున్నాయని వచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకొని ఈ ఆదేశాలు జారీచేస్తున్నట్లు– చెప్పింది. సామాన్య పౌరులు వీధుల్లో నడిచేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటు–వంటి పద్ధతికి స్వస్తి పలకాలని అభిప్రాయపడింది.దిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తరలించాలంటూ ఆగస్టు 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. వీటి దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తంచేసిన ద్విసభ్య ధర్మాసనం దిల్లీలో అవి ఎక్కడా కనిపించ డానికి వీల్లేదని, వీటిని షెల్టర్లకు తరలించాలని తీర్పు చెప్పింది. ఈ ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈసందర్భంగా రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశించింది. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించిన న్యాయస్థానం.. తదుపరి విచారణ ఎనిమిది వారాలకు వాయిదా వేసింది.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com